




www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI






ఆదివారం | 29-12-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 271 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి తె. 4.02 తదుపరి అమావాస్య; నక్షత్రం: జ్యేష్ఠ రా.11.22 తదుపరి మూల; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: సా.4.18-5.02; అమృతఘడియలు: మ.2.08-3.49; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 5.46 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## తారలు.. దిగివచ్చిన వేళ!

కడవడంత గుమ్మడి కాయ కత్తిపీటకు లోకువ అన్నట్టుగా ఎంత పెద్ద స్టార్ అయినా పొలిటికల్ స్టార్ ముందు తల వంచాల్సిందే నని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుజువు చేశారు. తెలంగాణలో బెనిఫిట్ షోలు ఉండవు, సినిమా టికెట్ ధరలను పెంచుకో నివ్వమని రేవంత్ ప్రకటించడంతో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు వణికిపోయారు. సీఎంని శాంతింపజేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఫలించలేదు.

*అల్లు అర్జున్ వ్యవహారంలో ముఖ్యమంత్రి చర్యలను దాదాపు 70 శాతం మంది ప్రజలు సమర్థిస్తున్నట్టు సమాచారం. టీ కప్పులో తుఫాను వంటి ఒక సమస్య ఇంత రచ్చకు దారి తీయడం వెనుక కారణం ఏవిటి? రేవంత్ రెడ్డికి అంత కోపం ఎందుకు వచ్చింది?*

సంధ్య థియేటర్ సంఘటనలో ఒక మహిళ మృతి చెందిన వెంటనే పుష్ప-2 సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన అల్లు అర్జున్ బేషరతుగా క్షమాపణలు చెప్పి ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదు. ఆ సినిమా సక్సెస్ మీట్ సందర్భంగా సీఎం రేవంత్ పేరును అల్లు అర్జున్ మరచిపోయారు. దీనికి విచారం వ్యక్తం చేయాలని సీఎం సన్నిహితులు కొందరు అల్లు అర్జున్‌కు సూచించగా, రాజకీయాలతో తనకు సంబంధం లేదంటూ ఆయన ఆ సూచనను పెడచెవిన పెట్టారు. దీంతో ప్రభుత్వ పెద్దలకు కోపం వచ్చింది. అన్నిటికి మించి రేవంత్ శాసనసభలో చేసిన ప్రకటనను తప్పు పట్టే విధంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సలహాను ఆయనకు ఎవరిచ్చారో తెలియదు. విచిత్రం ఏమిటంటే, వాస్తవ పరిస్థితిని అల్లు అర్జున్‌కు చెప్పడానికి ఎవరూ సిద్ధపడలేదట! హీరో గారికి కోపం వస్తుంది, మూడ్ మారిపోతుందని చుట్టూ ఉన్న వారు అన్నారట! అనేక ఎగుడు దిగుడులు చూసిన అల్లు అరవింద్ అయినా విలేకరుల సమావేశం వద్దని కుమారుడిని వారించి ఉండాల్సింది. అల్లు అర్జున్ తండ్రి మాట కూడా వినరు అని అంటారు.


కొత్త పలుకు

*గతంలో ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు బాధితుల సహాయార్థం బెనిఫిట్ షోలను ప్రదర్శించేవారు. ఇప్పుడు సినిమాలపై పెట్టిన పెట్టుబడిని త్వరితగతిన రాబట్టుకోవడానికి ప్రత్యేక షోలు వేస్తున్నారు. భారీగా ఖర్చు పెట్టి గ్రాఫిక్స్ మాయాజాలంతో నటన, కథతో సంబంధం లేని సినిమాలను పెద్ద సినిమాలుగా ప్రచారం చేసుకుంటున్నారు. సృజనాత్మకత స్థానంలో గ్రాఫిక్స్ చేరాయి. మలయాళ చిత్ర పరిశ్రమనే తీసుకుందాం! అక్కడ తక్కువ బడ్జెట్‌తో అద్భుతమైన కథలను తెరకెక్కిస్తున్నారు. ఊరూ పేరూ తెలియని నటులతో సినిమాలు తీసి ప్రేక్షకాదరణ పొందుతున్నారు. భాష తెలియకపోయినా తెలుగు వాళ్లు కూడా మలయాళ సినిమాలను చూసి ఆనందిస్తున్నారు.*

నటులకు, దర్శకులకు వందల కోట్ల పారితోషికం చెల్లించడం తెలుగు చిత్ర పరిశ్రమలోనే జరుగుతోంది. దీంతో తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రజలలో సానుకూల అభిప్రాయం స్థానే నెగెటివ్ భావన ఏర్పడింది. వెరసి చిత్ర పరిశ్రమ పట్ల ఇప్పుడు ఎవరికీ సానుభూతి లేకుండా పోయింది. భారీ బడ్జెట్ సినిమాల పేరిట ప్రేక్షకులను దోచుకుంటున్నారన్న అభిప్రాయం క్రమంగా ప్రజల్లో ఏర్పడింది.

4

*కథా బలంతో పాటు నటనకు ఆస్కారం ఉన్న మలయాళ చిత్రాలను తెలుగు వాళ్లు కూడా ఆదరిస్తున్నప్పుడు మనం కూడా ఆ దిశగా ప్రయత్నం చేద్దామన్న ఆలోచన మనవాళ్లకు రావడం లేదు. తెలుగు స్టార్లు, ఆ మాటకు వస్తే ఏ భాషకు చెందిన స్టార్లయినా పులులు, సింహాలు కారని, రాజకీయ అధికారానికి తలవంచక పోతే తిప్పలు తప్పవని అల్లు అర్జున్ వ్యవహారంతో మరోమారు స్పష్టమైంది.*

స్టార్లుగా వెలుగొందుతున్న వాళ్లు కూడా అహం తగ్గించుకోవాలి. పుష్ప-2 సినిమాలో స్మగ్లర్‌తో ఫొటో దిగడానికి నిరాకరించిన సీఎంనే మార్చినట్టు చూపించి ఉండవచ్చు కానీ, నిజ జీవితంలో సీఎంలతో పెట్టుకుంటే ఏమవుతుందో యావత్ సినిమా పరిశ్రమకూ ఇప్పుడు తెలిసి వచ్చింది.


మన్మోహన్ అంతిమయాత్ర వాహనంపై రేవంత్, రాహుల్

## నిష్కళంక నాయకా.. సెలవిక!

ఆర్థిక సంస్కర్త మన్మోహన్‌సింగ్‌కు అంతిమ వీడ్కోలు
యమున ఒడ్డున లాంఛనాలతో అంత్యక్రియలు
చితికి నిప్పంటించిన పెద్ద కుమార్తె ఉపిందర్ సింగ్
రాష్ట్రపతి, ప్రధాని, సోనియా, రాహుల్, రేవంత్ నివాళి
పాడె మోసిన రాహుల్‌గాంధీ.. వాహనంపై రేవంత్
శ్మశానవాటికలో అంత్యక్రియలపై కాంగ్రెస్ అభ్యంతరం
స్మారకానికి స్థలమిస్తాం.. రాజకీయం తగదు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు యావత్ భారతావని కన్నీటి నివాళులర్పించింది. దేశ ఆర్థిక సంస్కర్తకు శనివారం ఉదయం ఢిల్లీలో యమునానది ఒడ్డున ఉన్న నిగమ్ బోద్ ఘాట్‌లో కేంద్ర ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ఆయన పెద్ద కుమార్తె ఉపిందర్‌సింగ్ మన్మోహన్‌సింగ్ చితికి నిప్పంటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, స్పీకర్ ఓంబిర్లా, కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ,

మిగతా 2వ పేజీలో...

రేపు అసెంబ్లీ ప్రత్యేక భేటీ.. మన్మోహన్‌కు సంతాపం 13

# ఆర్ ఆర్ ఆర్ రైట్ రైట్

### ఉత్తరభాగం పనులకు పచ్చజెండా.. టెండర్లు ఆహ్వానించిన ఎన్‌హెచ్ఏఐ



ఈ నెల 27నే మొదలు.. ఫిబ్రవరి 14వరకు అవకాశం
ఫైనాన్షియల్ బిడ్, టెక్నికల్ బిడ్ వేయాలని సూచన
161 కి.మీ., 5 ప్యాకేజీలు, రూ.7,104 కోట్లతో ప్రాజెక్టు
గిర్మాపూర్ నుంచి రాయగిరి వరకు నిర్మాణానికి టెండర్లు
ఈపీసీ విధానంలోనే.. ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
ఇంకా పూర్తికాని భూసేకరణ.. ఖరారు కాని పరిహారం
పెండింగ్‌లోనే ఎన్‌హెచ్ సంఖ్య.. పర్యావరణ అనుమతులు
టెండర్ల గడువుకల్లా ఈ పనుల పూర్తికి కేంద్రం యోచన!

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ పనులను ప్రారంభించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 27నే టెండర్లను ఆహ్వానించి.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14ను చివరి తేదీగా గడువు విధించింది. ఆ లోపు కాంట్రాక్టర్లు బిమ్స్, ఈ-టెండర్స్ పోర్టళ్లలో టెండర్లను దాఖలు చేయవచ్చని పేర్కొంది. దాఖలైన టెండర్లను వచ్చే ఏడాది ఫిబ్రవరి 17న ఉదయం 11.30 గంటలకు తెరవనున్నట్టు తెలిపింది. రూ.7,104 కోట్లతో 161 కిలోమీటర్ల పొడవు రోడ్డును 5 ప్యాకేజీల్లో నిర్మాణం చేసేలా కిలోమీటర్ల వారీగా వివరాలను టెండర్లలో వివరించింది. అంతేకాకుండా ఈ రహదారిని ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో నిర్మించాలని టెండర్ నోటీసులో పేర్కొంది. అయితే కాంట్రాక్టర్లు తమ టెండర్లను ఫైనాన్షియల్ బిడ్‌తోపాటు టెక్నికల్ బిడ్‌ల వారీగా సమర్పించాలని సూచించింది. ఈ రహదారిని 4లేన్లతో 'యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్ వే' విధానంలో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా నిర్మించనున్నారు. టెండర్లు ఖరారయి, పనులు

మిగతా 13వ పేజీలో...

### గడువు ముగిసినా.. ఒక్క టెండరూ రాలే! 13

ఆర్ఆర్ఆర్ దక్షిణం డీపీఆర్ తయారీలో పరిస్థితిదీ..
టెండర్లు రీకాల్.. జనవరి 20దాకా గడువు



## అదరగొట్టిన కుర్రోడు

ఆస్ట్రేలియా గడ్డపై తెలుగోడు నితీశ్ అద్భుత శతకం
బాక్సింగ్ డే టెస్టులో భారత్‌ను నిలిపిన ఇన్నింగ్స్

**21**ఏళ్ల కుర్రాడు...88వ నంబరు జెర్సీ వేసుకున్నాడు... 8వ ఆటగాడిగా వచ్చాడు... స్టేడియంలో 80వేల మంది ప్రేక్షకులు... టీవీల ముందు లక్షల మంది వీక్షకులు! ఎదురుగా ఉన్నది కంగారూలు! ఆడుతున్నది ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో! ఎక్కడా తడబడని బ్యాటు... గురి తప్పని షాటు! ఒక్కో పరుగు జోడిస్తూ అద్భుత సెంచరీ. ఇది... విశాఖపట్నం కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి సింహనాదం! అంచనాల్లేకుండా ఆస్ట్రేలియా పర్యటనకు వచ్చిన ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ బాక్సింగ్ డే టెస్టులో భారత జట్టుకు ఆపద్బాంధవుడయ్యాడు. క్లాస్ ఆటతో కంగారూ బౌలర్లకు ఎదురు నిలిచాడు. రక్షణాత్మక ఆటకే పరిమితం కాకుండా.. బ్యాటింగ్ బుక్‌లోని అన్ని షాట్లను ఆడుతూ ఔరా అనిపించాడు. వాషింగ్టన్ సుందర్ (50)తో కలిసి కీలక భాగస్వామ్యంతో ఫాలో ఆన్ గండం నుంచి తప్పించాడు. విజయంపై ధీమాతో మూడో రోజు మైదానంలోకి వచ్చిన ఆసీస్ జట్టు ఆశలపై నితీశ్ నీళ్లు కుమ్మరించాడు. 11

## సంక్రాంతిలోపే భూ భారతి!



నిబంధనల రూపకల్పనలో సీసీఎల్ఏ
పోర్టల్ డ్యాష్‌బోర్డుకు మూడు రకాల ప్రతిపాదనలు
ధరణిలో 11 మాడ్యూల్స్.. భూభారతిలో ఆరే
11 కాలమ్స్‌తో అందుబాటులోకి పహణీ
సీఎం ఆమోదం, గవర్నర్ నోటిఫైతో వెంటనే అమల్లోకి

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్‌ను ప్రభుత్వం సంక్రాంతిలోపే అందుబాటులోకి తేచ్చే అవకాశాలున్నట్టు సమాచారం. భూభారతికి సంబంధించి సీసీఎల్ఏ మూడు రకాల ప్రతిపాదనలు రూపొందించింది. ఒకటి.. భూభారతి ప్రధాన శీర్షికగా సీఎం చిత్రం, రాష్ట్ర ప్రభుత్వ లోగోతో కీలక అంశాలన్నీ కనిపించేలా చేయడం.. మరొకటి.. సీఎం, డిప్యూటీ సీఎం చిత్రాలను జోడించి కీలక అంశాలన్నీ తొలి పేజీలో కనిపించేలా చేయడం.. ఇంకొకటి ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సులువుగా తెలుసుకునేలా, ఎక్కువ మంది పరిశీలించే అంశాలన్నీ ఒకే చోట కనిపించేలా చేయడం! ఇలా మొత్తమ్మీద ప్రాథమికంగా మూడు రకాల ప్రతిపాదనలను రూపొందించారు. గతంలో ఉన్న ధరణి పోర్టల్‌లో 33 మాడ్యుల్స్ ఉండగా భూభారతిలో వాటిని ఆరుకు కుదించారు. 11 కాలమ్స్‌తో కొత్తగా భూభారతిలో పహణీని పునరుద్ధరించడంతో ఈ వివరాలు కూడా పోర్టల్ ద్వారా తెలుసుకునేలా డిజైన్ చేస్తున్నారు. తొలుత నమూనా అంశాలతో పోర్టల్ డిజైన్‌లు చేస్తున్నారు. ఆపరేషనల్ గైడ్‌లైన్స్ వచ్చాక పూర్తి స్థాయి పోర్టల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకోసం రెవెన్యూ శాఖ అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సీసీఎల్ఏ, ఎన్ఐసీ నేతృత్వంలో అధికారులు

మిగతా 14వ పేజీలో...



## 7న విచారణకు రండి

ఫార్ములా-ఈ రేసు కేసులో కేటీఆర్‌కు ఈడీ సమన్లు
2, 3 తేదీల్లో అర్వింద్, బీఎల్ఎన్ రెడ్డిల విచారణ
హవాలా, ఫెమా చట్టాల కింద..
విదేశీ కంపెనీకి నిధుల చెల్లింపుపై ప్రశ్నలు
ముగ్గురి ఫోన్లను ఈడీ సీజ్ చేసే అవకాశం

హైదరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) ఫార్ములా ఈ కారు రేసు కేసులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సమన్లు జారీ చేశారు. జనవరి 7న విచారణకు హాజరు కావాలని స్పష్టం చేశారు. ఇదే కేసుకు సంబంధించి నాటి పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్‌ను జనవరి 2న, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్‌రెడ్డిని జనవరి 3న

మిగతా 12వ పేజీలో...

## ఐటీ ఊరట! 2

- రూ.15 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి కేంద్ర బడ్జెట్‌లో పన్ను తగ్గించే యోచన!
- కొత్త విధానంలోని వారికి వర్తించే అవకాశం

## మంచు కురిసే వేళలో..



పై చిత్రాన్ని చూసి ఇదేదో సాయం సంధ్య వేళ తీసినది అనుకున్నా... ఆ మంచును గమనించి ఎక్కడో ఉత్తరాది రాష్ట్రాల్లో తీసిన ఫొటో అని అనుకున్నా.. మీరు మంచు ముక్క కొరికినట్టే.. ఎందుకుంటే మన తెలంగాణలో తీసిన ఫొటో ఇది. భువనగిరి శివారులోని వరంగల్- హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం 9.15 గంటలకు 'ఆంధ్రజ్యోతి' కెమెరా ఈ దృశ్యాన్ని బంధించింది. భువనగిరి ప్రాంతంలో ఉదయం పది తర్వాత కూడా మంచు ప్రభావం కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగానూ చలి, మంచు తీవ్రత కొనసాగుతున్నాయి. శనివారం అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 13.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.


హిమకశ్మీరం.. ఉత్తరాదిని కమ్మేసిన మంచు 2

## మనోళ్ల ఖర్చు ఎక్కువే

నెలవారీ కుటుంబ వ్యయం తెలుగు రాష్ట్రాల్లోనే అధికం
తెలంగాణ పట్టణాల్లో రూ.9,131; ఏపీలో 9,877
పల్లెల్లోనే తక్కువ.. రాష్ట్రంలో 5,675, ఏపీలో 6,107
గృహ వినియోగ వ్యయ సర్వే తొలి ఐదు స్థానాల్లో
కేరళ, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక

న్యూఢిల్లీ, డిసెంబరు 28: ప్రతినెల కుటుంబ అవసరాలకు మీరు ఎంత ఖర్చుపెడుతుంటారు? గ్రామీణ కుటుంబమైతే ఎంత ఖర్చు పెడతారు? పట్టణాల్లో ఉండే కుటుంబానిదెంత ఖర్చు? ఆసక్తికరమైన విషయమే కదా ఇది! పట్టణాల్లో కుటుంబాల నెలవారీ తలసరి వినియోగం (ఎంపీసీఈ)లో తెలుగు రాష్ట్రాలు మిగతా రాష్ట్రాలకన్నా ముందున్నాయి. తెలంగాణ పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాలు నెలకు రూ.9,131 ఖర్చు పెడుతుంటే, ఏపీ పట్టణప్రాంతాల్లో

మిగతా 2వ పేజీలో...


హైదరాబాద్‌లోని సూరారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం రాత్రి రద్దీ

## మంచి రోజు.. రిజిస్ట్రేషన్ల జోరు

రాష్ట్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట.. రాత్రి 8 గంటల తర్వాతా రద్దీ
కొన్ని చోట్ల అర్ధరాత్రి వరకూ.. ఈ ఏడాదికి ఇదే మంచి రోజు అని ప్రజల భావన
3 రోజుల తర్వాత ఆఫీసులు తెరచుకోవడం మరో కారణం.. రిజిస్ట్రేషన్‌లు రెట్టింపు
ఒక్క రోజే ప్రభుత్వానికి రూ.100 కోట్లకు పైగా ఆదాయం 13

## సహనటికి లైంగిక వేధింపులు..
# కన్నడ టీవీ నటుడు చరిత్ అరెస్టు



బెంగళూరు, డిసెంబరు 28: కన్నడ టీవీ నాటికల్లో ప్రముఖ నటుడు చరిత్ బాలప్ప శుక్రవారం అరెస్టు అయ్యాడు. సహ నటిని లైంగిక వేధింపులకు గురి చేయడం, మాట వినకుంటే చంపేస్తానని బెదిరించాడనే ఆరోపణలపై బెంగళూరులోని రాజేశ్వరీ పేట పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కన్నడలో ముద్దు లక్ష్మి అనే నాటికతో పేరొందిన చరిత్.. పలు తెలుగు నాటికల్లోనూ నటించాడు. కన్నడ, తెలుగు నాటికల్లో నటించే ఓ నటి(29) బాలప్ప తనని వేధిస్తున్నాడంటూ డిసెంబరు 13న పోలీసులను ఆశ్రయించింది. చరిత్ ప్రేమ పేరుతో తనకు దగ్గరై బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదు చేసింది. కాగా, చరిత్‌కు ఇది వరకే వివాహమవ్వగా న్యాయస్థానం ద్వారా భార్య నుంచి విడాకులు తీసుకున్నారు. భరణం కోసం నోటీసులు పంపిన మాజీ భార్యను చరిత్ బెదిరించడంతో జూన్‌లో ఆయనపై ఓ కేసు నమోదైంది.

## భారత్ నుంచి బంగ్లాకు 2 లక్షల టన్నుల బియ్యం

న్యూఢిల్లీ, డిసెంబరు 28: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్ నుంచి భారీగా బియ్యం దిగుమతి చేసుకొంటోంది. ఇప్పటికే మొదటి విడతగా 27,000 టన్నుల బియ్యం చిట్టగాంగ్ రేవు ద్వారా బంగ్లాదేశ్ చేరుకున్నాయి. 2,00,000 టన్నుల బియ్యం భారత్ నుంచి దిగుమతి చేసుకోనున్నామని ఓ బంగ్లాదేశ్ ఆహార అధికారి శుక్రవారం వెల్లడించారు. తమ దేశంలో ఇటీవల వచ్చిన భారీ వరదలను దృష్టిలో ఉంచుకుని బియ్యం కొరత ఏర్పడకుండా బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన చెప్పారు. ఈ 2 లక్షల టన్నుల పార్‌బాయిల్డ్ బియ్యంతోపాటు మరో లక్ష టన్నుల బియ్యం టెండర్ ద్వారా భారత్ నుంచి కొననున్నట్లు ఆయన చెప్పారు. ఇంతేగాక రెండు దేశాల ప్రభుత్వాల మధ్య సంప్రదింపులతో మరిన్ని బియ్యాన్ని భారత్ నుంచి దిగుమతి చేసుకోనున్నట్లు ఆయన చెప్పారు. భారత్ నుంచి 16 లక్షల టన్నుల బియ్యం దిగుమతి చేసుకొనేందుకు ప్రైవేటు వ్యాపారులు అనుమతులు తీసుకొన్నారు.

## ఆప్ పథకాలపై విచారణకు ఎల్జీ ఆదేశాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆప్ హామీ ఇచ్చిన పథకాలతో పాటు పంజాబ్ నుంచి ఢిల్లీకి భారీ మొత్తంలో అక్రమ నగదు అందుతోందంటూ కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ చేసిన ఆరోపణలపై ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా విచారణకు ఆదేశించారు. తన ఇంటి వెలుపల పంజాబ్ ఇంటెలిజెన్స్ సిబ్బంది నిఘా పెట్టారని.. తన కాల్స్ స్నూపింగ్ చేస్తున్నారంటూ ఎల్జీకి ఈనెల 25న రాసిన లేఖలో దీక్షిత్ తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు పంజాబ్ ప్రభుత్వం ఢిల్లీకి కోట్ల రూపాయల డబ్బును పంపుతోందని.. పంజాబ్ పోలీసుల ఎస్కార్ట్ మధ్య ప్రైవేటు వాహనాలు హరియాణా, రాజస్థాన్ మీదుగా ఢిల్లీకి వస్తున్నాయని లేఖలో ఆరోపించారు. పథకాల లబ్ధిదారుల నమోదు పేరిట ప్రైవేటు వ్యక్తులు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారన్నారు. ఈ ఆరోపణలపై డివిజనల్ కమిషనర్‌తో విచారణ జరిపించాలని సీఎస్‌ను ఎల్జీ ఆదేశించారు.

## అన్నావర్సిటీలో అత్యాచారం ఘటన
## ఎఫ్ఐఆర్ లీకేజీపై మద్రాసు హైకోర్టు ఆగ్రహం

చెన్నై, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై అన్నా విశ్వవిద్యాలయంలో ఈ నెల 21న ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు బహిర్గతం కావటంపై మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేగాక ఈ కేసు దర్యాప్తు జరుగుతున్నప్పుడే చెన్నై నగర పోలీసు కమిషనర్ అరుణ్ మీడియా సమావేశంలో నిందితుడికి సంబంధించిన కీలక వివరాలు వెల్లడించడాన్ని తప్పుబట్టింది. ఎఫ్ఐఆర్ లీకేజీకి కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. అదేవిధంగా బాధితురాలికి మధ్యంతర నష్టపరిహారంగా రూ.25 లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించడంతో పాటు ఈ ఘటనపై దర్యాప్తు జరిపేందుకు ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను కూడా నియమించింది.

# నిష్కళంక నాయకా.. సెలవిక!





మన్మోహన్ అంతిమ యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ మంత్రి రాజ్‌నాథ్, త్రివిధ దళాల అధిపతులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సహా పలు రాష్ట్రాల సీఎంలు మన్మోహన్ అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. ఆర్మీ ఫిరంగి వాహనంలో ఏఐసీసీ కార్యాలయం నుంచి మన్మోహన్ భౌతికకాయాన్ని నిగమ్ బోధ్ ఘాట్‌కు అంతిమయాత్రగా తీసుకొచ్చారు. అనంతరం 21 తుపాకులతో త్రివిధ దళాల సైనిక వందనం ఇచ్చాయి. మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్, పెద్ద కుమార్తె ఉపిందర్ సింగ్ , రెండో కుమార్తె దమన్ సింగ్, మూడో కుమార్తె అమృత్ సింగ్ నిగంబోధ్ ఘాట్ వద్ద అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తన చివరి ప్రయాణంలోనూ డాక్టర్ మన్మోహన్‌సింగ్ తనకు ఇష్టమైన నీలి రంగు తలపాగా ధరించేలా ఏర్పాట్లు చేశారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గ్యాల్ వాంగ్‌చుక్ సహా పలువురు విదేశీ నేతలు సైతం అంత్యక్రియలకు హాజరయ్యారు. సిక్కు మత సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు నిర్వహించిన అనంతరం చితిని పేర్చి పార్థివదేహాన్ని దహనం చేశారు.

### ఏఐసీసీలో పార్థివదేహం

మన్మోహన్ గురువారం రాత్రి మృతి చెందగా శుక్రవారం ఆయన నివాసంలో పార్థివ దేహాన్ని ఉంచారు. శనివారం ఉదయం గురుద్వార్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, సుమారు 9 గంటలకు కాంగ్రెస్ ప్రధాన కార్యాలయానికి తీసుకొచ్చారు. అక్కడ మన్మోహన్ సింగ్ భౌతిక కాయానికి కాంగ్రెస్ నేతలు ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక సహా కాంగ్రెస్ నేతలు, అభిమానుల నివాళుల తర్వాత 10 గంటలకు అంతిమ యాత్రను ప్రారంభించారు. రాహుల్‌గాంధీ మన్మోహన్ పాడెను మోశారు. పార్థివదేహంతో పాటు అదే వాహనంలో నిగమ్ ఘాట్‌కు వెళ్లారు. అదే వాహనంలో సీఎం రేవంత్ రెడ్డి సైతం ఉన్నారు. రాహుల్‌గాంధీ స్వయంగా రేవంత్‌రెడ్డిని పిలిచి పక్కనే కూర్చోబెట్టుకున్నారు. మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించిన వారిలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజ నరసింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నేతలు మల్లు రవి, బలరాం నాయక్, అనిల్ కుమార్ యాదవ్, సర్వే సత్యనారాయణ, కేవీపీ రామచంద్ర రావు, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేష్ రెడ్డి, దామోదర్ రావు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్, బీజేపీ మాటల యుద్ధం

అంతిమ సంస్కారం, స్మారక స్థూపంపై కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం జరిగింది. ప్రపంచ ప్రఖ్యాతి గడించిన మన్మోహన్‌ను బీజేపీ సర్కారు అవమానించిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఆయన బతికున్నంత కాలం ఎప్పుడైనా గౌరవించారా? అంటూ బీజేపీ ఎదురు దాడికి దిగింది. స్మారక నిర్మాణం చేపట్టేందుకు వీలున్న స్థలంలోనే మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలు నిర్వహించాలని కాంగ్రెస్ కోరింది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే శుక్రవారం ఉదయం ప్రధాని మోదీతో ఫోన్‌లో ఈ విషయం మాట్లాడారు. ఆ తర్వాత లేఖ రాశారు. మాజీ ప్రధానులు, రాజనీతిజ్ఞులకు అంత్యక్రియలు నిర్వహించిన ప్రదేశంలోనే స్మారకాలు ఏర్పాటు చేయడం దేశంలో సంప్రదాయంగా వస్తోందని లేఖలో పేర్కొన్నారు. ఖర్గే లేఖపై కేంద్ర హోంశాఖ వివరణ ఇచ్చింది. మన్మోహన్ స్మారకం కోసం ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందని తెలిపింది. స్మారకం నిర్మాణం కోసం ట్రస్టును ఏర్పాటు చేయాల్సి ఉంటుందని వెల్లడించింది. కేంద్రం స్పందించిన తీరుపై కాంగ్రెస్ అసహనం వ్యక్తం చేసింది. మరోవైపు, మన్మోహన్ మరణంపై కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని బీజేపీ జాతీయ నేత సుధాన్షు త్రివేది మండిపడ్డారు. ఇదిలా ఉండగా, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణించినప్పుడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) కనీసం సంతాప సభ నిర్వహించలేదని ఆయన కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ మండిపడ్డారు. మన్మోహన్‌కు స్మారకం నిర్మించాలని ఖర్గే మోదీకి ప్రతిపాదన చేసిన నేపథ్యంలో శర్మిష్ఠ ఈ మేరకు 'ఎక్స్'లో స్పందించారు. '2020 ఆగస్టులో నాన్న చనిపోయినప్పుడు కాంగ్రెస్ నాయకత్వం కనీసం సంతాపం తెలిపేందుకు సీబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు' అని శర్మిష్ఠ పేర్కొన్నారు.

### కేంద్రం అవమానించింది: రాహుల్‌గాంధీ

మన్మోహన్‌ను కేంద్రం అవమానించిందని రాహుల్ ఆరోపించారు. "మన్మోహన్ భారతదేశానికి ముద్దుబిడ్డ. ఆయన హయాంలో దేశం ఎంతో అభివృద్ధి చెందింది. ఆర్థిక రంగంలో దేశం అద్భుతంగా ఎదగడంలో మన్మోహన్ సేవలు వెలకట్టలేనివి. అటువంటి గొప్ప మనిషిని ఎన్డీఏ ప్రభుత్వం అవమానించింది. ఇప్పటివరకు దేశానికి ప్రధానులుగా చేసిన వారికి అంత్యక్రియలు అధికారిక శ్మశాన వాటికలో జరిగేవి. దీనివల్ల ప్రధానుల అంతిమ సంస్కారాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. మరి మన్మోహన్ సింగ్ విషయంలో మాత్రం ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో నిర్వహించారు. అది ముమ్మాటికీ మన్మోహన్‌ను అవమానించడమే" అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.



మన్మోహన్ భౌతికకాయం వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నివాళి



మన్మోహన్ పాడెను మోస్తున్న రాహుల్ గాంధీ

## లోకం తీరు





## వైవీ రెడ్డి బంగారు సలహా!

- యశ్వంత్ సిన్హాతో పాటు మన్మోహన్ సింగ్‌కు బంగారం తాకట్టు ప్రతిపాదన

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

విదేశీ మారక నిల్వల విషయంలో దేశం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణమది. కేవలం వారం రోజుల దిగుమతులకు మాత్రమే సరిపడేలా విదేశీ మారకం నిల్వలు ఉన్నాయి. అలాంటి తరుణంలో మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. బంగారాన్ని తాకట్టు పెట్టడం ద్వారా విదేశీ మారక నిల్వలు పెంచాలని నిర్ణయించారు. వాస్తవానికి మన్మోహన్‌సింగ్ కన్నా ముందు ఆర్థిక మంత్రిగా పనిచేసిన యశ్వంత్ సిన్హాకు కూడా బంగారం విక్రయించి చమురు దిగుమతులకు అవసరమైన నిధులు సర్దుబాటు చేశారు. ఈ ఇద్దరు ఆర్థిక మంత్రులకు బంగారం తాకట్టు సలహా ఇచ్చింది, దాన్ని పూర్తిగా అమలు చేసిన అధికారి వైవీ రెడ్డి. యశ్వంత్ సిన్హా 20 టన్నుల బంగారాన్ని స్విట్జర్లాండ్‌లో తాకట్టు పెట్టారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రిగా వచ్చిన మన్మోహన్‌సింగ్ మరో 47 టన్నుల బంగారాన్ని బ్రిటన్‌లో తాకట్టుపెట్టి అప్పులు తీసుకొచ్చారు. ఆ తర్వాత దేశంలో క్రమేణా ఆర్థిక సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన వారిలో మన్మోహన్‌సింగ్ తోపాటు వైవీ రెడ్డి కూడా ఒకరనేది కొందరికే తెలుసు. కడప జిల్లాలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన వైవీ రెడ్డి అంతర్జాతీయంగా ఆర్థిక సంస్కరణల్లో నిపుణుడిగా పేరుగాంచారు. గల్ఫ్‌లోని బహ్రెయిన్ ప్రభుత్వంతోపాటు చైనాతో సహా అనేక దేశాలతో, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఐరాస ఆర్థిక సంస్కరణ విభాగాల్లో వైవీ రెడ్డి పని చేశారు. ఐఏఎస్ అధికారిగా నల్గొండ, గుంటూరు సహా పలు జిల్లాల్లో కలెక్టర్‌గా పని చేసి ఆర్థిక శాఖకు వచ్చారు. ఆర్థిక రంగంలో ఆయనకున్న అపార అనుభవంతో ఆ తర్వాత ఆయన ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారు.

# మనోళ్ల ఖర్చు ఎక్కువే

(మొదటి పేజీ తరువాయి)

ఈ లెక్క రూ.9,877గా ఉంది. తెలంగాణ పల్లెల్లోని కుటుంబాలు నెలకు రూ.5,675 చొప్పున ఖర్చు చేస్తుంటే.. ఏపీలోనైతే గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,107 ఖర్చు చేస్తున్నాయి. దేశంలో పేదరికం, అసమానతలు, కుటుంబాల ఆర్థిక స్థితిగతులను అంచనా వేసేందుకు 'గృహ వినియోగ వ్యయ సర్వే 2023-24' పేరుతో 2023 ఆగస్టు-2024 జూలై మధ్య రాష్ట్రాలవారీగా ఓ సర్వే నిర్వహించారు. మొత్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,54,357 మంది నుంచి, పట్టణ ప్రాంతాల్లో 1,07,596 మంది నుంచి వివరాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా కుటుంబాలు నెలవారీగా పెడుతున్న ఖర్చులో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. కేరళ, తెలంగాణ, తమిళనాడు, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు నెలవారీ తలసరి వినియోగానికి చేస్తున్న ఖర్చులు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉండడం విశేషం.

### సర్వే విశేషాలు ఇవీ..

**కేరళ:** గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.6,611 ఖర్చు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.7834 ఖర్చు చేస్తున్నారు.

**తమిళనాడు:** గ్రామీణ కుటుంబాలు రూ.5,872 ఖర్చు పెడుతుండగా, పట్టణాల్లోని కుటుంబాలు రూ.8,325 ఖర్చు చేస్తున్నాయి.

**కర్ణాటక:** పట్టణ ప్రాంతాల్లో రూ.8,169 ఖర్చు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఖర్చు నెలకు రూ.5,068గా ఉంది.

**జాతీయ స్థాయి:** గ్రామీణ ప్రాంతాల్లో సగటు ఖర్చు రూ.4,122, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు రూ.6,996 ఖర్చు చేస్తున్నారు.

**పారిశ్రామిక రాష్ట్రాలు:** పారిశ్రామిక రాష్ట్రాలుగా పేరొందిన గుజరాత్, మహారాష్ట్రలలో జాతీయ సగటుకు కొంత అటు ఇటుగా కుటుంబాల నెలవారీ ఖర్చులు ఉన్నాయి.

**ఈశాన్య రాష్ట్రాలు:** ఈశాన్య రాష్ట్రాల్లో నెలవారీ కుటుంబ ఖర్చులో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. సిక్కింలోని గ్రామీణ ప్రాంతాల్లో రూ.9,377 ఖర్చు చేస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో రూ.13,927 ఖర్చు చేస్తున్నారు.



మనాలీలో దట్టమైన మంచు కారణంగా భారీగా నిలిచిన వాహనాలు

## మంచులో చిక్కుకున్న కశ్మీర్, హిమాచల్

- రోడ్లపై దట్టంగా మంచు.. నిలిచిపోయిన వేలాది వాహనాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 28: చలిగాలులతో ఉత్తర భారతదేశం గడ్డకట్టుకుపోతోంది. జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లను మంచు దుప్పటి కప్పేస్తోంది. దట్టంగా కురుస్తున్న మంచు రోడ్లపై అంగుళాల మేర పేరుకుపోతోంది. దీంతో, ముందుకు కదల్లేక వేలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా కాజీగుండ్ ప్రాంతంలో శ్రీనగర్-జమ్మూ హైవేపై 2వేలకు పైగా వాహనాలు మంచులో చిక్కుకుపోయాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో సోలాంగ్ నాలా మార్గంలో వెయ్యికి పైగా వాహనాలు, 5వేల మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. పోలీసులు రోడ్లపై మంచును తొలగించి వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. సహాయచర్యలు కొనసాగుతున్నాయి. మంచు కారణంగా శ్రీనగర్-లేహ్, శ్రీనగర్-జమ్మూ హైవేలను మూసివేశారు. చలిగాలులు, మంచు కారణంగా కశ్మీర్ యూనివర్సిటీ పరిధిలోని అన్ని కాలేజీల్లో పరీక్షలను కూడా వాయిదా వేశారు. ఇక, హిమాచల్ ప్రదేశ్‌లో ఐదు జిల్లాల్లో విపరీతమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. రాబోయే రెండు మూడు రోజుల్లో పంజాబ్, యూపీ, బిహార్, జార్ఖండ్, జమ్మూకశ్మీర్, చండీగఢ్, ఢిల్లీ, హరియాణా, హిమాచల్ ప్రదేశ్‌ల్లో ఉష్ణోగ్రతలు 3-5డిగ్రీల మేర పడిపోవచ్చని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. చలి కారణంగా హరియాణాలో పాఠశాలలకు జనవరి 1 నుంచి 15వరకు సెలవులు ప్రకటించారు.

## కేంద్ర బడ్జెట్‌లో
# ఐటీ ఉపశమనం!

- రూ.15 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్ను తగ్గించే అవకాశం
- కొత్త పన్ను విధానం వారికి వర్తింపు!

న్యూఢిల్లీ, డిసెంబరు 28: వచ్చే ఫిబ్రవరి1న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో పన్ను చెల్లింపుదారులకు కొంత ఊరట లభించే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా వార్షికంగా రూ.15 లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జించే వారు చెల్లించే ఆదాయం పన్నును తగ్గించాలని కేంద్రం యోచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, పన్ను తగ్గింపు ఉపశమనం 2020 పన్ను విధానాన్ని ఎంచుకున్న వారికి అమలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విధానంలో ఇంటి అద్దెలు వంటి మినహాయింపులను మినహాయించారు. ఈ విధానంలో వార్షిక ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఉంటే 5% నుంచి 20% వరకు పన్ను విధిస్తున్నారు. అంతకు మించిన ఆదాయం ఉన్న వారు 30 శాతం పన్ను చెల్లించాల్సి వస్తోంది. కాగా, పన్ను రేట్లను తగ్గించడం వల్ల ఎక్కువ మంది కొత్త విధానాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

## పాక్‌పై అఫ్గాన్ ప్రతీకార దాడులు

- 19 మంది సైనికుల మృతి

కాబూల్, డిసెంబరు 28: తమ దేశంపై దాడులకు ప్రతీకారంగా తాము పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు జరిపామని అఫ్గానిస్థాన్ రక్షణ మంత్రిత్వశాఖ శనివారం ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఈ దాడుల వల్ల పాకిస్థాన్‌కు ఏ మేరకు నష్టం వాటిల్లింది మాత్రం వెల్లడించలేదు. అయితే ఈ దాడుల్లో పాకిస్థాన్‌కు చెందిన 19 మంది సైనికులు మృతిచెందారని హురియత్ డైలీ న్యూస్ వెల్లడించింది. ఈ దాడుల్లో అఫ్గానిస్థాన్‌కు చెందిన ముగ్గురు సైనికులు కూడా మృతి చెందినట్లు పేర్కొంది. కాగా, మంగళవారం అర్ధరాత్రి అఫ్గానిస్థాన్ పక్తికా ప్రావిన్స్ బార్మల్ జిల్లాలోని నాలుగు గ్రామాలు లక్ష్యంగా పాక్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో 46 మంది మరణించారు.

## భారత్‌కు మరిన్ని చీతాలు

భోపాల్, డిసెంబరు 28: రాబోయే రెండు నెలల్లో మరో 20 చిరుత పులులు ఇండియాకు రానున్నాయి. దక్షిణ ఆఫ్రికా అధికారులతో కూడిన టాస్క్ ఫోర్స్ బృందం తరలింపునకు అవకాశం ఉన్న చిరుతలను ఇప్పటికే గుర్తించింది. చిరుతలను ఖండాలను దాటించి తీసుకొని రావడానికి అవసరమైన రవాణా ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని మధ్యప్రదేశ్‌కు చెందిన సీనియర్ అటవీశాఖ అధికారి తెలిపారు. దక్షిణ ఆఫ్రికా, నమీబియా నుంచి గతంలో 20 చీతాలను కునో జాతీయ పార్కుకు తీసుకొచ్చారు. వాటిలో 12 స్థానిక పరిస్థితులకు అలవాటుపడి బతికిబట్టకట్టాయి. వాటికి 14 పిల్లలు పుట్టగా, వాటిలో 12 బతికాయి. మొత్తం 24 చీతాలు ప్రస్తుతం కునో పార్కులో ఉన్నాయి. ఇప్పటి వరకూ ఇవన్నీ ఎన్‌క్లోజర్‌లోనే ఉన్నాయి. వీటినుంచి అగ్ని, వాయు అనే రెండు మగ చీతాలను అటవీ ప్రాంతంలోకి వదిలిపెట్టారు. మరోవైపు ఒక ఆడ చీతాను, రెండు పిల్లలను కునో నుంచి గాంధీ సాగర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి మార్చడానికి సిద్ధమవుతున్నారు.

# ఆస్ట్రేలియా, జర్మనీకి చలో చలో!

**పైచదువుల కోసం భారత విద్యార్థుల మొగ్గు.. శాశ్వత నివాసం, ఉపాధి అవకాశాలూ పరిగణనలోకి**

- కఠిన వీసా నిబంధనలతో

### అమెరికా, యూకేకు దూరం

న్యూఢిల్లీ, డిసెంబరు 28: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తమ ఇమిగ్రేషన్ విధానాలను సవరిస్తున్నాయి. కొన్ని దేశాలు వీసా నిబంధనలను సడలిస్తుంటే మరికొన్ని కొత్తగా పరిమితులు విధిస్తున్నాయి. ఈ మార్పుల ప్రభావం విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించాలనుకొనే భారతీయ విద్యార్థులపై పడుతోంది. కొన్నేళ్లుగా మన దేశ విద్యార్థులకు అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా గమ్యస్థానాలుగా ఉన్నాయి. చదువు పూర్తయిన తర్వాత ఉపాధితో పాటు శాశ్వత నివాసానికి అవకాశం కల్పించే దేశాలవైపు ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ విషయంలో ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ వంటి దేశాలు భారతీయ విద్యార్థులకు ఆకర్షణీయమైన ఎంపికలుగా మారుతున్నాయి. దీనికి విరుద్ధంగా అమెరికా, యూకే ఈ ప్రక్రియలను సరళతరం చేయడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు భారతీయ విద్యార్థులకు మొదటి ఎంపికగా ఉన్న అమెరికాకు కొంతకాలంగా దరఖాస్తులు తగ్గుముఖం పట్టాయి. సంక్లిష్టమైన వీసా నిబంధనలు, పెరుగుతున్న తిరస్కరణ రేట్లు, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు వంటి అంశాలు విద్యార్థులను పునరాలోచనలో పడేస్తున్నాయి. ట్రంప్ మళ్లీ అధికారంలోకి రావడంతో భారతీయ విద్యార్థులకు మరింత అనుకూలమైన ఇమిగ్రేషన్ విధానాలు, గ్రీన్ కార్డు జారీలో సడలింపులు ఇస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

### కెనడా ఆంక్షలు కఠినతరం

స్నేహపూర్వ వీసా విధానాలు, బలమైన మౌలిక సదుపాయాలతో భారతీయ విద్యార్థులకు కెనడా



చాలాకాలంగా కీలక గమ్యస్థానంగా ఉంది. అయితే కఠినమైన ఇమిగ్రేషన్ నిబంధనలు, పరిమితమైన అనుమతులు దరఖాస్తుల సంఖ్య క్షీణతకు కారణమవుతున్నాయి. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ 2024లో 4,37,000 స్టడీ పర్మిట్లను కేటాయించడం అంతర్జాతీయ విద్య పట్ల కెనడా నిబద్ధతకు నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. భారతీయ విద్యార్థుల పట్ల యూకే మిశ్రమ వైఖరి కనబరిచింది. గ్రాడ్యుయేట్ విద్యార్థులు చదువులు పూర్తి చేసిన తర్వాత రెండేళ్ల పాటు పనిచేయడానికి అనుమతిస్తుంది. పీజీ విద్యార్థులు డిపెండెంట్లను తీసుకురావడంపై ఆంక్షలు విధించడం వారిని కలవరపెడుతోంది. విపరీతమైన రద్దీ, వనరుల కేటాయింపులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా 2025 నాటికి విదేశీ విద్యార్థుల నమోదును 2,70,000కు పరిమితం చేయాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయించింది. ఆస్ట్రేలియా వర్సిటీల్లో సీట్ల కోసం పోటీ మరింత పెరిగినప్పటికీ కెనడా తరహాలో పొడిగించిన పోస్టు స్టడీ వర్క్ ప్రయోజనాలు విద్యార్థులను ఊరిస్తున్నాయి.

### నిబంధనలు సడలించిన జర్మనీ

భారతీయ విద్యార్థులకు జర్మనీ అత్యుత్తమ ఎంపికగా మారుతోంది. పోస్టు స్టడీ వర్క్ ఎంపికలు ప్రధాన ఆకర్షణగా మారాయి. నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందిస్తూ నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు ఏటా 90వేల వీసాలు జారీ చేయాలని ఆ దేశం యోచిస్తోంది. వీసా నిబంధనల్లో మార్పులతో విద్యార్థులు సంప్రదాయ గమ్యస్థానాలను పక్కన పెట్టి ఫ్రాన్స్, ఐర్లాండ్, ఫిన్లాండ్ తదితర ప్రత్యామ్నాయాలనూ అన్వేషిస్తున్నారు.

### ఇమ్మిగ్రేషన్ నిబంధనలు సవరించిన న్యూజిలాండ్

న్యూజిలాండ్ ప్రభుత్వం అక్రెడిటేటెడ్ ఎంప్లాయర్ వర్క్ వీసా (ఏఈడబ్ల్యూవీ) నిబంధనలు సవరించింది. సగటు వేతన పరిమితిని తొలగించడం, వలసదారులకు పని అనుభవాన్ని మూడేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించడం, కొత్తగా సీజనల్ వీసాలను ప్రవేశపెట్టడం వంటి మార్పులు వచ్చే జనవరి నుంచి నాలుగు దశల్లో అమలులోకి రానున్నాయి. తాజా సవరణలతో ఎంప్లాయర్ అక్రెడిటేషన్ కోసం సగటు ప్రాసెసింగ్ సమయం 62 రోజుల నుంచి 14 రోజులకు తగ్గింది. అలాగే జాబ్ చెక్ ఉత్పాదకత రెట్టింపు కానుంది. ఉద్యోగుల సగటు వేతన పరిమితిని వచ్చే మార్చిలో తొలగించనున్నారు. ఈ మార్పుల ప్రభావం ప్రస్తుత ఉపాధి ఒప్పందాలపై ఉండదు. నివాస అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఉద్యోగులు తప్పనిసరిగా సంపాదించాల్సిన వేతనంలో ఏ మార్పు లేదు. ఏఈడబ్ల్యూవీ వలసదారులు తమ పిల్లలను తీసుకురావడానికి ఏటా కనీసం 55,844 న్యూజిలాండ్ డాలర్లు (దాదాపు రూ.27 లక్షలు) సంపాదించాల్సి ఉంటుంది.

## పీపీపీ విధానంలో కొత్త ప్రాజెక్టులు

- భారతీయ రైల్వే యోచన



న్యూఢిల్లీ, డిసెంబరు 28: భారతీయ రైల్వేస్.. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నూతన ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. రానున్న నెలల్లో ఈ విధానంలో భాగంగా మినరల్ కారిడార్లు వంటి నూతన వాణిజ్యపరమైన లైన్లను నిర్మించాలని ప్రతిపాదిస్తున్నట్టు ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు. భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అయ్యే ఖర్చును తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో భారతీయ రైల్వేస్ ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, పీపీపీ విధానం వైపు మారాలని ప్రతిపాదించినప్పటికీ 2025-26 బడ్జెట్‌లో మూలధన వ్యయానికి సంబంధించి భారీ ఊతాన్ని భారతీయ రైల్వేస్ పొందే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. కాగా 2031 నాటికి ప్రతిపాదిత ఇంధన, మైనింగ్, సిమెంట్ రైల్ కారిడార్లకు రూ.5.25 లక్షల కోట్లకు పైగా వ్యయం అవుతుందని అంచనా. మరోవైపు, రైళ్లకు సంబంధించిన కొత్త టైమ్ టేబుల్‌ను భారతీయ రైల్వేస్ వచ్చే జనవరి 1న విడుదల చేయనుంది. ప్రస్తుత టైమ్‌టేబుల్ ప్రకారం 'ట్రెయిన్స్ ఎట్ గ్లాన్స్' 44వ ఎడిషన్ ఈ ఏడాది డిసెంబరు 31 వరకు కొనసాగనుంది. గత ఏడాది భారతీయ రైల్వేస్ ప్రకటించిన ఆల్ ఇండియా రైల్వే టైమ్ టేబుల్ - ట్రెయిన్స్ ఎట్ గ్లాన్స్ (టాగ్) అక్టోబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. టాగ్‌లో రూట్ మ్యాప్, స్టేషన్ ఇండెక్స్, రైళ్ల సమాచారం, ముఖ్యమైన స్టేషన్లమధ్య రైళ్లు, స్టేషన్ కోడ్ ఇండెక్స్, ట్రెయిన్ పేరు, రిజర్వేషన్ వివరాలుంటాయి.

## వ్యవసాయ ఉత్పత్తులకు ఏకరూప జాతీయ మార్కెట్లు

- సంస్కరణల దిశగా అడుగులు.. ఒకే లైసెన్సు, రిజిస్ట్రేషన్

న్యూఢిల్లీ, డిసెంబరు 28: దాదాపు మూడేళ్ల కిందట మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి, రైతుల ఆందోళనలతో వెనక్కి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విషయంలో సంస్కరణలు తీసుకువచ్చింది. ఈ క్రమంలో తాజాగా మరో కొత్త ముసాయిదాను విడుదల చేసింది. దీని ప్రకారం దేశవ్యాప్తంగా ఏకరూప జాతీయ మార్కెట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. నూతన విధానం కింద ఒకే లైసెన్సు, ఒకే రిజిస్ట్రేషన్ వ్యవస్థ, ఒకేసారి చెల్లించేలా ఫీజు ఉండనున్నాయి. ఇక, ఈ ముసాయిదా ప్రకారం.. ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. వీటి ద్వారా ఉత్పత్తి, ఎగుమతిదారులు, రిటైల్ వ్యాపారులు, వ్యవస్థీకృత రిటైల్ వ్యాపారులు నేరుగా విక్రయాలు జరుపుకోవచ్చు. అదేవిధంగా గిడ్డంగులు, శీతల గోదాములను ప్రత్యేక మార్కెట్లుగా గుర్తిస్తారు. అలాగే, ప్రైవేటు ఈ-ట్రేడింగ్ వేదికల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ రుసుములను ఒకేసారి నిర్ణయిస్తారు. అయితే, ఈ ముసాయిదాలో ఎం.ఎస్.స్వామినాథన్ సూచించిన 'లాభదాయక కనీస మద్దతు ధర'లపై ఎలాంటి సూచనలు చేయలేదు. దీనిని రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.

# మూసీని ఆక్రమిస్తే ప్రాసిక్యూట్ చేస్తాం!

- నది పునరుజ్జీవ ప్రాజెక్టుతో హైడ్రాకు సంబంధం లేదు
- చెరువులు, ప్రభుత్వ స్థలాల కబ్జాదారులనూ వదలం
- చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ తర్వాత మళ్లీ కూల్చివేతలు
- వాతావరణ సమాచారం తెలిపేలా ఎఫ్ఎం రేడియో
- హైడ్రా నివేదికను వెల్లడించిన రంగనాథ్



మాట్లాడుతున్న రంగనాథ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుతో హైడ్రాకు సంబంధం లేదు. అదే సమయంలో నది పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలకు పాల్పడే వారిని వదలం. మట్టితో నింపినా.. అక్రమ నిర్మాణాలు చేపట్టినా.. కేసులు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేస్తాం' అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. మూసీ వెంట ఇప్పటికే నోటీసులు జారీ చేసిన ఇళ్లకు సంబంధించి కూల్చివేతలను హైడ్రా చేపట్టదని స్పష్టం చేశారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జా వెనుక పెద్ద మాఫియా ఉందని, పేదలను ముందు పెట్టి ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటయ్యాక కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైడ్రా ఏర్పాటు అనంతరం సాధించిన విషయాలు, కొత్త సంవత్సరంలో చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను బుద్ధభవన్‌లోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రంగనాథ్ వెల్లడించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న ప్లాట్లు, నిర్మాణాలకు సంబంధించి సంస్థ ఏర్పాటు అనంతరం ప్రజల్లో అవగాహన వచ్చిందని, వారిని మరింత చైతన్యవంతం చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ జరగని, నోటరీ స్థలాలు/భవనాలు, అక్రమ నిర్మాణాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. తమ ప్రాంతంలోని పార్కులు, ఖాళీ స్థలాలు, రహదారుల ఆక్రమణలపై కాలనీ సంఘాలపై అప్రమత్తంగా ఉండాలని, హైడ్రాకు సమాచారమివ్వాలని కోరారు. మున్ముందు ఆక్రమణలు రాకుండా కఠినంగా వ్యవహరిస్తామని, చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ పూర్తయిన అనంతరం కూల్చివేతలు ఉంటాయని స్పష్టం చేశారు. జూలై 19 తర్వాత అనుమతి లేకుండా నిర్మించిన భవనాలపై చర్యలుంటాయన్నారు. అక్రమంగా నిర్మించిన నివాసేతర నిర్మాణాలను కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా తొలగిస్తామన్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగానికి దిశానిర్దేశం చేసేలా వ్యవహరిస్తామన్నారు. మెరుగైన విపత్తుల నిర్వహణకు ఖచ్చితమైన వాతావరణ సమాచారం ముందు తెలిసేలా.. అదనపు డాప్లర్ వెదర్ రాడార్ ఏర్పాటు చేయాలన్న వినతికి వాతావరణ శాఖ సానుకూలంగా స్పందించిందని చెప్పారు. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల సంఖ్య పెంచాలని కోరామన్నారు. ఏ ప్రాంతంలో ఎంత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నది ముందే తెలుసుకోవడం ద్వారా వరద నీటి నిర్వహణ, ముంపు ఇబ్బందులు తగ్గించే అవకాశముంటుందన్నారు. ఈ సమాచారం ప్రజలకు తెలిపేందుకు ఎఫ్ఎం రేడియో చానల్ ఏర్పాటు లేదా లీజుకు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

### 12 చెరువుల పునరుజ్జీవానికి చర్యలు

జూలై 19, 2023లో హైడ్రా ఏర్పాటు అనంతరం ఇప్పటి వరకు 200 ఎకరాల స్థలం స్వాధీనం చేసుకున్నట్టు రంగనాథ్ వెల్లడించారు. ఇందులో ఎనిమిది పార్కులు, 12 చెరువులు, నాలుగు ప్రభుత్వ స్థలాలు ఉన్నాయన్నారు. హైడ్రా అంటే కూల్చివేతలు మాత్రమే అనేలా కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఆక్రమణదారులు, కబ్జాలకు పాల్పడే వారు ఈ తరహా చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు ఆక్రమణలు తొలగించిన 12 చెరువుల పునరుజ్జీవానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు చెప్పారు. కొత్త సంవత్సరంలో ప్రతి సోమవారం ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తామని రంగనాథ్ తెలిపారు.

### మతపరమైన నిర్మాణాలపై..

రోడ్డు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మతపరమైన నిర్మాణాలు రావడంపై రంగనాథ్ స్పందించారు. ఇలాంటి సున్నిత విషయాల్లో సమగ్ర పరిశీలన అనంతరం నిర్ణయం తీసుకోవాలని, మతపరమైన నిర్మాణాల జోలికి వెళ్లకుండా చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగిస్తామన్నారు. హైడ్రాకు ఇప్పటి వరకు 5800లకుపైగా ఫిర్యాదులు వచ్చాయని, ప్రజలకు కలిగే ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. కాలనీ, బస్తీ అసోసియేషన్లు, సామూహికంగా స్థానికులు ఇచ్చే ఫిర్యాదులను మొదట పరిశీలిస్తున్నామన్నారు. విపత్తుల నిర్వహణకు ప్రస్తుతం 30 బృందాలున్నాయని, ఔటర్ వరకు సేవలు విస్తరించేలా వీటి సంఖ్య త్వరలో 72కు పెంచనున్నట్టు తెలిపారు. నాగోల్‌లోని విపత్తుల నిర్వహణ శిక్షణ కేంద్రాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. 100 మంది డీఆర్ఎఫ్ సిబ్బందికి శిక్షణనిచ్చి ట్రాఫిక్ నిర్వహణ కోసం కేటాయించామన్నారు. డీఆర్ఎఫ్‌కు చెట్లు కూలాయని 3428, వరద నీరు నిలిచిందని 912, 199 రెస్క్యూ కాల్స్, 133 అగ్నిప్రమాదాలతో కలిపి మొత్తం 4684 ఫిర్యాదులు వచ్చాయని కమిషనర్ వివరించారు.

## ప్రభుత్వ బడుల బలోపేతానికి సమగ్ర ప్రణాళిక

- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మంచాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధి ఆరుట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ఆరుట్ల జెడ్పీ హైస్కూల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు తెలిపారు. గ్రామస్థులతో స్వచ్ఛంద సలహా కమిటీ, తల్లిదండ్రులకమిటీలను ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకొచ్చారు.




## ట్రాన్స్‌కో దివ్యాంగ ఉద్యోగులకు రవాణా భత్యం పెంపు

- ఉద్యోగులకు 2025 ఏడాది సెలవుల ప్రకటన

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ ఉద్యోగులకు నెలనెలా ఇచ్చే రవాణా భత్యాన్ని పెంచుతూ తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్‌కో) నిర్ణయం తీసుకుంది. వీరికి ఇప్పటిదాకా నెలకు రూ.2 వేలు ఇస్తుండగా... దాన్ని రూ.3 వేలకు పెంచుతూ ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణ భాస్కర్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. మూల వేతనంలో 10% లేదా గరిష్ఠంగా రూ.3 వేలు చెల్లించాలని 2023 జూన్ 22న ప్రభుత్వం జీవో నెం.58ని జారీ చేసిన విషయం విదితమే. ఆ జీవో ఆధారంగా రవాణా భత్యాన్ని పెంచారు. ఈ నిర్ణయం 2023 జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. మరోవైపు తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఉద్యోగులకు, కార్మికులకు 2025 సంవత్సరంలో 9 సాధారణ, 15 ఐచ్ఛిక సెలవులు ఉంటాయని ఆ సంస్థ వెల్లడించింది. 15 ఐచ్ఛిక సెలవుల్లో నిర్వహణ విభాగంలో పనిచేసే వారు ఐదింటిని మాత్రమే వినియోగించడానికి అవకాశం ఉందని తెలిపింది.

## రిలయన్స్ ఉపకార వేతనాలకు 25 శాతం మంది తెలుగోళ్లు ఎంపిక

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు చేయూతనందించడానికి ధీరూభాయి అంబానీ 92వ జయంతి సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ ఉపకారవేతనాలు అందిస్తోంది. వచ్చే పదేళ్లలో 50 వేలమందికి పైగా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించాలని 2022లో సంస్థ నిర్ణయించింది. దీని కింద ట్యూషన్ ఫీజుతో పాటు వసతి, చదువు కోసం రూ.2 లక్షలదాకా ఆర్థికసాయం అందించనుంది. శనివారం విడుదల చేసిన ఫలితాల్లో 5 వేలమందికిగాను 850మంది ఏపీ, 411 మంది తెలంగాణకు చెందినవారు, రెండు రాష్ట్రాల నుంచి మొత్తం 1,261 మంది విద్యార్థులు ఉపకారవేతనాలకు ఎంపికయ్యారని తెలిపింది. ఫలితాల కోసం http://reliancefoundation.org/ugscholarships 202425 res-u-lts అనే వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సంస్థ కోరింది.

## వివాహితపై యువకుడి అత్యాచారం

- నిర్మల్ జిల్లాలో శుక్రవారం ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

నిర్మల్ అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన 45 ఏళ్ల వివాహిత భర్తతో గొడవపడి బయటకు రాగా సాయం చేస్తానని ఓ యువకుడు ఆమెను నమ్మించి అత్యాచారానికి ఒడిగట్టాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిర్మల్ బస్టాండ్ సమీపంలో ఓ మహిళ స్పృహ తప్పి పడిపోయి ఉండటాన్ని గమనించిన ఓ ఆటో డ్రైవర్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం స్పృహలోకి వచ్చిన ఆమె విషయాన్ని పోలీసులకు తెలిపింది. ఆర్థిక ఇబ్బందుల విషయమై శుక్రవారం రాత్రి భర్తతో గొడవ పడి.. బంధువుల ఇంటికి వెళదామని నిర్మల్ బస్టాండ్‌కు చేరుకున్నానని, అక్కడ యోగేశ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడని చెప్పింది. తనకు డబ్బులు అవసరం ఉన్నాయని అతనికి చెప్పగా, అతను తన మిత్రుడైన కళ్యాణ్‌కు ఫోన్ చేశాడని తెలిపింది. కల్యాణ్ అక్కడకు చేరుకుని తనకు సహాయం చేస్తానని నమ్మించి సమీపంలోని ఓ లాడ్జిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని చెప్పింది. అక్కడి నుంచి బయటపడి ఆటో వరకు వచ్చి నీరసించి స్పృహ కోల్పోయానని తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాకినాడలో ఉత్సాహంగా క్రియ పిల్లల పండుగ

### ఉభయ రాష్ట్రాల నుంచి 8,500 మంది విద్యార్థుల హాజరు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూ ఆవరణలో రాష్ట్రస్థాయి క్రియ పిల్లల పండుగ శనివారం ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలను కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల సర్వముఖాభివృద్ధికి విద్య, క్రీడలు, సాంస్కృతిక పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన 350 పాఠశాలల నుంచి 8,500 మంది విద్యార్థులు సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన తదితర పోటీల్లో పాల్గొన్నారు.

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
మార్కెటింగ్ శాఖ,
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
మార్కెటింగ్ శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానములకు ఇ-టెండర్ల ద్వారా 5,00,000 నంబర్ల బయో కంపోస్టబుల్ లడ్డు క్యారీ కవర్లు సరఫరా కొరకు ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కొరకు వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in కు లాగాన్ చేయగలరు. తదుపరి వివరాల కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 08772264079, 2264555,ఫ్యాక్స్ నంబరు:0877-2264554.
TTD- 40021(31)/1/2024-PRO SEC(ADV.NO.278) తేది:28.12.2024 సం/- కార్యనిర్వహణాధికారి

తెలంగాణ ప్రభుత్వం
**రహదారులు మరియు భవనముల శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-NIT.నం.01(2వ పిలుపు)/2024-25. తేది: 28.12.2024.
1.ఇంజనీర్-ఇన్ చీఫ్ (ఆర్&బి), జాతీయ రహదారులు, Admn, LWE, CRIF, RSW, PPP & EAP మరియు మెంబర్ COT వారు హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్ (దక్షిణ భాగం)లో అభివృద్ధి కొరకు డీపీఆర్ తయారీ, PMU మరియు సాంకేతిక, ఆర్థిక మరియు ట్రాన్సాక్షన్ అడ్వైజరీ కొరకు ప్రాజెక్ట్ కన్సల్టెంట్ కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై RFP ను కోరుతున్నారు. 2. టెండరుదారులు/బిడ్డర్లు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in/ నుండి 30.12.2024న ఉ.3.00 గం.ల నుండి ఆర్ఎఫ్‌పీ డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. 3. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేదీ మరియు సమయం 20.01.2025న మ.3.00 గం.ల వరకు.
సం/- ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఆర్ & బి) జాతీయ రహదారులు, Admn, CRIF, LWE, RSW, PPP & EAP మరియు మెంబర్ COT
DIPR RO.No: 8410-PP/CL/ADVT/1/2024-25 తేది:28.12.2024

**పురపాలక సంఘం కార్యాలయం, బోధన్**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
Lr.No.E1/180/Ad/2024 తేది: 28.12.2024
బోధన్ పట్టణంలో మునిసిపల్ జనరల్ ఫండ్ క్రింద రోజువారీ వేతన కూలీల నియామకం కొరకు టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం పని అంచనావ్యయం రూ.30.00 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ తేది 28.12.2024. మరియు బిడ్ దాఖలు ముగింపు తేది 31.12.2024. తదుపరి వివరాలకు సంప్రదించగలరు: https://tender.telangana.gov.in
సం/- కమిషనర్ పురపాలక సంఘం, బోధన్
DIPR RO.No: 8389-PP/CL/ADVT/1/2024-25 తేది: 28.12.2024

తెలంగాణ ప్రభుత్వం
**ఆర్థిక శాఖ**
అనుబంధం-I
26 సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీలు) 2051 వేలం

| | |
|---|---|
| మొత్తం | : రూ.409.00 కోట్లు |
| జారీ ధర | : ప్రతీ రూ.10,000.00 లకు రూ.10,000.00 |
| కాలపరిమితి | : 26 సంవత్సరాలు |
| రుణ దరఖాస్తు స్వీకరణ వ్యవధి | : సదరు మొత్తం అందిన వెంటనే నోటీసు లేకుండా 31.12.2024న వ్యాపార వేళలలో మరియు తరువాత తక్షణమే ముగియవచ్చును. |

పైన తెలిపిన రుణానికి గాను తెలంగాణ ప్రభుత్వం సబ్‌స్క్రిప్షన్లను అభ్యర్థిస్తోంది. పూర్తి వివరాలను భారతీయ రిజర్వు బ్యాంక్, హైదరాబాద్ మరియు ముంబై నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.
సం/- కె. రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ
DIPR RO No.488-DP/CL/ADVT/1/2024-25, Dt: 28.12.2024

**ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్**
CIN No. U40109TG2000SGC034119
టెండరు ప్రకటన నం.20/2024-25
బిడ్ నం.I-148 & I-149/2024-25 and II-116, 117, 118 & 119/2024-25 ప్రకారం TGNPDCLలో సబ్‌స్టేషన్ పనుల నిర్వహణ. తదుపరి వివరాలకు దర్శించండి: https://tender.telangana.gov.in (లేదా) www.tgnpdcl.com
సం/- చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), TGNPDCL, వరంగల్
సంక్షిప్త టెండరు ప్రకటన నం.11/2024-25 of DE/OP/BHADRACHALAM స్పెసిఫికేషన్ నం.01/2024-25తో
భద్రాచలం ఆపరేషన్ డివిజన్‌లోని బుర్గంపహాడ్ సెక్షన్‌లో పనుల నిర్వహణ కొరకు ఏజెన్సీ ఎస్టిమేట్‌ను ఖరారు చేయడానికి TGNPDCL నమోదిత కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. పనుల వివరాలను మరియు ఇతర సమాచారాన్ని మా వెబ్‌సైట్ www.tgnpdcl.com నుండి పొందవచ్చును.
సం/- డివిజనల్ ఇంజనీర్, ఆపరేషన్ TGNPDCL, భద్రాచలం
సంక్షిప్త టెండరు ప్రకటన నం.10/2024-25 of SE/OP/Peddapally
స్పెసిఫికేషన్ నం.62/24-25 to స్పెసిఫికేషన్ నం.70/24-25 of SE/OP/Peddapally
TGNPDCL పెద్దపల్లి సర్కిల్‌లోని మంథని డివిజన్ అధికార పరిధిలోని ప్రస్తుత 33/11KV సబ్‌స్టేషన్ల రెనోవేషన్ & మోడర్నైజేషన్ (R&M) కొరకు TGNPDCL నమోదిత కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. పనుల వివరాలను మా వెబ్‌సైట్ www.tgnpdcl.com నుండి పొందవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, పెద్దపల్లి
DIPR Ro No.8374-PP/CL/ADVT/1/2024-25, తేది: 28.12.2024

**ఆంధ్రజ్యోతి తలంబ్రాలు**

**వరుడు కావలెను**



★ విశ్వబ్రాహ్మణ/ ఏకైక కుమార్తె / B.Sc. Agri / Govt. AEO/ అగ్రికల్చర్ DEPT./ మంచి జీతము / 5'4" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్ : 6305007091 AJH-15359

★ యాదవ/ B.E / C. Govt. / ప్రివెంటివ్ ఆఫీసర్ / కస్టమ్స్ DEPT./ మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్ : 8297439565 AJH-15359

★ కుమ్మరి/ B.Tech / Govt.. లెక్చరర్ / పాలిటెక్నికల్ కాలేజ్ / మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్ : 9618008271 AJH-15359

★ వడ్డెర/ C.A / చార్టెడ్ అకౌంటెంట్ / మంచి జీతము / 5'5" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9618007652 AJH-15359

★ 2వ పెళ్ళి/ 48y/Own Shop / మంచి ఆదాయం / సొంత ఇల్లు, రెంట్స్ గల వధువుకు సెటిల్డ్ వరుడు కావలెను. ఫోన్ : 9848023736 AJH-15370

★ రెడ్డి 2nd మ్యారేజ్ / కుల, ఆస్తిపట్టింపు లేదు / 30y / H:5'4"/ సొంత బిజినెస్, అందమైన వధువుకు వరుడు కావలెను. 1st / 2nd అన్ని కులాల & వయస్సుల వారికి సంబంధాలు కలవు. ఫోన్ : 8143011223 AJH-15370

★ SC మాల / B.Tech / C.Govt. ఆడిటర్ / డిఫెన్స్ / అకౌంట్స్ Dept. / మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8897389698 AJH-15370

★ రెడ్డి 2nd విడో / (కుల-ఆస్తి) పట్టింపు లేదు. AGE:31 / డిగ్రీ (సొంత ఇల్లు వ్యాపారం - వ్యవసాయ భూమి) వధువుకి వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి 1వ/2వ సంబంధాలు కలవు. ఫోన్ : 9059507176 AJH-15369

★ రెడ్డి విడో / కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ AGE:35 / B.com / Pvt. Job, అందమయిన వధువుకి వరుడు కావలెను. All Caste Marriages Available. Ph: 8121347478 AJH-15369

★ రెండో పెళ్ళి /24y & 25y & 27y & 29y & 30y & 32y & 33y & 35y & 36y & 37y & 39y & 40y & 42y & 43y & 44y & 45y & 46y & 48y & 50y & 52y & 53y & 55y & 57y & 59y / "మా సేవ" (Since 1998):PH/WA:9291503949 AJH-002827

★ 60y / రెండవ పెళ్ళి /విడో/Govt. ఫ్యామిలీ పెన్షనర్ / సొంత ఇల్లు రెంట్స్ / పిల్లలు లేరు / ఏలాంటి బాధరబంధీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను.(కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 7995376608 AJH-002900

★ 62y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / Govt. Rtd./ పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ ప్రాపర్టీ/ ఎలాంటి బాధరబంధీలేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 9030858258 AJH-002900

★ కుల పట్టింపు లేదు/చౌదరి/లేట్ మ్యారేజ్ / 41y / 5'5"/ Fair / డాక్టర్స్ / కార్డియాలజీ / మంచి ఆస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్: 7285934589 AJH-002755

★ కుల పట్టింపు లేదు/చౌదరి/డైవర్సీ / 43y / 5'6"/ Fair/ MS / జనరల్ మెడిసిన్ / వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ / మంచి ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. వాట్సాప్: 8501023957 AJH-002755

★ వైశ్య/విడో/ Govt., 2nd మ్యారేజ్ / కుల, ఆస్తి పట్టింపు లేదు / వయస్సు:45, కలర్: తెలుపు / సొంత వ్యాపారము కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. ఫోన్ : 8125076013 AJH-002827

★ కుల పట్టింపు లేదు/ 42yrs/ Widow/ ఆంధ్ర / గైనకాలజిస్ట్ / మంచి జీతం / ఆస్తి ప్రసక్తి లేదు / పిల్లలు లేరు / నెల్లూరు, కడప, ఒంగోలు ప్రాధాన్యత. అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7075948409 AJH-002827

★ కుల పట్టింపు లేదు/ 50yrs/ Widow/ ఆంధ్ర / పంచాయత్ రాజ్ ఆఫీసర్ /మంచి జీతం / ల్యాండ్స్ / పొలాలు / వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9989350417 AJH-002826

★ కుల పట్టింపు లేదు/విడో/42y/ Kadapa/ Govt. Employee / Own House / Rents / Agriculture Lands/ పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8374476725 AJH-002826

★ కుల, ప్రసక్తి లేదు/విడో/ఆంధ్ర / 58y/ Central Govt. Retired Employee/ Pensioner / 1 Girl Settled / Own House / Rents / Lands / ఏ బాదరబందీలేని వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9581155315 AJH-002826

★ కుల పట్టింపు లేదు / విడో / 60 Y / Retd. / ఓన్ బిజినెస్ / రెంట్స్ / లాండ్స్ / మంచి ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. సంప్ర. 80749 79279 AJB-749

**గమనిక**
ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే.

**వధువు కావలెను**



★ కమ్మ/ B.Tech / C.Govt. జాబ్ / స్టీల్ ప్లాంట్ / డిప్యూటీ మేనేజర్ / మంచి జీతము / 5'11" ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 8790689274 AJH-15359

★ హిందూ మాదిగ / B.Tech / C.Govt. Asst./ పోస్టల్ DEPT. / మంచి జీతము / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 7032058965 AJH-15359

★ 2వ పెళ్ళి / B.Tech / Govt. Jr. డివిజన్ ఆఫీసర్ / TSNPDCL / మంచి జీతము / 5'9" ఎత్తు / 40 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9963757612 AJH-15359

★ వడ్డెర / ఏకైక కుమారై / M.TECH / C.GOVT సెంట్రల్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్/ మంచి జీతము / 5'11" ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 9618579861 AJH-15359

★ పద్మశాలి /M.TECH / C.GOVT VLSI ఇంజనీర్ / ఇస్రో / మంచి జీతము / 5'10" ఎత్తు / 30 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 8297439565 AJH-15359

★ ముదిరాజ్ /B.E./GOVT. ASST. ఇంజనీర్ / మున్సిపల్ DEPT./ మంచి జీతము / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 9618007652 AJH-15359

★ గౌడ /B.TECH/IIT / C.GOVT. ఆఫీసర్ / కమర్షియల్ టాక్స్ DEPT./ మంచి జీతము / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 9618008271 AJH-15359

★ రజక / కట్నం ప్రసక్తి లేదు /M.TECH/IIT / GOVT.ASST. ఇంజనీర్ /RWS/ మంచి జీతము / 5'10" ఎత్తు / 30 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్ : 6305007091 AJH-15359

★ SC మాల / కట్నం ప్రసక్తి లేదు / B.TECH / C.GOVT. / కస్టమ్స్ & GST ఆఫీసర్ / మంచి జీతము / 5'8" ఎత్తు / 31 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 8897389698 AJH-15370

★ కుల ప్రసక్తి లేదు. 37 సం.గల బిజినెస్ చేసే వరుడికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. నో డౌరీ. ఫోన్: 9866724586, 6301943220 AJH-606

★ కమ్మ/ Caste No Bar / 42y, 5'11"/ డిగ్రీ / ఓన్ కన్సల్టెంట్. VJA, 7.2L P/A 36Y, 5'9" / B.TECH, 16L P/A HYD. Ph:9182731506 / 9705588313 AJH-002755

★ నెల్లూరు 40Y, OC వరునకు కుల పట్టింపు లేని 2వ మ్యాచ్, "ఎంప్లాయి వధువు" కావలెను. డైరెక్టు వరుడు. సం.ప్ర. సెల్: 96039 59855 AJR-193834

★ బలిజ/ 35yrs / డిగ్రీ, జాబ్ - కంప్యూటర్ ఆపరేటర్ @మెడికల్ ఏజెన్సీ, కరీంనగర్లో స్వంత గృహం వున్న అబ్బాయికి తగిన వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్: 9440378427 AJH-002827

**కళ్యాణ వేదిక**

★ ఫ్రీ రిజిస్ట్రేషన్: / అన్ని కులాల Govt / SWE / డాక్టర్స్ / NRI / బిజినెస్ / PVT/2ND పెళ్లి సంబంధాలకై నిజాయితీగా సర్వీస్. ఈ ప్రకటన 100% నిజం. ఫోన్: 9866775306 AJH-002826

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matches కై సంప్ర: Ph: 9704656103 / 9533608887 (Whatsapp) AJH-002900

★ రజక / డాక్టర్స్ / ఇంజనీర్స్ / Govt. Jobs / Abroads / పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి. కోట్ల శ్రీనివాస్. ఫోన్ : 8106303155 / 9391265304 AJH-002900

★ Brahmin, పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Shyam, Ph: 9949233422 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002754

★ Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Srinivas Ph: 7032712544 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002754

★ Padmashali - పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Shyam. Ph: 9949233422 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002754

★ Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Srinivas. Ph: 7032712544 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002754

★ లక్ష్మి మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506/9705588313 AJH-002755

★ కమ్మ/కుమ్మ/కమ్మ : వివాహ వేదిక : 05-01-2025, ఉ 9:00 గం.లకు జిల్లా పరిషత్‌లో, కర్నూలు. ఆంధ్ర, బయోడేటా, కలర్ ఫోటోలు, రిజిస్ట్రేషన్ ఫీజు : 800/-. సెల్ : 90327 41194, 94407 56199. AJL_202925

**శారద వివాహ వేదిక**
Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com
EXCLUSIVE CHOWDARY COMMUNITY
Hyderabad. Phone: 9849413031
కమ్మ ప్రత్యేకం

**వధువు కావలెను**

★ కమ్మ ప్రత్యేకం : 15 Cr B.Tech 40 India / 15 Cr B.Tech MS USA Citizen / 30 Cr B.Tech MS 38 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(USA)రెండో పెళ్ళి: 50 Cr USA Doctor 35 / 15 Cr USA Green Card 40 / B.Tech MS 40 Cr / 15 Cr Doctor Canada / 35 B.Tech MS / 45 B.Tech MS USA / 48 B.Tech MS / 38 B.Tech MS / 32 B.Tech MS వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 40 B.Tech 15 Cr / 43 MSc 50 Cr / 10 Cr B.Tech 24L PA 39 / 15 Cr B.Tech MS 35 / 20 Cr B.Tech MS 33 / 50 Cr B.Tech 30 / 5 Cr B.Tech 29 / 20 Cr B.Tech MBA 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30 Cr B.Tech 28 / 20 Cr B.Tech IIT 29 / 10 Cr B.Tech 36 / 50 Cr Business 32 / 40 Cr B.Tech MS 31 / 20 Cr B.Tech 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr B.Tech MS 26 / 70 Cr MBA 27 / 75 Cr. B.Tech MS USA Citizen వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(రెండో పెళ్ళి): 31 B.Tech IT MS Business Hyderabad 20 Cr / 37 B.Tech 30 Cr Hyd / 40 B.Tech 15 Cr 36L PA Hyderabad / 50 Cr Business 40 Hyderabad / 15 Cr B.Tech 40 Hyderabad రెండో పెళ్ళి వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 Cr. B.Tech 25 మరియు 50 Cr. B.Tech MS, SWEEDEN 75 Cr. B.Tech MS USA సిటిజెన్ 28 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 500 Cr. MBBS MD 34 / 100 Cr MBBS MD 25 / 50 Cr MBBS MD Pediatrics / 20 Cr MBBS MD 30 / 15 Cr MBBS MD GS 31 / 20 Cr MBBS MD Pediatrics 29 / 10 Cr MBBS MD GM 35 / 20 Cr MBBS MD Ortho 34 / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం Australia: 20 Cr B.Tech MS 29 PR / 5 Cr B.Tech MS 28 / 2 Cr B.Tech MS 32 / 3 Cr B.Tech MS 30 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 1 Cr to 500 Cr 24 to 45 B.Tech / M.Tech / MS / CA / PG Doctors India / USA /ఆస్ట్రేలియా U.K. వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

**వరుడు కావలెను**

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B Tech MS 29/30Cr B.Tech MS 27/100Cr B.Tech MS 29/20Cr B.Tech MS 28/40 Cr B.Tech MS 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 15Cr B.Tech 26 / 70Cr Architecture 30 / 50Cr B.Tech MS 25 / 20 Cr B.Tech 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : డాక్టర్స్ India 20Cr MS General 31/15Cr Dermatology 35 / 10Cr Radiology & Gynic & Skin Doctor and ENT Dental డాక్టర్స్ వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండవ పెళ్ళి, 40 B.Tech MS Business in India / 20 Cr. 35 B.Tech Hyderabad / 25 Cr. 35 PG Doctor వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 B.Tech MS / 27 B.Tech MS / 29 B.Tech MS / 31 B.Tech MS / 33 B.Tech MS / 35 B.Tech MS వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10 Cr 25. B.arch, MS. UK. US/10Cr. BBA.28/ 29.BTech / MS / Amazon, 300k USA. అందమైన యూఎస్. UK. India. Well settled వధువులకి వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr. 37 / 70 Cr. 35 / 50 Cr. 39 / 20 Cr. 35 & 37 Doctors. రెండవ పెళ్లి వధువులకు సెటిల్డ్ వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 35 Cr. BDS,MBA 29 UK వధువుకు మరియు 30 Cr. B.Tech MS USA వధువులకు వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA డాక్టర్స్ 33 Cardiologist / 29 Neurology / 28 Internal Medicine వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30Cr B.Tech 28 / 20Cr B.Tech MBA 32 / 20Cr B.Tech 25 / 50Cr MBBS PG Doctor Hyderabad వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9703618806, 9985921386

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

# తారలు.. దిగివచ్చిన వేళ!

చిత్ర పరిశ్రమ ప్రముఖులను ఏ ముఖ్యమంత్రి ఎక్కువగా భయపెట్టారు? జగన్మోహన్‌రెడ్డి – రేవంత్‌రెడ్డిలలో ఎవరు మంచివాళ్లు? ఎవరు కాదు?... సోషల్ మీడియాలో గత కొన్ని రోజులుగా ఈ చర్చ రచ్చ చేస్తోంది. రేవంత్‌రెడ్డితో పోల్చితే జగన్‌రెడ్డి ఎంత మంచివాడో తెలుసా? అని జగన్ అభిమానులు ప్రచారం చేసుకోగా, శాసనసభలో మా ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలో వాస్తవం లేదంటారా? సినిమా వాళ్లకు ఎందుకంత బలుపు? అని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, తెలంగాణ వాదులమని చెప్పుకొనేవాళ్లు విరుచుకు పడ్డారు. దీంతో సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన ఘటన పక్కకు పోయి, ఆంధ్రా–తెలంగాణ వివాదం తెరమీదకు వచ్చింది. గోటితో పోయే వివాదం గొడ్డలి దాకా వచ్చింది. ఫలితంగా చిత్ర పరిశ్రమ ప్రముఖులు వణికిపోయారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు ఆయనకు చిత్ర పరిశ్రమపై కోపం వచ్చింది. సినిమాల ప్రదర్శనపై ఆంక్షలు విధించడం ద్వారా బడా బడా స్టార్లు తన వద్దకు దేకుతూ వచ్చి సాగిలపడేలా చేసుకున్నారు. ఇప్పుడు పుష్ప–2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన సంఘటనతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా చిత్ర పరిశ్రమను గడగడలాడించారు. అయితే, జగన్‌రెడ్డిలాగా రేవంత్‌రెడ్డి మొరటుగా వ్యవహరించకుండా, సంధ్యా థియేటర్ ఘటనను చట్టపరంగా తనకు అనుకూలంగా మార్చుకున్నారు. తన చర్యలు, ప్రకటనల ద్వారా చిత్ర పరిశ్రమను దారిలోకి తెచ్చుకోవడంతోపాటు తెలంగాణ ప్రజల దృష్టిలో తానే నిజమైన స్టార్ అని రుజువు చేసుకున్నారు. అల్లు అర్జున్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలను దాదాపు 70 శాతం మంది ప్రజలు సమర్థిస్తున్నట్టు సమాచారం. టీ కప్పులో తుఫాను వంటి ఒక సమస్య ఇంత రచ్చకు దారి తీయడం వెనుక కారణం ఏమిటి? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అంత కోపం ఎందుకు వచ్చింది? అనే విషయం ఇప్పుడు చూద్దాం!

> సంధ్యా థియేటర్ సంఘటనలో పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్‌తోపాటు మాజీ మంత్రి కేటీఆర్ ఖండించడం కూడా అగ్నికి ఆజ్యం పోసినట్టు అయింది. తనకు రాజకీయాలతో సంబంధం లేదని అల్లు అర్జున్ చెప్పుకుంటున్నప్పటికీ ఈ ఖండనల వల్ల ఆయనకు రాజకీయం అంటుకుంది. అరెస్టు సమయంలోనూ, జైలు నుంచి తిరిగి వచ్చినప్పుడు అల్లు అర్జున్‌ను పరామర్శించడానికి సినిమా ప్రముఖులు బారులు తీరడం కూడా ముఖ్యమంత్రి రేవంత్‌కు కోపం తెప్పించి ఉంటుంది. ఆయనకు కాలు విరిగిందా? చేయి విరిగిందా? పరామర్శలు ఎందుకు? అని ముఖ్యమంత్రి నిలదీశారు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తప్పు చేశారు. ఆయన కూడా అల్లు అర్జున్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. ఇలాంటి సిల్లీ తప్పులు చేయడం చంద్రబాబుకు అలవాటే. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌తో చంద్రబాబుకు సత్సంబంధాలు ఉన్నాయి. చంద్రబాబును రేవంత్ కూడా గౌరవిస్తున్నారు. అల్లు అర్జున్‌ను పరామర్శించడం అంటే రేవంత్ సర్కార్ తప్పు చేసిందన్న భావన ప్రజల్లో కల్పించడమే అవుతుంది.


## వరుస పొరపాట్లు...

సంధ్యా థియేటర్ సంఘటనలో ఒక మహిళ మృతి చెందిన వెంటనే పుష్ప–2 సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన అల్లు అర్జున్ బేషరతుగా క్షమాపణలు చెప్పి ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదు. అంతకు ముందు, ఆ సినిమా సక్సెస్ మీట్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును అల్లు అర్జున్ మరచిపోయారు. ఈ పొరపాటుకు విచారం వ్యక్తం చేయాలని ముఖ్యమంత్రి సన్నిహితులు కొందరు అల్లు అర్జున్‌కు సూచించగా, రాజకీయాలతో తనకు సంబంధం లేదంటూ ఆయన ఆ సూచనను పెడచెవిన పెట్టారు. దీంతో ప్రభుత్వ పెద్దలకు కోపం వచ్చింది. అంతే, రేవతి మృతి సంఘటనలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఒక రాత్రి అతను జైల్లో ఉండాల్సి వచ్చింది. హైకోర్టు నుంచి మధ్యంతర బెయిల్ పొందినప్పటికీ పోలీసుల విచారణపై స్టే లేనందున అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు రప్పించి గంటలపాటు విచారించారు. అదే సమయంలో ఇకపై తెలంగాణలో సినిమా టికెట్ ధరలను పెంచడానికి అనుమతి ఇవ్వబోమని, బెనిఫిట్ షోలకు కూడా పర్మిషన్ ఇవ్వబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభ సాక్షిగా ప్రకటించారు.

ముఖ్యమంత్రి సన్నిహితులు సూచించిన విధంగా అల్లు అర్జున్ విచారం వ్యక్తం చేసి ఉంటే వ్యవహారం ఇంత దూరం వచ్చి ఉండేది కాదు. ఫలితంగా కడవడంత గుమ్మడి కాయ కత్తిపీటకు లోకువ అన్నట్టుగా ఎంత పెద్ద స్టార్ అయినా పొలిటికల్ స్టార్ ముందు తల వంచాల్సిందేనని రేవంత్‌రెడ్డి రుజువు చేశారు. కారణమేమైనా, గోటితో పోవాల్సిన దానిని గొడ్డలి దాకా తెచ్చుకున్నారు. తెలంగాణలో బెనిఫిట్ షోలు ఉండవు, సినిమా టికెట్ ధరలను పెంచుకోనివ్వమని ముఖ్యమంత్రి ప్రకటించడంతో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు వణికిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శాంతింపజేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఫలించలేదు. ఇంతకూ బెనిఫిట్ షోలు, పెద్ద సినిమాల విడుదల సందర్భంగా టికెట్ల ధరలు పెంచుకోవడం అనే సంస్కృతి ఎందుకొచ్చింది? దాన్ని ఎవరు తీసుకొచ్చారు? గతంలో ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు బాధితుల సహాయార్థం బెనిఫిట్ షోలను ప్రదర్శించేవారు. ఇప్పుడు సినిమాలపై పెట్టిన పెట్టుబడిని త్వరితగతిన రాబట్టుకోవడానికి ప్రత్యేక షోలు వేస్తున్నారు.

## చిన్నా–పెద్దా 'చిత్రాలు'

చిత్ర పరిశ్రమలో ఇటీవలి కాలంలో అనేక పెడ ధోరణులు ప్రవేశించాయి. సినిమా నిర్మాణ వ్యయం అదుపు తప్పింది. పాన్ ఇండియా సంస్కృతి వచ్చింది. ప్రాంతీయ భాషా చిత్రాల్లో నటించే వారిని పాన్ ఇండియా స్టార్లుగా ప్రచారం చేయడం మొదలైంది. ఒక సినిమా పూర్తి కావడానికి వెయ్యి కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. దీంతో పెద్ద సినిమాలు, చిన్న సినిమాలు అనే విభజన జరిగింది. భారీగా ఖర్చు పెట్టి గ్రాఫిక్స్ మాయాజాలంతో నటన, కథతో సంబంధం లేని సినిమాలను పెద్ద సినిమాలుగా ప్రచారం చేసుకుంటున్నారు. సృజనాత్మకత స్థానంలో గ్రాఫిక్స్ చేరాయి. మలయాళ చిత్ర పరిశ్రమనే తీసుకుందాం! అక్కడ తక్కువ బడ్జెట్‌తో అద్భుతమైన కథలను తెరకెక్కిస్తున్నారు. ఊరూ పేరూ తెలియని నటులతో సినిమాలు తీసి ప్రేక్షకాదరణ పొందుతున్నారు. భాష తెలియకపోయినా తెలుగు వాళ్లు కూడా మలయాళ సినిమాలను చూసి ఆనందిస్తున్నారు. తెలుగులో బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, పుష్ప వంటి సినిమాలతో అతి భారీ బడ్జెట్ సినిమాలు తీశారు. ఈ సినిమాలకు ఇతర భాషలలో కూడా ఆదరణ లభించడంతో తెలుగు సినిమా ఖ్యాతి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరిందని గొప్పలు చెప్పుకున్నారు. ఉదాహరణకు పుష్ప–2 సినిమాకు రూ.1350 కోట్లు ఖర్చు చేశారని ప్రచారం జరిగింది. ఇందులో సింహభాగం ఆ సినిమాలో లీడ్ రోల్ పోషించిన అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ పారితోషికంగా తీసుకున్నారు. అల్లు అర్జున్‌కు 350 కోట్లు, సుకుమార్‌కు 150 కోట్లు చెల్లించినట్టు వార్తలు వచ్చాయి. మన దేశంలో ఇప్పటివరకు అత్యధిక పారితోషికం తీసుకున్న నటుడిగా అల్లు అర్జున్ రికార్డులకు ఎక్కారు. నటులకు, దర్శకులకు వందల కోట్ల పారితోషికం చెల్లించడం తెలుగు చిత్ర పరిశ్రమలోనే జరుగుతోంది. దీంతో తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రజలలో సానుకూల అభిప్రాయం స్థానే నెగెటివ్ భావన ఏర్పడింది. ఇంత భారీ బడ్జెట్ సినిమాలు అవసరమా? అనే చర్చ మొదలైంది. ఒక సినిమా నిర్మాణానికి రెండు మూడేళ్ల సమయం కూడా తీసుకుంటున్నారు. ఫలానా హీరోకు అన్ని వందల కోట్లు, ఇన్ని వందల కోట్లు చెల్లించారన్న వార్తలు వస్తుండటంతో ప్రజల్లో సహజంగానే తెలియని అసూయ ఏర్పడుతోంది. వెరసి చిత్ర పరిశ్రమ పట్ల ఇప్పుడు ఎవరికీ సానుభూతి లేకుండా పోయింది. భారీ బడ్జెట్ సినిమాల పేరిట ప్రేక్షకులను దోచుకుంటున్నారన్న అభిప్రాయం క్రమంగా ప్రజల్లో ఏర్పడింది. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా పెట్టుబడులతో పోల్చితే లాభాలు అందుకు తగినట్టుగా ఉండని సందర్భాలే అధికంగా ఉంటున్నాయి. బాహుబలి సినిమా నిర్మాతలకు, కొనుగోలుదారులకు అసలు లాభాలు వచ్చాయో లేదో తెలియని పరిస్థితి. భారీ బడ్జెట్‌తో తీస్తున్న తెలుగు సినిమాలతో పోల్చితే స్వల్ప బడ్జెట్‌తో మలయాళంలో నిర్మిస్తున్న చిత్రాలకే అనేక రెట్ల లాభాలు వస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. సందేశాత్మక చిత్రాలు అనేవి తెలుగులో దాదాపు కనుమరుగయ్యాయి. కథా బలంతో పాటు నటనకు ఆస్కారం ఉన్న మలయాళ చిత్రాలను తెలుగువాళ్లు కూడా ఆదరిస్తున్నప్పుడు మనం కూడా ఆ దిశగా ప్రయత్నం చేద్దామన్న ఆలోచన మనవాళ్లకు రావడం లేదు. పుష్ప చిత్రంలో అల్లు అర్జున్ పోషించిన పుష్పరాజ్ పాత్ర ఎర్ర చందనం స్మగ్లర్‌ది. స్మగ్లర్‌ను కథానాయకుడిగా చూపించడం ఏమిటి? అని ప్రముఖ అవధాని గరికపాటి నరసింహారావు ప్రశ్నించగా, పోలీసు అధికారిని దుస్తులు విప్పించి నగ్నంగా నడిపించిన పాత్ర పోషించిన వారికి జాతీయ పురస్కారం ఇవ్వడం ఏమిటి? అని తెలంగాణ మంత్రి సీతక్క ప్రశ్నించారు. ఈ ప్రశ్నలలో హేతుబద్ధత లేకపోలేదు.



akbar

> శాసనసభలో తాను చేసిన ప్రకటనకు కట్టుబడి ఉంటానని రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో బెనిఫిట్ షోలు, సినిమా టికెట్ ధరల పెంపు విషయం గురించి చిత్ర పరిశ్రమ ప్రముఖులు అడగలేకపోయారని భావించాలి. ముఖ్యమంత్రిని శాంతింపచేయడమే ప్రధాన అజెండా కనుక ఆ దిశగా సినీ ప్రముఖులు కొంత మేరకు సక్సెస్ అయ్యారని భావించవచ్చు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ మాత్రం మొహమాటపడకుండా సినిమా వాళ్లకు షరతులు విధించారు. ప్రభుత్వ సహకారం కావాలంటే మాదక ద్రవ్యాలను అరికట్టడంలో, టూరిజం ప్రమోషన్‌కు సినీ ప్రముఖులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రచారం చేయాలని కరాఖండీగా చెప్పారు. దీంతో తానేమిటో రేవంత్‌రెడ్డి రుజువు చేసుకున్నారు. ముఖ్యమంత్రిని శాంతింపజేయడానికి సినిమా ప్రముఖులు శాలువాలు కప్పి బొకేలు ఇవ్వడంలో పోటీపడ్డారు. సమీకృత గురుకులాల అభివృద్ధికి సినిమాల ప్రదర్శనపై శిస్తు విధిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. అన్నిటికీ తలలు ఊపిన సినిమా ప్రముఖులు తమకు ఏం కావాలో అడగలేకపోయారు. మొత్తమ్మీద అల్లు అర్జున్ ప్రారంభంలోనే కొంత లౌక్యం ప్రదర్శించి ఉంటే ఈ వ్యవహారం టీ కప్పులో తుఫానులా తేలిపోయి ఉండేది.

## మారిన 'హీరోలు'

గతంలో కథానాయకుడి పాత్ర పోషించినవారు చెడుపై పోరాటం చేసేవారు. ఇప్పుడు కథానాయకుడే విలన్ లక్షణాలు పుణికి పుచ్చుకుంటున్నారు. దీని ప్రభావం సమాజంపై కూడా పడుతోంది. ఒకప్పుడు చెడు వ్యసనాలు ఉన్న మగ పిల్లలను ఆడపిల్లలు ఇష్టపడేవారు కారు. ఇప్పుడు ఏ వ్యసనం లేని వాడిని పప్పుగాడు అని ఆడపిల్లలు ముద్దుగా పిలుచుకుంటున్నారు. సమాజం పోకడలనే తాము సినిమాలలో వాడుకుంటున్నామని చిత్ర పరిశ్రమకు చెందినవాళ్లు అంటుండగా, సినిమాల ప్రభావంతోనే యువత చెడిపోతోందన్న వాదన అవతల పక్షం నుంచి వస్తోంది. ఇప్పుడు మళ్లీ అసలు విషయానికి వద్దాం!

సినిమాల విడుదల సందర్భంగా గతంలో కూడా తొక్కిసలాటలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయి. అప్పట్లో అవి వివాదాస్పదం కాలేదు. ఎందుకంటే అప్పట్లో సినిమా నటులను ప్రజలు ఇష్టపడటంతోపాటు గౌరవించేవారు. ఇప్పుడు సినిమా నటులకు స్టార్‌డమ్ మాత్రమే ఉంటోంది. గౌరవం ఉండటం లేదు. దీనికి తోడు తెలుగునాట రాజకీయాలు ఎక్కువ. గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల నియోజకవర్గంలో వైసీపీ నుంచి పోటీ చేసిన అభ్యర్థి కోసం అల్లు అర్జున్ ప్రచారం చేశారు. అల్లు అర్జున్‌కు అంత స్టార్‌డమ్ ఉన్నప్పటికీ ఆయన మద్దతు తెలిపిన అభ్యర్థి ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. అంటే ప్రజలు సినిమా వాళ్లను స్టార్లుగానే చూస్తారుగానీ, ఎన్నికలకు వచ్చేసరికి వారిని గుడ్డిగా ఆదరించరని స్పష్టమవుతోంది. ఈ వాస్తవం తెలుసుకోకుండా నటులు స్టార్‌డమ్‌ను తలకెక్కించుకొని తమను తాము 'డెమీ గాడ్స్'గా భావిస్తూ భ్రమల్లో బ్రతుకుతుంటారు. బౌన్సర్స్‌ను కాపలాగా పెట్టుకొని దర్పం వొలకబోస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సంధ్య థియేటర్ సంఘటన జరిగింది. తొక్కిసలాట సంఘటనపై అల్లు అర్జున్ వెంటనే స్పందించకపోవడం, తర్వాత 25 లక్షల పరిహారాన్ని రేవతి కుటుంబానికి ప్రకటించడం జరిగింది. అన్నిటికి మించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటనను తప్పు పట్టే విధంగా విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సలహాను ఆయనకు ఎవరిచ్చారో తెలియదు. ఫలితంగా ఈ వివాదం రాజకీయ మలుపు తిరిగింది. విచిత్రం ఏమిటంటే, వాస్తవ పరిస్థితిని అల్లు అర్జున్‌కు చెప్పడానికి ఎవరూ సిద్ధపడలేదట! హీరో గారికి కోపం వస్తుంది, మూడ్ మారిపోతుందని ఆయన చుట్టూ ఉన్నవారు అన్నారట! అనేక ఎగుడు దిగుడులు చూసిన అల్లు అరవింద్ అయినా తండ్రిగా కల్పించుకొని విలేకరుల సమావేశం వద్దని కుమారుడిని వారించి ఉండాల్సింది. అల్లు అర్జున్ తండ్రి మాట కూడా వినరు అని అంటారు. మొత్తం మీద ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టుగా ఈ వ్యవహారం పుణ్యమా అని మొత్తం చిత్ర పరిశ్రమ నష్టపోయే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వంతో మధ్యవర్తిత్వం జరపడానికి కూడా చిత్ర పరిశ్రమ ప్రముఖులు సాహసం చేయలేకపోయారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు చొరవ తీసుకొని చిత్ర పరిశ్రమ ప్రముఖులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రితోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా పాల్గొన్నారు. సినిమాల నిర్మాణానికి అంతర్జాతీయ వేదికగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు దిల్ రాజు ప్రకటించారు. ఇందుకోసమైతే సదరు సమావేశం అవసరమే లేదు. అంటే, తమ మనసులోని కోర్కెలను ముఖ్యమంత్రి ముందు చెప్పుకోవడానికి కూడా చిత్ర పరిశ్రమ పెద్దలు సాహసం చేయలేకపోయారు. శాసనసభలో తాను చేసిన ప్రకటనకు కట్టుబడి ఉంటానని రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో బెనిఫిట్ షోలు, సినిమా టికెట్ ధరల పెంపు విషయం గురించి చిత్ర పరిశ్రమ ప్రముఖులు అడగలేకపోయారని భావించాలి. ముఖ్యమంత్రిని శాంతింప చేయడమే ప్రధాన అజెండా కనుక ఆ దిశగా సినీ ప్రముఖులు కొంత మేరకు సక్సెస్ అయ్యారని భావించవచ్చు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ మాత్రం మొహమాటపడకుండా సినిమా వాళ్లకు షరతులు విధించారు. ప్రభుత్వ సహకారం కావాలంటే మాదక ద్రవ్యాలను అరికట్టడంలో, టూరిజం ప్రమోషన్‌కు సినీ ప్రముఖులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రచారం చేయాలని కరాఖండీగా చెప్పారు. దీంతో తానేమిటో రేవంత్‌రెడ్డి రుజువు చేసుకున్నారు. ముఖ్యమంత్రిని శాంతింపజేయడానికి సినిమా ప్రముఖులు శాలువాలు కప్పి బొకేలు ఇవ్వడంలో పోటీపడ్డారు. సమీకృత గురుకులాల అభివృద్ధికి సినిమాల ప్రదర్శనపై శిస్తు విధిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. అన్నిటికీ తలలు ఊపిన సినిమా ప్రముఖులు తమకు ఏం కావాలో అడగలేకపోయారు. మొత్తమ్మీద అల్లు అర్జున్ ప్రారంభంలోనే కొంత లౌక్యం ప్రదర్శించి ఉంటే ఈ వ్యవహారం టీ కప్పులో తుఫానులా తేలిపోయి ఉండేది. తెలుగు స్టార్లు, ఆ మాటకు వస్తే ఏ భాషకు చెందిన స్టార్లయినా పులులు, సింహాలు కారని, రాజకీయ అధికారానికి తలవంచకపోతే తిప్పలు తప్పవని ఈ వ్యవహారంతో మరోమారు స్పష్టమైంది.

> సినిమా పరిశ్రమ వల్ల అనేక మందికి ఉపాధి లభిస్తోంది. ఈ వాస్తవాన్ని అనుచిత వ్యాఖ్యలు చేసేవారు గుర్తుంచుకోవాలి. అతి భారీ బడ్జెట్ చిత్రాలు నిర్మించడం, పెట్టుబడులు తిరిగి రాబట్టుకునేందుకు టికెట్ ధరలను వెయ్యి రూపాయల వరకు పెంచడం, ప్రేక్షకులపై భారం మోపడం దీర్ఘకాలంలో మంచిది కాదని చిత్ర పరిశ్రమ గుర్తించాలి.

## అనుచిత వ్యాఖ్యలు తగవు...

అయితే, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలతోపాటు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ వంటి వాళ్లు కొన్ని అనుచిత వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించే ప్రయత్నం చేశారు. హైదరాబాద్‌లో ఉండాలంటే అణిగి మణిగి ఉండాలని, లేదంటే ఆంధ్రాకు వెళ్లిపోవాలని హెచ్చరికలు చేయడం సమంజసం కాదు. మొట్టమొదటగా తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పుడు మద్రాసులో స్థిరపడిన తెలుగు చిత్ర పరిశ్రమను హైదరాబాద్‌కు ఆహ్వానించారు. అక్కినేని నాగేశ్వరరావు, డి.రామానాయుడు, కృష్ణ వంటి వాళ్లకు స్టూడియోల నిర్మాణాలకు భూములు కేటాయించారు. సినిమా ప్రముఖుల నివాసాల కోసం ప్రస్తుత ఫిల్మ్‌నగర్‌లోని స్థలాలు కూడా ఆయనే కేటాయించారు. చెన్నారెడ్డితోపాటు ఆ తర్వాత ముఖ్యమంత్రుల కృషి కారణంగా చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇప్పుడొక దురదృష్టకర సంఘటన జరిగిన కారణంగా... ఉంటే ఉండండి లేదంటే పోండని హెచ్చరించడం సమర్థనీయం కాదు. ఇలాంటి ధోరణులను అరికట్టాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఉంటుంది. స్టార్లుగా వెలుగొందుతున్న వాళ్లు కూడా అహం తగ్గించుకోవాలి. పుష్ప–2 సినిమాలో స్మగ్లర్‌తో ఫొటో దిగడానికి నిరాకరించిన ముఖ్యమంత్రినే మార్చినట్టు చూపించి ఉండవచ్చు కానీ, నిజ జీవితంలో ముఖ్యమంత్రులతో పెట్టుకుంటే ఏమవుతుందో యావత్ సినిమా పరిశ్రమకూ ఇప్పుడు తెలిసి వచ్చింది. సంధ్యా థియేటర్ సంఘటనలో పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోపాటు మాజీ మంత్రి కేటీఆర్ ఖండించడం కూడా అగ్నికి ఆజ్యం పోసినట్టు అయింది. తనకు రాజకీయాలతో సంబంధం లేదని అల్లు అర్జున్ చెప్పుకుంటున్నప్పటికీ ఈ ఖండనల వల్ల ఆయనకు రాజకీయం అంటుకుంది. అరెస్టు సమయంలోనూ, జైలు నుంచి తిరిగి వచ్చినప్పుడు అల్లు అర్జున్‌ను పరామర్శించడానికి సినిమా ప్రముఖులు బారులు తీరడం కూడా ముఖ్యమంత్రి రేవంత్‌కు కోపం తెప్పించి ఉంటుంది. ఆయనకు కాలు విరిగిందా? చేయి విరిగిందా? పరామర్శలు ఎందుకు? అని ముఖ్యమంత్రి నిలదీశారు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తప్పు చేశారు. ఆయన కూడా అల్లు అర్జున్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. ఇలాంటి సిల్లీ తప్పులు చేయడం చంద్రబాబుకు అలవాటే. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చంద్రబాబుకు సత్సంబంధాలు ఉన్నాయి. చంద్రబాబును రేవంత్ కూడా గౌరవిస్తున్నారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్‌ను పరామర్శించడం అంటే రేవంత్ సర్కార్ తప్పు చేసిందన్న భావన ప్రజల్లో కల్పించడమే అవుతుంది.


## తప్పదు... తగ్గాలి

ఇప్పటికైనా చిత్ర పరిశ్రమ ప్రముఖులు, ముఖ్యంగా స్టార్లు తమ పరిధులను గుర్తించి మెలగడం మంచిది. చిత్ర పరిశ్రమ మొత్తం టర్నోవర్ ఏడాదికి రెండు మూడు వేల కోట్లకు మించి ఉండదు. ఇంతకంటే ఎక్కువ టర్నోవర్‌తో వ్యాపారాలు చేస్తున్న సంస్థలు హైదరాబాద్‌లో వేల సంఖ్యలో ఉన్నాయి. వారెవరికీ దక్కని గుర్తింపు, గౌరవం చిత్ర పరిశ్రమ వారికి వస్తున్నాయంటే అందుకు గ్లామర్ ప్రధాన కారణం. ఈ గ్లామర్‌ను గ్లామర్‌గానే చూడకుండా తాము ఇంత, తాము అంత అనుకుంటే ఎదురు దెబ్బలు తప్పవు. సినిమా పరిశ్రమ వల్ల అనేక మందికి ఉపాధి లభిస్తోంది. ఈ వాస్తవాన్ని అనుచిత వ్యాఖ్యలు చేసేవారు గుర్తుంచుకోవాలి. అతి భారీ బడ్జెట్ చిత్రాలు నిర్మించడం, పెట్టుబడులు తిరిగి రాబట్టుకునేందుకు టికెట్ ధరలను వెయ్యి రూపాయల వరకు పెంచడం, ప్రేక్షకులపై భారం మోపడం దీర్ఘకాలంలో మంచిది కాదని చిత్ర పరిశ్రమ గుర్తించాలి. మితిమీరిన అహంకారం వల్ల అనర్థమే తప్ప ప్రయోజనం ఉండదు. అల్లు అర్జున్ వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. పుష్ప–2 సినిమా సక్సెస్‌ను కూడా ఆయన ఆస్వాదించలేకపోతున్నారు. సినిమా బాగా రావడానికి అల్లు అర్జున్ విపరీతంగా కష్టపడతారని, ఆయనలా కష్టపడే నటుడు మరొకరు లేరని నిర్మాతలు చెబుతుంటారు. కష్టపడే మనస్తత్వంతో పాటు కాస్త వినయం కూడా అలవర్చుకుంటే అల్లు అర్జున్ మరిన్ని విజయాలను అందుకుంటారు. మొన్నటి సమావేశం తర్వాత వివాదం ప్రస్తుతానికి సమసిపోయింది. ముఖ్యమంత్రి చెబుతున్నట్టుగా మునుముందు ఇటువంటి దురదృష్టకర ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత చిత్ర పరిశ్రమ పైనే ఉంటుంది. ప్రేక్షకులలో నటులపై ఉండే క్రేజ్‌ను సినిమా ప్రమోషన్లకు ఉపయోగించుకొనే విధానానికి చిత్ర పరిశ్రమ ఇకనైనా స్వస్తి చెప్పాలి. సినిమా విడుదల సందర్భంగా మొదటి రోజు మొదటి ఆటను ప్రేక్షకులతో కలసి కూర్చొని థియేటర్లలో చూసే విధానానికి స్టార్లు కూడా దూరంగా ఉండాలి. ఏ సినిమాకైనా మొదటి ఆటలో ఆ హీరో అభిమానులు అధికంగా వస్తారు. అలాంటప్పుడు వారి మధ్యకు వెళ్లి సినిమా చూస్తే తొక్కిసలాట జరగకుండా ఉంటుందా? మొత్తమ్మీద 'అంతా నీవల్లే' అనే నిందను బన్నీ భరించాల్సి వస్తోంది. ఇతర స్టార్లు భవిష్యత్తులో ఇలాంటి దుస్థితి తమ దాకా రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారని ఆశిద్దాం!

> ఇప్పుడు సినిమా నటులకు స్టార్‌డమ్ మాత్రమే ఉంటోంది. గౌరవం ఉండటం లేదు. దీనికి తోడు తెలుగునాట రాజకీయాలు ఎక్కువ. గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల నియోజకవర్గంలో వైసీపీ నుంచి పోటీ చేసిన అభ్యర్థి కోసం అల్లు అర్జున్ ప్రచారం చేశారు. అల్లు అర్జున్‌కు అంత స్టార్‌డమ్ ఉన్నప్పటికీ ఆయన మద్దతు తెలిపిన అభ్యర్థి ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. అంటే ప్రజలు సినిమా వాళ్లను స్టార్లుగానే చూస్తారుగానీ, ఎన్నికలకు వచ్చేసరికి వారిని గుడ్డిగా ఆదరించరని స్పష్టమవుతోంది. ఈ వాస్తవం తెలుసుకోకుండా నటులు స్టార్‌డమ్‌ను తలకెక్కించుకొని తమను తాము 'డెమీ గాడ్స్'గా భావిస్తూ భ్రమల్లో బ్రతుకుతుంటారు. బౌన్సర్స్‌ను కాపలాగా పెట్టుకొని దర్పం వొలకబోస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సంధ్య థియేటర్ సంఘటన జరిగింది.

---

# మారుపాకలో బాల్య మధురిమలు



ఉనిక

> అప్పుడు సినిమాలు, టీవీలు లేవు కాబట్టి సమయం అంతా పరిసరాల కమనీయ దృశ్యాలే కంటి నిండ కదలాడేవి. విద్యుత్ లేదు కాబట్టి రాత్రి కిరోసిన్ నూనెతో ఎక్కాలను, ఖందిల్లను వెలిగించేవారు. రాత్రిపూట మసిబడ్డ బుగ్గలను తుడవడం, కాలిన వత్తులను సరిచేయడం జాగ్రత్తగా నూనె పోయడం ఒక నైపుణ్యంతో కూడుకున్న పని.

నా చిన్ననాటి జ్ఞాపకాలు, వేములవాడ మండలం మారుపాక గ్రామం – కోనరావుపేట మండలం నాగారం గ్రామాల నుండి మొదలవుతాయి. అందులో మారుపాకలో మా కుటుంబం నివసించిన ఊరి ఆవలి గుడిసె ప్రత్యేకం. మాకు రెండు గ్రామాలలో ఆస్తులు ఉన్నాయి. పంచుకుంటే మారుపాకలో ఇళ్లు (గడీ) రాలేదు. అందుకే ఊరి బయట గుడిసెలో కాలం గడిపి నాగారంలో ఒక చిన్న ఇల్లు కట్టారు. అయితే మా తాత గారు (అమ్మ తండ్రిగారు) ఇంటి నిర్మాణానికి బాగా సహాయం చేశారని చెబుతుండేవారు. ఆ గ్రామం పెద్ద అడవిలో ఉండేది కాబట్టి ఎక్కువ కాలం మారుపాకలో గుడిసెలోనే కాలం గడిచిపోయింది. కానీ చివరికి నాన్న నాగారంలోనే చనిపోవడం జరిగింది. అందుకే ఆ గ్రామాన్నే నా వ్యవసాయ క్షేత్రంగా ఎంచుకున్నాను. ఎన్నిసార్లో ఆ గ్రామాన్ని వదిలిపెట్టే పరిస్థితులు వచ్చినా నన్ను మాత్రం వెంటాడి తిరిగి గ్రామానికి తెచ్చుకున్నది నాగారం గ్రామం. ఆ అనుబంధం కూడా చెరిగిపోనిది. ఆర్థికంగా ఎంతో నష్టం జరిగినా సంతోషంగా భరించాను. నా సమయం వృథా అయినా, ఎంతో మంది తీవ్రమైన విమర్శలు చేసినా నాకు మాత్రం సంతృప్తినిచ్చింది నాగారం.

మారుపాక గుడిసెలలో పొద్దున్నుంచి రాత్రి పడుకునే వరకు దోమలు, ఈగలు, కోళ్లు, పశువులు, లేగదూడలు, చెట్లు, చేమలు, పువ్వులు, పొదలు, పురుగులు దాదాపు వెన్నంటే ఉండేవి. అప్పుడప్పుడు తేళ్లు, పాములు దర్శనమిచ్చేవి. చాలా వరకు పారిపోయేవి. దొరికిన వాటిని చంపేవారు. అప్పుడు సినిమాలు, టీవీలు లేవు కాబట్టి సమయం అంతా పరిసరాల కమనీయ దృశ్యాలే కంటి నిండ కదలాడేవి. వర్షాకాలం రాగానే ముళ్ల కంపతో గుడిసె చుట్టూ కొంచెం ఎత్తుతో గోడ మాదిరి నిర్మాణం చేసి, చిన్నగా దాన్ని ఒక చోట వదిలి కట్టెలలో చిన్న తలుపు మాదిరిగా అడ్డం ఉంచేవారు. మా గుడిసెకు తలుపు, తాళం లేదని గర్వంగా రాసుకుంటున్నాను. ముళ్లకంప పైన రకరకాల మొక్కలు తీగలు పారి పువ్వులు పూసి, కాయలు కాసి కంపను కనపడకుండా దాచేవి. గుడిసె చుట్టూ అల్లుకుపోయిన పచ్చదనం, పువ్వుల అందం కొన్ని మాసాలు అద్భుతంగా ఉండేది. విద్యుత్ లేదు కాబట్టి రాత్రి కిరోసిన్ నూనెతో ఎక్కాలను, ఖందిల్లను వెలిగించేవారు. సాయంత్రం అయితేనే ఇది ఒక పెద్దపని. రాత్రిపూట మసిబడ్డ బుగ్గలను తుడవడం, కాలిన వత్తులను సరిచేయడం జాగ్రత్తగా నూనె పోయడం ఒక నైపుణ్యంతో కూడుకున్న పని. ఇంటి ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉన్న గూళ్లల్లో మట్టి ప్రమిదలలో నూనె పోసి ఇంట్లో దూదితో తయారుచేసిన వత్తులను వెలిగించేవారు. దేవుళ్ళ దగ్గర మట్టి మాణిక్యాలను వెలిగించేవారు. ఇవన్నీ ఉన్నా ఎక్కువ సమయం చీకట్లోనే గడిచేది.

వెన్నెల రాత్రులు ఎప్పుడెప్పుడని ఎదురు చూసేవాళ్లము. పంకాలు లేవు కాబట్టి ఉడకపోసినా సహజంగా అనిపించేది. వానకాలంలో కంపనాటడం, ఎండకాలంలో తీయడం, ఒక పెద్ద ప్రక్రియ. కంప తీయటానికి ఉపయోగించే రాగోల (పంగలాంటి పెద్ద కట్టె) పనితనం ఆకర్షణీయంగా ఉండేది. రాత్రిపూట చలికాలంలో గుడిసె ముందు కట్టెలు కాల్చి మంట పెట్టేవారు. అందులో ఒక పెద్ద మొద్దు ఎప్పుడూ మెల్లమెల్లగా కాలుతూనే ఉండేది. అవసరం అయినప్పుడు దాని పైననే ఎండిన పుల్లలు, ఒక చిన్న కంప, ఆకులు వేసి ఊదితే కొంతసేపు చలి కాపుకునే మంట వచ్చేది. దాని చుట్టు గుండ్రంగా కూర్చునేవారము.

గుడిసె ముందు రోలు, రోకలి, గుడిసె లోపల కాగులు, కుండలు, కూజాలు, గిలాసలు, చెంబులు, గంగాలాలు, కొప్పెరలు, దేకీసలు, పొయ్యిలు, దాలి, శిబ్బి, కవ్వం, వేలాడుతున్న ఉట్లు, చల్ల కుండ, పల్లాలు, కూర్చుండే చాపలు, పండుకునే చాపలు, మంచాలు, పరుపులు, దుప్పట్లు, మెత్తలు, జంబుకానాలు, తెల్లవారంగానే బట్టలను చుట్టి ఒక్కొక్కదాన్ని గడెంచ మీద పేర్చేవారు. అల్మారాలు మాత్రం ఉండేవి కావు. మా నాన్న నవారు మంచం మీద, మిగిలిన వారందరం నులక మంచాల మీద, చాపల మీద పండుకునేవారం. పొద్దున లేవంగానే బొగ్గు పొడితో అందరం పండ్లు తోముకునేది. మా నాన్నగారు పండ్ల పుల్ల వేసుకునేది. పండ్ల పుల్లలు కట్టలుగా ఉంచేవారు. అందులో కొన్న యాప పుల్లలు, మధ్యలో ముద్ర బెండ చెట్ల పుల్లలు ఉండేవి. అప్పుడప్పుడు అవి వేసుకొని మా గొప్పతనాన్ని ఎవరికీ తెలియకుండా చాటుకునేవారం. ఆ కాలం నుండే టీ త్రాగుటం అందరికి అలవాటు అయ్యింది. "దాలి" అనేది వంటింట్లో భూమిలో రెండు, మూడు అడుగుల లోతున చతురస్రాకారంలో త్రవ్వి దానిలో పిడకలు వేసి, పైన కుండ పెట్టి దానిలో పాలు పోసి, పిడకలకు నిప్పంటిస్తే అది పొద్దుటి నుండి మధ్యాహ్నం వరకు మెల్లమెల్లగా కాగుతుండేది. కుండకు ఒక శిబ్బి (మేదరి వాళ్ల అల్లినవి) అడ్డంగా మూత మాదిరి పెట్టేది. మొత్తం దాలిపైన సందులుగా కట్టెతో చేసిన తలుపుతో మొత్తం దానిని మూసేది. దానిని దాలిపైన ఉండే జాలి అని పిలిచేవారు. అది ఒక కట్టె కిటికీగా ఉండేది. పాలు పొంగి, మెల్లమెల్లగా కాగుతుండేవి. వేడి మాత్రం శిబ్బి నుండి బయటకు పోయేది. మధ్యాహ్నం పాలు గోధుమ రంగు వచ్చేంత వరకు కాగిన తర్వాత, తీసేసి చల్లార్చి తోడు పెట్టేవారు. ఈ కుండను ఉట్టిమీద పెట్టేవారు. పాల మీది మీగడకు ఒక అద్భుతమైన రుచి, పెరుగైన తర్వాత కూడా ఈ మీగడ మరొక రకమైన రుచినిస్తుంది. పాలు కాగిన తరువాత వాటినే తోడుకని వేరే కుండలో పోసినప్పుడు వేడికి అడుగంటిన పాలు గోధుమ రంగుతో కుండకు అతుక్కుపోయి ఉండేది. దాన్ని కైశిప్ప (కన్కే)తో రాకి తీసిన దాన్ని గోకు అనేవారు. కొన్ని చెంచాలు మాత్రమే వచ్చే దీన్ని చెక్కరలో కలుపుకొని పిల్లలు తినేవారు.

నల్ల తుమ్మ చెట్ల పొదలలో పూసిన పసుపు పచ్చని పువ్వులు ఇంటి చుట్టూ ఉండేవి. ఎక్కడ పడితే అక్కడ పాకిన కట్ల పూవులు, గన్నేరు, మల్లె, ఆకాశ మల్లె పూలు వాటి వాసన అద్భుతంగా ఉండేది. బంతిపూలు, చామంతి, నందివర్ధన పూవులు, గునుక, తంగేడు, మందారం తదితర పూవులు బతుకమ్మ పండుగ నాడు ప్రతి ఇంట్లో చేరేవి. గునుక పూవులకు రకరకాల రంగులు వేసి వరుసలుగా పేర్చి వాటి మధ్యన తంగేడు ఇతర పూవుల వరుసలతో గండ్రంగా బతుకమ్మను పేర్చేవారు. ఊరిలో ఎవరి బతుకమ్మ పెద్దది అనే చర్చ కొన్ని రోజులు నడిచేది. సద్దుల బతుకమ్మనాడు ఊరి చెరువులో బతుకమ్మలను విడిచేవారు. ఈ పండుగ నాడు మహిళలు దాదాపు అన్ని కులాలవారు కలిసిమెలిసి గుండ్రంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడడం చరిత్రాత్మకం. చివరగా అందరూ తెచ్చుకున్న పిండి వంటల పంపకాలు ఆహ్లాదకరంగా ఉండేది. ఈ పండుగలు తెలంగాణా వారు ఎక్కువ ఉన్న ఇతర రాష్ట్రాలు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక తదితర ప్రాంతాల్లో కూడా జరుగుతుండేవి. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సందర్భంగా దీని ప్రచారం ఎక్కువై ప్రపంచంలోని చాలా దేశాల్లో బతుకమ్మ ఆటలు మహిళలు ఆడి–పాడి ప్రత్యేక తెలంగాణా ఆకాంక్షను తెలియజేశారు. నేలరాలిన మోదుగు పూవులను ఏరుకొని రంగులను తయారు చేసుకునేవారం. ఇప్ప పూవులను ఏరుకునేవారం. కొన్నిసార్లు వేకువజామున గ్రామ ప్రజలు, మహిళలు ఇప్ప పూవులను ఏరుకునే సందర్భంలో ఎలుగుబంట్ల దాడులకు గురయ్యేవారు. మల్లెపూలల్లో బొడ్డుమల్లె, సన్నజాజి మల్లె ఇంకా రకరకాల మల్లె పూలను పిచ్చిగా ప్రేమించేవాడిని. వాటిని నా జేబులో వేసుకోవడం రాత్రి మంచంలో పరచుకోవడం, పడుకొని ఆకాశంలో నక్షత్రాలను, మేఘాలను, చంద్రుని చూస్తూ నిద్రలోకి జారుకోవడం దినచర్యగా ఉండేది. మా బాపు (నాన్న) తోట్లోకి పోయేటప్పుడు చేతిలో కర్రా, రూమి టోపీ పెట్టుకునేవాడు. ఇంటికి వచ్చిన తరువాత టోపీ తీస్తే అందులో దాచిన ఎన్నో మల్లెలు కిందపడితే వాటిని ఏరుకునేవారం, నవ్వుకునేవారం, మా నాన్నగారు కూడా సంతోషంగా ఉండడం అప్పుడే చూసేది. మా నాన్నగారితో కలిసి ఉండే క్షణాలు అసలు జ్ఞాపకమే లేవు. ఎప్పుడూ దూరంగానే ఉండేది. పూజ చేసుకుంటున్నప్పుడు మాత్రం మేము ముందర కూర్చుండేవారం. వారు కళ్ళు మూసుకొని జపం చేస్తున్నప్పుడు మేము కళ్ళు తెరుచుకొని కొబ్బరి ముక్కలు చెక్కర కలిపిన పలహారం వైపు చూస్తుండేవారం. మాకు పలహారం పెట్టిన తరువాత పరుగు తీసేవారం. నాకు ఒక చిత్రమైన ఆలోచన ఉండేది. మా నాన్న ఎప్పుడైనా పనిమీద ఏదైనా ఊరికి పోతారా అని ఎదురుచూసేవారం. ఆనాడే మాకు ఆడినంత ఆట, పాడినంత పాట.

• చెన్నమనేని విద్యాసాగర్‌రావు
మహారాష్ట్ర మాజీ గవర్నర్

(స్వీయచరిత్ర 'ఉనిక' నుంచి)

## 31న బల్దియా కౌన్సిల్ సమావేశం

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న జరగాల్సిన గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం 31న మంగళవారం నిర్వహించనున్నట్లు బల్దియా సెక్రెటరీ అలివేలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్దియా కౌన్సిల్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఎజెండాలో పొందుపరిచిన అంశాలపై చర్చ జరుగుతుందని, ఇంకా నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై అభిప్రాయ సేకరణ జరుగుతుందని వెల్లడించారు. గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్, నిధుల విడుదలపై విశ్లేషణ జరుగుతుందన్నారు. కౌన్సిల్ సమావేశం వాయిదాపై కార్పొరేటర్లు, మంత్రి, ఎక్స్ అఫీషియో సభ్యులకు సమాచార లేఖను పంపించామని అలివేలు వెల్లడించారు.







# నేరం.. శిక్ష.. నింద..

**పోలీసుశాఖలో 2024ది ప్రత్యేక పేజీ**

**పలు చోట్ల హత్యలతో ప్రజల్లో భయాందోళనలు**

- రాయపర్తి ఎస్బీఐ చోరీతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం
- వివాదాలతో శాఖకు మచ్చతెచ్చిన పలువురు పోలీసుల అధికారులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో కొందరు పోలీసుల సేవలకు గుర్తింపు
- ఏసీబీ కేసుల్లో పట్టుబడ్డ పలువురు అధికారులు.. రిమాండ్
- గంజాయి నియంత్రణకు యాంటీ డ్రగ్, నార్కోటిక్ పీఎస్ ఏర్పాటు

7

### ముందస్తు చర్యలతో నేరాలు తగ్గుముఖం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- 2024 వార్షిక నేర నివేదిక విడుదల



2024 సంవత్సరం.. వరంగల్ పోలీసు కమిషనరేట్ పోలీసులకు మిశ్రమ అనుభవాలను మిగిల్చింది. కొన్ని నేరాలు ఆందోళన కలిగించగా, మరికొన్ని సంఘటనలు సంచలనం సృష్టించాయి. ముఖ్యంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకు చోరీ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏడుగురు ముఠా సభ్యులు బ్యాంకులో చొరబడి సుమారు రూ.14 కోట్ల బంగారం ఎత్తుకెళ్లారు. పోలీసులు కొందరిని పట్టుకుని కొంత నగదును రికవరీ చేయగా, మిగతా వారిని పట్టుకునే పనిలో ఉన్నారు. అలాగే కొందరు పోలీసులు పలు వివాదాల్లో చిక్కుకుని శాఖకు మచ్చతెచ్చారు. సీఐ రవికుమార్ బాలికపై అత్యాచారయత్నం ఘటనలో పోక్సో కేసును ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు. అలాగే ఏసీపీ నందిరాంనాయక్ అధికార పార్టీ కార్యక్రమంలో పాల్గొని చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అంతేకాక పర్వతగిరి ఎస్సై వెంకన్న రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇదిలా వుండగా, నగరంలో రిటైర్డు బ్యాంకు మేనేజర్ హత్య సంచలనం సృష్టించింది. అలాగే అనుమానం నెపంతో బిహార్ వ్యక్తిని హత్య చేసిన సంఘటన ఆ ప్రాంత ప్రజల్లో భయాందోళనకు గురి చేసింది. మొత్తంగా పోలీసుల్లో, నేరాల్లో 2024 తనకంటూ ఓ పేజీని లిఖించుకుంది.

- వరంగల్ క్రైం, ఆంధ్రజ్యోతి

**కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసులు**

| కేసులు.. | 2023 | 2024 |
|---|---|---|
| హత్యలు | 48 | 40 |
| హత్యాయత్నాలు | 129 | 107 |
| హార్ట్ (అవమానాలు) | 1,573 | 1,600 |
| అల్లర్లు | 77 | 56 |
| ఆల్ టైప్ ప్రాపర్టీ | 924 | 945 |
| నేరాలు.. | | |
| కిడ్నాపింగ్ | 188 | 174 |
| రోడ్డు ప్రమాదాలు | 1,558 | 1,434 |
| చీటింగ్, న్యూసెన్స్ | 5,569 | 5,857 |
| మహిళల కేసులు.. | | |
| మహిళా వేధింపులు | 658 | 624 |
| అత్యాచారం | 189 | 143 |
| వరకట్నపు హత్యలు | 20 | 10 |
| వేధింపులు.. | | |
| 354 (ఐపీసీ) | 402 | 1,141 |
| మొత్తం | 14,731 | 14,406 |

## పురుగుల మందుల వినియోగంలో అవగాహన అవసరం

- శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ దిగుబడి సాధించాలి
- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- మాధన్నపేటలో మిర్చి రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం

నర్సంపేట టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులు పంట సాగు చేసే సమయంలో పంటలపై పురుగు మందులను విచ్చలవిడిగా వినియోగించొద్దని కలెక్టర్ సత్యశారద సూచించారు. శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు, సూచనలను పాటిస్తూ లాభదాయక దిగుబడిని సాధించాలని కోరారు. నర్సంపేట మండలం మాధన్నపేట గ్రామంలోని రైతు వేదికలో శనివారం వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మిరప కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పంటల సాగు సమయంలో శాస్త్రవేత్తలు పంటలను క్రిమి కీటకాల నుంచి రక్షణ కోసం సూచించే మందులను మాత్రమే పిచికారి చేయాలన్నారు. వారు సూచించే వివిధ రకాల సూచనలు, జాగ్రత్తల పుస్తకాలను చదవాలని, చదివే సమయం,



మాధన్నపేటలో రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద

అవకాశంలేని వారు యూట్యూబ్‌లో శాస్త్రవేత్తల సలహాలకు సంబంధించిన వీడియోలను తిలకించి పంట సాగు చేయాలన్నారు. పంటలకు విచ్చలవిడిగా మందులు పిచికారి చేస్తే పంట దిగుబడి తగ్గుతుందన్నారు. కోత అనంతరం బస్తాల్లో మిర్చి నింపే క్రమంలో తొక్కడం లాంటి పనులు చేయవద్దని, సంచుల సామర్థ్యానికి తగ్గట్టు మిర్చిని నింపాలన్నారు. దీని వల్ల తేమ పెరిగి ఫంగస్ ఏర్పడి మిర్చి నాణ్యత దెబ్బతినదని, మంచి ధర వస్తుందన్నారు. జిల్లాలో 11వేల ఎకరాల్లో మిర్చి సాగవుతోందని, ఇందుకు అవసరమైన ఉద్యాన, వ్యవసాయ శాఖ శాఖ అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. వారు మరింత క్షేత్రస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం శాస్త్రవేత్త నాగార్జున ప్రొజెక్టర్‌తో మిర్చి పంట కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సదస్సు అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్యశారద వ్యవసాయ, ఉద్యాన శాఖ, రైతులతో కలిసి గ్రామంలో సాగవుతున్న మిర్చితోపాటు కాలీఫ్లవర్ తదితర పంటలను పరిశీలించారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఆర్డీవో ఉమారాణి, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, జడ్పీ సీఈవో రాంరెడ్డి పాల్గొన్నారు.



అమ్మవారిపేటలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

## గడువులోపు ఎఫ్ఎస్‌టీపీ పనులు పూర్తి చేయాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- క్షేత్రస్థాయిలో పలు అభివృద్ధి పనులు పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో కొనసాగుతున్న ఎఫ్ఎస్‌టీపీ పనులు గడువులోగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. వరంగల్ నగరంలో స్మార్ట్‌సిటీ పథకంలో పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉర్సు, కరీమాబాద్ రోడ్లతోపాటు అమ్మవారిపేటలోని 150 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మిత మతువుతున్న మానవ మలమూత్రాల శుద్ధీ కరణ కేంద్రం (ఎఫ్ఎస్‌టీపీ) పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఇప్పటివరకు ఎఫ్ఎస్‌టీపీ పనులు 60 శాతం పూర్తయ్యాయని అన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను అదేశిస్తున్నట్టు చెప్పారు. ఇంకా నెలరోజుల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, డీఈ రాజ్‌కుమార్, ఏఈలు ముజామిల్, సంతోష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, స్మార్ట్ సిటీ అధికారులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరాజులు తదితరులు ఉన్నారు.

యశోద హాస్పిటల్స్
**యశోద మెడికల్ సెంటర్**
1వ అంతస్థు, జై గోవింద్ కాంప్లెక్స్, ఎస్‌బిఐ పక్కన, నక్కలగుట్ట, హన్మకొండ
సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

| ప్రత్యేకతలు | వైద్యులు | తేది - సమయం |
|---|---|---|
| క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్ | డా॥ హేమంత్ ఉదయరాజు | 01-01-2025 1వ బుధవారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| ఊపిరితిత్తుల వ్యాధులకు కన్సల్టేషన్ | డా॥ గోపి కృష్ణ యడ్లపాటి | |
| కిడ్నీ వ్యాధులకు కన్సల్టేషన్ | డా॥ మామిడి ప్రణీత్ రామ్ | |
| కీళ్ళ వాతము మరియు వాటి కండర వ్యాధులకు కన్సల్టేషన్ | డా॥ జి. సుధీష్ | |
| గ్యాస్ట్రో వ్యాధులకు కన్సల్టేషన్ | డా॥ డి. విశ్వనాథ్ రెడ్డి | 02-01-2025 1వ గురువారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| మణికట్టు, చేతి & పునర్నిర్మాణ కన్సల్టేషన్ | డా॥ మనీష్ కుమార్ జైన్ | |
| న్యూరో & ఇంటర్వెన్షనల్ రేడియాలజి వ్యాధులు | డా॥ జి పి వెంకట్ చౌదరి | |
| వెన్నెముక వ్యాధులకు కన్సల్టేషన్ | డా॥ వంశీ కృష్ణ వర్మ పి | 03-01-2025 1వ శుక్రవారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| కిడ్నీ వ్యాధులు | డా॥ యశవంత్ శ్రీరామ్ జి వి | |
| హెమటాలజి కన్సల్టేషన్ | డా॥ శ్రవణ్ కుమార్ చింతల | 04-01-2025 1వ శనివారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| ఎండోక్రైనాలజీ వ్యాధులు | డా॥ ఆశిష్ రెడ్డి బండి | 05-01-2025 1వ ఆదివారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| వాస్కులర్ కన్సల్టేషన్ | డా॥ ఎస్. శ్రీకాంత్ రాజు | |
| ఆర్థోపెడిక్ / కీళ్ళమార్పిడి కన్సల్టేషన్ | డా॥ నితిన్ కుమార్ బి | 07-01-2025 1వ మంగళవారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |

అపాయింట్‌మెంట్ కొరకు: 0870 - 2427777 | 2447778 | 2447779 | 707 570 4542

SANTOOR
సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీ
ఆంధ్రజ్యోతి ABN
అందమైన ముగ్గులు వేయండి.. ఆనందంగా బహుమతులు అందుకోండి. రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1,50,000/-లకు పైగా బహుమతులు.

| హనుమకొండ జిల్లా | వరంగల్ జిల్లా | మహబూబాబాద్ జిల్లా | జనగామ జిల్లా | జయశంకర్ భూపాలపల్లి జిల్లా | ములుగు జిల్లా |
|---|---|---|---|---|---|
| తేదీ: 5-1-2025 (ఆదివారం) | తేదీ: 4-1-2025 (శనివారం) | తేదీ: 5-1-2025 (ఆదివారం) | తేదీ: 5-1-2025 (ఆదివారం) | తేదీ: 5-1-2025 (ఆదివారం) | తేదీ: 5-1-2025 (ఆదివారం) |
| వేదిక: ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల (KDC) మైదానం, కొత్త బస్టాండ్ రోడ్, హనుమకొండ | వేదిక: సిద్ధార్థ ప్రైమ్ స్కూల్, ద్వారకపేటరోడ్, నర్సంపేట, వరంగల్ జిల్లా | వేదిక: సెవన్ హిల్స్, లక్ష్మి టాకీస్ పక్క వీధి, మహబూబాబాద్ | వేదిక: SPR స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, శ్రీనివాస నగర్ కాలనీ పక్కన, సూర్యాపేట రోడ్డు, జనగామ | వేదిక: అంబేద్కర్ క్రీడా మైదానం, పోలీస్‌స్టేషన్ రోడ్, భూపాలపల్లి | వేదిక: ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్, ఏరియా వైద్య శాల ఎదురు, ములుగు. |
| ఫోన్ నెంబర్లు: 99854 01515, 98493 36896 | ఫోన్ నెంబరు: 99854 11671, 95051 72263 | ఫోన్ నెంబర్లు: 99854 11672, 99854 11691 | ఫోన్ నెంబర్లు: 92472 09344, 93947 81919 | ఫోన్ నెంబర్లు: 99854 56906, 99854 11673 | ఫోన్ నెంబర్లు: 9985411690, 8008929254 |

సమయం: ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు
నిబంధనలు - ■ మహిళలు మాత్రమే పాల్గొనాలి ■ చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి ■ ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి ■ ముగ్గు, రంగులు వగైరా పోటీదారులే తెచ్చుకోవాలి ■ ముగ్గు వేయడానికి గరిష్ట సమయం రెండు గంటలు.

మొదటి బహుమతి రూ.6,000/-
రెండో బహుమతి రూ.4,000/-
మూడో బహుమతి రూ.3,000/-
యవ్వనపు చర్మ రహస్యం




Fashion Partner
DIGSEL WOMEN'S
సెల్సియా
ట్రెండీ మహిళల అంతర్గత దుస్తులు
selsia
TRENDY WOMEN'S
BRA - PANTIES - SLIPS & LEGGINGS
SCAN & BUY
TRADE ENQUIRY : 93445 53675

Gardening Partner
ఎటువంటి పంటలకైనా
క్రాఫ్ట్ వారి
పెర్‌ఫెక్ట్
ఆకు కూరలు, కూరగాయలు, పళ్ల పంటలు, మిరప, పొగాకు, పసుపు వంటి వాణిజ్యపంటలు, వరి, రాగి మొదలైన పంటలు, మిద్దెతోటలు, పెరటి తోటలకైనా చీడపీడలబారిన పడకుండా, లేదా చీడపీడలతో ఆకు ముడలతో పంట పాడైనా రామబాణం లాంటిది 'పెర్‌ఫెక్ట్'. ఒక్క లీటరు నీటికి కేవలం 2ఎంఎల్ పెర్‌ఫెక్ట్‌ను కలిపి పిచికారి చేయడం ద్వారా చీడపీడలు, ఆకుముడత, మిరపలో నల్లతామర వంటి రోగాలను నివారించి, ప్రారదోలి మొక్కలు నూతన జవసత్వాలతో ఏపుగా పెరిగి, (7-15 రోజులకొకసారి పిచికారి చేయవలసి ఉంటుంది) కొత్తపూత పిందెలతో అధిక దిగుబడినిస్తుంది.
✔ వృక్ష ఆయుర్వేదం (100%) ఆర్గానిక్ ✔ సేంద్రీయ వ్యవసాయం ✔ రసాయనిక అవశేషాలు లేని పంటల ఉత్పత్తి ✔ 11 వనమూలికల ఔషధ సమ్మేళనం ✔ సమగ్ర సస్య సంరక్షణ
B.Sc. (Agri), B.Sc.(Horti), Agri Business Management, Any Degree చేసినవారికి ఏరియా/ జిల్లాల వారీగా ఉద్యోగావకాశాలు కలవు. ఆకర్షణీయమైన ఆదాయం. ఆసక్తిగలవారు మెయిల్‌ద్వారాగానీ, ఫోన్‌ద్వారా గానీ సంప్రదించండి.
ఈమెయిల్ ID: globalgreenperfekt@gmail.com, వెబ్‌సైట్: www.perfektindia.in, కస్టమర్ కేర్ నంబర్లు: 94482 74211, 73377 74148





రాతి చిత్రాలను చూపిస్తున్న పరిశోధన బృందం

## బంధాల గుట్టల్లో రాతి చిత్రాల గుర్తింపు

మేడారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం బంధాల గ్రామం దామర్ల గుట్టపై మధ్య శిలాయుగం నాటి రాతి చిత్రాలను గుర్తించామని సమ్మక్క-సారలమ్మ ఆర్కియాలజీ, ఇండిజినస్ పరిధనా కేంద్రం డైరక్టర్ కొర్నిబెల్లి గణేష్ తెలిపారు. మేడారం ఆదివాసీ మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కురుసం రవి బృందంతో కలిసి శనివారం పరిశీంచినట్టుగా తెలిపారు. పూర్వ కోయ, ఆదివాసీలు వేసిన లిపిగా నిర్ధానించామన్నారు. ఈ గుట్టలో మూడు ప్రాంతాల్లో రాక్ షెల్టర్లను గుర్తించినట్లు చెప్పారు. ఇందులో మొదటి షెల్టర్‌లో 12 చిత్రాలను గుర్తించామన్నారు. ఈ చిత్రాలు రాతి 20 మీటర్ల పొడవు, 15 మీటర్ల నిలువు, ఎత్తు ఉందన్నారు. ఈ చిత్రాల్లో కోయ సంప్రదాయలకు చెందిన ఐదో గొట్టు, నుదటి బొట్టు త్రిశూలం గుర్తు 18 దిక్కులా సింబల్ గొట్లను తెలియజేసే చేతి గుర్తులు ఉన్నాయన్నారు. రెండో షెల్టర్‌లో ఐదు తలల నాగుపాము పడిగ చిత్రాలు ఉన్నాయన్నారు. మూడో షెల్టర్ 16 మీటర్ల పొడవు, 6 మీటర్ల ఎత్తు కలిగి ఉందన్నారు. ఇందులో మూడో గొట్టు చిత్రాలు, అడమరాజు కళ్లకు గంతలు కట్టుకొని కాకిని కొట్టిన బొమ్మలు, బానం బొమ్మ, ఆదివాసీలు పూర్వం నూనెను తయారు చేయడానికి ఉపయోగించిన గానుగ మొద్దు సింబల్, ఒక తల్లికి నలుగురు పిల్లలను తెలియజేసే చిత్రాలను గుర్తించామన్నారు. ఈ చిత్రాలు ముదురు ఎరుపు రంగులో ఇసుక రాయి గుణం కలిగిన బండలపై వేసి ఉన్నాయన్నారు. ఆయన వెంట పరిశోధన బృందం సభ్యులు, పురావస్తు శాస్త్రం, భాష శాస్త్రం విద్యార్థులు నవ్య, ధనలక్ష్మి, ధరని, స్వాతి, సమీరా, నవదీపిక, అర్జున్, ఆశోక్, రవి తదితరులు ఉన్నారు.

# బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం వాటా కల్పించాలి
- ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి
- మాజీ స్పీకర్ మధుసూదనాచారి, బీసీ నేత సంజయ్‌కుమార్
- ఏకశిల పార్కు ఎదుట సత్యాగ్రహ దీక్షకు సంఘీభావం

హనుమకొండ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్, శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు ధర్నాచౌక్ వద్ద బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తే రాష్ట్ర స్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. బీసీల పోరాటం.. మహా పోరాటం కాకముందే కాంగ్రెస్‌పార్టీ హామీలను అమలుపర్చాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యమాలకు ముందుండి పోరాడుతామని తెలిపారు. బీసీఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీలంతా సంఘటితంగా ఉండి పోరాటంచేయాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను అమలు పర్చాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలన్నారు. లేకుంటే ఉద్యమాలను విస్తృతపరుస్తామని తెలిపారు. జనాభాలో 60శాతం ఉన్న బీసీలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరిగౌడ్, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీ బూర్ల నరేందర్, సీనియర్ జర్నలిస్టు సోమ శ్రీనాథ్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, బుట్టి శ్యాం యాదవ్, వివిధ జిల్లాల బీసీ సంఘాల అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు సంజయ్‌కుమార్

## విద్యారంగ సమస్యలను విస్మరించిన సీఎం

వడ్డెపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి విద్యా రంగ సమస్యలను విస్మరించారని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి గారడీ చేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలిందని దుయ్యబట్టారు. గురుకులాల్లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర జిల్లా నాయకులు ఆరెపెల్లి సుజిత్, మెరుగు సాయికుమార్, తాళ్లపల్లి అరుణ్, బానోత్ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్రినల్ గ్రంథికి లాప్రోస్కోపిక్ చికిత్స

- యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి

వరంగల్ మెడికల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అడ్రినల్ కణతిని లాప్రోస్కోపిక్ పద్ధతిలో తొలగించి రోగి ప్రాణాలను కాపాడినట్లు శ్రీనివాస కిడ్నీ సెంటర్ వైద్యులు యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి మానస(31) ఎడమ వైపు కడుపునొప్పితో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొంది తగ్గకపోవడంతో తమ ఆస్పత్రికి వచ్చినట్లు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రోగికి ఎడమ అడ్రినల్ గ్రంథిలో కణతి 14 సెంటిమీటర్లు ఉండి స్ప్లీన్, ప్యాంక్రియాస్, ఎడమ కిడ్నీకి అతుక్కొని ఉందని గుర్తించామన్నారు. అత్యంత క్లిష్టమైన లాప్రోస్కోపిక్ పద్ధతిలో సుమారు 3 గంటలపాటు శ్రమించి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. మిగతా అవయవాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఎంతో నైపుణ్యంతో శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ తర్వాత హనుమకొండలోనే ఈ తరహా ఆపరేషన్ తొలిసారి చేశామన్నారు. యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డితోపాటు డాక్టర్ అభినయ్, డాక్టర్ ప్రభురామ్, అనస్తీషియా వైద్యులు స్రామాట్ లాప్రోస్కోపిక్ సర్జరీలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి


ఆంధ్రజ్యోతి లో మీ శ్రేయస్సు కోరే వారికి అందించండి...

పదవీ విరమణ శుభాకాంక్షలు

మీ ఆత్మీయులలో..
మీ సహోద్యోగులలో...
మీ కుటుంబ సభ్యులలో...
ఎవరైనా రిటైర్డ్ అవుతున్నారా ?

అందిస్తుంది సులువైన మార్గం పదవీ విరమణ ప్రకటనలకు 25% EP లకు 15% రాయితీ కల్పిస్తుంది

అలాంటి వారు తమ విధి నిర్వాహణలోని అనుభవాలు, సలహాలు, సూచనలు ఇచ్చి మీ అభివృద్ధికి మార్గదర్శకులై ఉంటారు. అయితే వారికి తీపి గుర్తుగా, మీ అమూల్యమైన కానుకగా ఆంధ్రజ్యోతి ద్వారా అందించండి... పదవీ విరమణ శుభాకాంక్షల అక్షర సుమాంజలులు...

ఆంధ్రజ్యోతి ప్రకటనల విభాగము

సంప్రదించండి : 9985411172
హన్మకొండ : 9985411677, 9985411676
వరంగల్ : 9985406150, 9985408173
జనగామ : 9866431354,
మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట : 9985418040
జయశంకర్ : 9985401232


# హోరాహోరీగా రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడలు

- ప్రారంభించిన ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, మేయర్ సుధారాణి, కలెక్టర్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, సెపక్‌తక్రా క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి.శనివారం జేఎన్ఎస్‌లోని హ్యాండ్ బాల్ కోర్టులో నిర్వహిస్తున్న హ్యాండ్‌బాల్ పోటీలను ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. అదేవిధంగా సెపక్‌తక్రా పోటీలను తిలకించి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు.

ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో జేఎన్ఎస్‌లో హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా, ఎర్రగట్టు సమీపంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బ్యాడ్మింటన్ పోటీలను మూడు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే కొన్ని క్రీడల్లో క్రీడాకారులు సెమీ ఫైనల్స్, ఫైనల్స్‌కు చేరుకున్నారన్నారు. క్రీడాపోటీల నిర్వహణలో భాగంగా రెండో రోజు 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఆదివారంతో ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ డీఎస్ఏ కోచ్‌లు రమేష్, వెంకటేశ్వర్లు, అఫ్జల్, నవీన్, విష్ణు, శంకర్, రాజు, ప్రశాంత్, శ్రీమన్నారాయణ, పీడీలు, పీఈటీలు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు, మేయర్ సుధారాణి



రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు


ఆంధ్రజ్యోతి Sunday Classifieds

**WANTED DOCTOR**
★ Wanted Doctor at Dr K. Sanjeev Reddy Clinic (Running Clinic) Yellam Bazaar,Warangal. 9848242241
AJW-199247

**WANTED**
★ Duty Doctor Required to Work in Jayakrishna Hospital, Hanamkonda. Contact : 9618101811
AJW-7634

**WANTED TEACHERS**
★ Wanted Lady Teachers to Teach Maths, English for 1st to 5th Classes. Pre-Primary Teachers and Lady Principal required. Masster high School. Cont : 9347903778
AJW-226305

**WANTED**
★ హనుమకొండలో మా సంస్థ యందు పనిచేయుటకు 3 వీలర్ బ్యాచ్ డ్రైవర్ మరియు సప్లై బాయ్ కావలెను. మంచి జీతం వేతనం ఇవ్వబడును. Cont.: 9666717040
AJM-12595

**WANTED**
★ గ్రామీణం నాచురల్ ప్రొడక్ట్ హన్మకొండ చుట్టుపక్కల గ్రామాలలో స్టాల్స్‌లో సేల్స్ చేయుటకు మహిళ కావలెను. ఆసక్తి ఉన్నవారు మాత్రమే. సం॥ప్ర॥ 8341679680
AJW-226299

**అర్జెంటుగా కావలెను**
★ ప్రముఖ కాలేజ్ హాస్టల్లో పనిచేయడం కొరకు అనుభవం కలిగిన వంట మాస్టర్ (భార్య-భర్తలు) కావలెను. మరియు లేడీ వార్డెన్స్ (ఫుల్ టైమ్) కావలెను. సం॥ప్ర॥ 6305190609, 8341535657
AJW-226294

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

**PLOT FOR SALE**
★ ఇ.నెం. 25-5-474/A/2, రెడ్డిపురం, సాయికృప కాలనీలో ఒక రూం పేసి చుట్టూ కాంపౌండ్ కట్టి, గేటు పెట్టిన 300 గజాల ప్లాట్ తూర్పు ఫేసింగ్ కలది అమ్మబడును. Hnk చౌరస్తా నుండి కేవలం 2Km దూరం. No బ్రోకర్స్. సెల్ : 9395581655
AJW-226281

**PLOT FOR SALE**
★ At Hunter Road Before ALLURI M.B.A College 300 Sqyrds N/F Open Plot For Sale as per Vastu, Clear title Ready for Construction of Luxury House Cell.No: 9848045527
AJW-3362

**LAND FOR SALE**
★ వరంగల్ మునిసిపాలిటి పరిధిలో మొగిలిచర్ల గ్రా॥ నందు దారి కలిగిన పట్టా పాసుబుక్కు ఉన్న 20 గుంటల భూమి అమ్మబడును. సం॥ప్ర॥ 9948437034
AJW-226304

**HOUSE FOR SALE**
★ హన్మకొండ హంటర్ రోడ్‌లోని టెంపుల్ ట్రీస్ విల్లాస్ దగ్గర G+3, 2100 SFT. 3BHK New బిల్డింగ్ అమ్మబడును. సం॥ప్ర॥ 9346402588
AJW-199496

**HOUSE FOR SALE**
★ KU 'X' Road రోడ్, Dream land ఫంక్షన్ హాల్ ఎదురుగా, TATA సర్వీస్ సెంటర్ ప్రక్కన అక్షర కాలనీలో 200 చ.గ.లలో నూతనంగా నిర్మించబడుతున్న అన్ని వసతులు గల ఇండిపెండెంట్ ఇల్లు అమ్మబడును. సం॥ప్ర॥ 9849007864
AJW-199496

**SHUTTER FOR SALE**
★ NGO'S Colony Raod with 60yrds Land G+1 Commercial Building for Sale with 2 Shops in G/F, Hall In 1st floor Indira Nagar,Vijaypal Colony 60 feet Main Road Ready to Occupy. Cell.No: 9848045527
AJW-3361

**సాయిసేవా వృద్ధ ఆశ్రమము**
★ హన్మకొండ వడ్డేపల్లి నందు ఆధునిక వసతులతో గత 10 సం॥రాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ నూతనంగా బ్లాకు అందుబాటులోకి తేవడం జరిగింది. సం॥ప్ర॥ 9848444020, 9110551507
AJW-199485

**శ్రీశైలి బ్యూటీపార్లర్**
★ New Year Offer మా పార్లర్‌లో రూ.3500/-కే బ్యూటీషియన్, మెహందీ, Nail Art, టైలరింగ్ కోర్స్ With సర్టిఫికేట్‌తో నేర్పించబడును. సం॥ప్ర॥ 9989060668
AJW-226297

**CHANGE OF NAME**
★ I, SHIRISHA TANGELLA (Old Name), H.No. 2-101, Kondaparthy, Inavole, Hanumakonda, T.G. have changed my name from SHIRISHA TANGELLA TO SRIJA GOLANAKONDA (NEW NAME) W/o. SURENDAR GOLANAKONDA in all my Records.
AJW-226298

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

**అమ్మకానికి కలదు**
★ Restaurant/హోటల్ అమ్మకానికి కలదు కిట్స్ కాలేజి ప్రక్కన, ఎర్రగట్టు గుట్ట, సంప్రదించవలసిన ఫోన్ నెం : 9281474365
AJW-5758

**TO-LET**
★ గణేష్ నగర్, టీచర్స్ కాలనీ, DNL రెసిడెన్షియల్‌లో Flats అద్దెకు ఇవ్వబడును. కార్ పార్కింగ్ సౌకర్యం కలదు. సం॥ప్ర॥ 9440721207
AJK-218271

**TO-LET**
★ దేశాయిపేట రోడ్, టీచర్స్ కాలనీ, DNL రెసిడెన్షియల్‌లో కమర్షియల్ షెటర్ దానికి అనుకొని Single Bed Room గలది అతి తక్కువ రెంట్‌తో అద్దెకు ఇవ్వబడును. కార్ పార్కింగ్ సౌకర్యం కలదు. సం॥ప్ర॥ 94407 21207
AJK-218273

**BUILDING FOR RENT**
★ 3 Floor's Building for rent, each floor has 3,600sqft Ground floor for parking place available. Opp: ASM Degree & PG Womens College, Fort Road Warangal. Cell : 9849987606, 8309884828
AJW-17385

**BUILDING NEW TILES FOR SALE**
★ కొత్త ఇంటి నిర్మాణంలో భాగంగా సీల్ తీయని Kajaria టైల్స్ మిగిలి పోయినవి తక్కువ ధరకు అమ్మబడును. సం॥ప్ర॥ 9885175981
AJW-7533

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232


# ఆపరేషన్ టైగర్

- నల్లబెల్లి ఏనే అడవి ప్రాంతంలో పెద్దపులి కోసం వేట
- పాదముద్రల ఆనవాళ్లతో గాలిస్తున్న అధికారులు



రుద్రగూడెంలో మొక్కజొన్న చేనులో పెద్దపులి సేద తీరిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

నల్లబెల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామంలో శనివారం ఉదయం నూనవత్ పద్మ తమ వ్యవసాయ పంట చేను పరిధిలో పెద్దపులిని చూశానని తెలపడంతో ఫారెస్ట్ అధికారులు వేగంగా గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే ఒల్లేనర్సయ్యపల్లి గ్రామంలో కూడా ఓల్లే పైడి మక్కజొన్న చేనులో పులి గాండ్రింపు వినబడిందని తెలపడంతో ఫారెస్ట్ అధికారులు, పోలీసు అధికారులు వెళ్లి పరిశీలించారు. అనంతరం పెద్దపులి పాదముద్రల ఆనవాళ్లతో నర్సంపేట ఎఫ్ఆర్‌వో రవికిరణ్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రుద్రగూడెం గ్రామంలోని రైతు అంబీరి రాజేందర్ మక్కజొన్న చేనులో పెద్దపులి సేద తీరి, మలవిసర్జన చేసిన ఆనవాళ్లను గుర్తించారు. ఇదే పాదముద్రల ఆనవాళ్లతో రుద్రగూడెం శివారులోని ఏనే అడవి చుట్టూ సమగ్రంగా ఫారెస్ట్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి పెద్దపులి పాదముద్రల ఆనవాళ్లు ఏనే అడవిలోకే ప్రవేశించినట్లు గుర్తించారు. పెద్దపులి ఏనే అడవిలోనే తిష్టవేసి ఉండవచ్చని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని కోరారు. పెద్దపులి సంచారాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటామన్నారు. ప్రజలు రాత్రిపూట తిరగవద్దన్నారు. పశువులను జాగ్రత్తగా కట్టివేయాలని కోరారు. రుద్రగూడెంలో డప్పు చాటింపు చేయాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. పెద్దపులి కదలికలను త్వరలోనే పసిగట్టి ప్రజలకు ఉపశమనం కలిగిస్తామన్నారు.

## కొత్తకొండ మండలం ఏర్పాటుకు ప్రయత్నాలు

- రెవెన్యూ అధికారులను నివేదిక కోరిన ప్రభుత్వం
- ఎన్నికల ముందు హామీ ఇచ్చిన పొన్నం ప్రభాకర్



కొత్తకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని రిలే దీక్ష చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

భీమదేవరపల్లి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో కొత్తగా కొత్తకొండ మండలాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పొన్నం ప్రభాకర్.. కొత్తకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచిన పొన్నం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల మండల కేంద్రం ఏర్పాటు విషయమై స్థానికులు కోరారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేరుగాంచిన ఐనవోలు, చిల్పూరు, కరీంనగర్ జిల్లాలోని ఇల్లంతకుంట దేవస్థానాలను మండల కేంద్రాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. అదే సమయంలో కొత్తకొండను కూడా మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు రిలే దీక్షలు నిర్వహించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి సైతం పలువురు గ్రామస్థులు కొత్తకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలన్ని మంత్రి దృష్టికి గ్రామస్థులు ఇటీవల తీసుకెళ్లారు. ఈ విషయాలన్నిటినీ అధ్యయనం చేసిన మంత్రి.. రాష్ట్ర ప్రభుత్వం తరుపున రెవెన్యూ అధికారులను నివేదిక కోరారు. కాగా, కొత్తకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్, ముస్తాఫాపూర్, కొత్తకొండ, మల్లారం, రెవెన్యూ గ్రామాలతో పాటు బొల్లోనిపల్లె, రాంనగర్, గొల్లపల్లి, వీరభద్రనగర్, చంటయ్యపల్లి, వీర్లగడ్డ తండా, రసూల్‌పల్లి గ్రామాలను కలపాలని రెవెన్యూ అధికారులు ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే వేలేరు మండలం నుంచి ఇటీవల భీమదేవరపల్లి మండలంలో కలిపిన ఎర్రబెల్లి గ్రామాన్ని, వేలేరు మండలంలోని కన్నారం గ్రామాన్ని కూడా కొత్తకొండలో కలపాలని ప్రతి పాదనలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు రెవెన్యూఅధికారులు నివేదికలు తయారుచేస్తున్నట్లు సమాచారం.


# 'కబేళా' టెండర్లలో ఆజమాయిషీ

- పోటీకి రాకుండా రాజకీయ ఒత్తిళ్లు
- తక్కువ కొటేషన్‌తో బల్దియా ఆదాయానికి గండి
- మూడు జంతువధ శాలలకు ముగిసిన వేలంపాట

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో నడుస్తున్న కబేళా (జంతువధ శాలల) టెండర్లలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. టెండర్లలో ఎవ్వరినీ పాల్గొనకుండా అడ్డుకోవడంతో పాటు కొటేషన్ వేసిన వారిని బెదిరింపులకు గురిచేసిన సంఘటనలు జరిగాయి. ఇంకా కొందరిని ప్రజా ప్రతినిధులతో బుజ్జగించగా.. మరికొందరు చెల్లించిన డబ్బులకు అదనంగా కొంత డబ్బు కలిపి ఇస్తామని ఆశ చూపించారు. ఈ క్రమంలో అక్కడక్కడా వాగ్వాదాలు సైతం జరిగాయి. శనివారం బల్దియా అదనపు కమిషనర్ (ఏసీ) కార్యాలయంలో జంతువధ శాలల టెండర్లు జరిగాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేటప్రాంతాలకు మూడు కబేళాలు ఉండగా, వరంగల్‌కు ఎక్కువ డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది పోటీలో పాల్గొన్నారు. ఓపెన్ యాక్షన్ టెండర్ బల్దియా అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, వెటర్నరీఅధికారి డాక్టర్ గోపాల్‌రావు, సూపరింటెండెంట్ ఉమా దేవేందర్, భాస్కర్ పర్యవేక్షణలో జరిగింది.

### పోటీలో 13 మంది టెండరుదారులు

హనుమకొండ, వరంగల్, కాజీపేట జంతువధ శాలలకు 13 మంది పోటీ పడ్డారు. అయితే రూ.7.50లక్షలకు వరంగల్ కబేళాను కోగిల్‌కార్ సత్యనారాయణ, హనుమకొండ కబేళాను రూ.7.08 లక్షలకు ఎస్డీ జహంగీర్, కాజీపేట కబేళాను రూ.2.16 లక్షలకు ఎమ్డీ.సర్వర్‌లు దక్కించుకున్నారు. వాస్తవంగా ఈ ఓపెన్ యాక్షన్‌లో రాజకీయ ఒత్తిళ్లు, లోపాయికారి ఒప్పందాలు లేకపోతే ఒక్కో సెంటర్‌కు మరో రూ.2లక్షలకు పైనే బల్దియాకు ఆదాయాన్ని వచ్చేది. ఇలా చాలా మంది సీనియర్లు పథకం ప్రకారం టెండర్లు దక్కించుకున్నట్లు ప్రచారం ఉంది.



బల్దియా కబేళా టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లు

### ఎందుకింత డిమాండ్?

వరంగల్ ట్రైసిటీస్‌లో మూడు జంతువధ శాలలు ఉన్నాయి. ఇక్కడ కోసిన జంతువులను మాత్రమే రిటైల్ షాపు యజమానులు వారి వారి షాపులకు తీసుకెళ్లి మాంసాన్ని విక్రయించాలి. లేదంటే బల్దియా అధికారులు గుర్తించి జరిమానా విధిస్తారు. ఇలా ప్రతీవారం వరంగల్‌లో 700, హనుమకొండలో వెయ్యికిపైగా, కాజీపేటలో 300కుపైగా జంతువులను వధించి వాటి మాంసాన్ని విక్రయిస్తారు. వెటర్నరీ డాక్టర్ దగ్గరుండి జంతువు ఆరోగ్యంగా ఉందా?లేదా అని పరీక్షించిన తర్వాతనే కోయాలి. కానీ, నిబంధనలు పాటించకుండా కొందరు టెండరుదారులు రిటైల్ షాపుల యజమానులతో కుమ్మక్కై వారి వారి షాపుల వద్దనే వధించి మాంసాన్ని విక్రయించేందుకు సహకరిస్తున్నారు. ఇంకా కొందరు బల్దియాకు సంబంధించిన స్టాంప్‌ను స్వయంగా తయారు చేసుకుని మాంసానికి ముద్ర వేసి ప్రజలను నమ్మిస్తూ వ్యాధుల బారిన పడిన జంతువుల మాంసాన్ని విక్రయిస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇలా నెలకు వేలలో జంతువులను వధించి తక్కువ లెక్క చెప్పి బల్దియా అధికారులను తప్పుతోవ పట్టిస్తున్నారు. ఇంకా కొందరు అధికారులకు, బల్దియా వైట్‌కాలర్ జవాన్‌లకు వారాంతరపు మాంసాన్ని పంపిస్తూ అటుగా రాకుండా అడ్డుకుంటున్నారు. ఇలా కొందరు టెండరుదారులు చాలాకాలంగా చీకటి వ్యాపారం సాగిస్తూ కోట్లు దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించిన కొత్తగా చేజిక్కించుకున్న కబేళాలపై తరుచుగా తనిఖీలు చేసి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని నగర ప్రజలు కోరుతున్నారు.

# నేరం.. శిక్ష.. నింద

## పోలీసు శాఖలో 2024ది ప్రత్యేక పేజీ

వరంగల్ క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాదిలో ఎఫ్ఐఆర్‌లు తక్కువగా నమోదైనప్పటికీ ఆస్తుల నేరాలు, మోసాలు, న్యూసెన్స్ ఘటనలు పెరిగాయి. కొంత మంది పోలీసులు వివాదాల్లో చిక్కుకొని పోలీసుశాఖ చెడ్డపేరు తీసుకొచ్చి ప్రజల్లో నమ్మకం పోయేలా వ్యవహరించారు. కొంతమంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజల ఫిర్యాదులపై సత్వరమే స్పందించి రాష్ట్ర పోలీసుబాస్‌తో ప్రశంసలు అందుకున్నారు. కమినషరేట్‌లో కొత్తగా యాంటీ డ్రగ్ టీంతో పాటు వరంగల్, ఖమ్మం జిల్లాకు కలిపి జనవరిలో కొత్తగా ఏర్పాటైన నార్కోటిక్స్ బృందాలతో పోలీసుశాఖ గంజాయిని అధిక మొత్తంలో పట్టుకుంది.

### సంచలనంగా మారిన ఎస్‌బీఐ దోపిడీ

వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో నవంబరు 18న అర్ధరాత్రి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏడుగురు ముఠా సభ్యులు చొరబడి సుమారు రూ.14 కోట్ల విలువ చేసే బంగారం ఎత్తుకెళ్లడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. బ్యాంకు లాకర్లలో బంగారం దాచిపెట్టు కున్న ఖాతాదారులంతా బ్యాంకు వద్ద చేరుకొని పోలీసులను ప్రాధేయపడ్డారు.

ఎట్టకేలకు చోరీ జరిగిన 18 రోజులకు ఏడుగురు ముఠా సభ్యుల్లో నుంచి ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్షద్ అన్సారీ, షాకీర్‌ఖాన్ అలియాస్ బోలెఖాన్, హిమాన్షు బిగాం చండ్ జాన్వర్‌ను అరెస్టు చేసి రూ.1,80,4000 విలువచేసే 2కిలోల 520 గ్రాముల బంగారం అభరణాలు, చోరీకి వినియోగించిన కారు, పదివేల నగదును స్వాధీనం చేసుకున్నారు. విగిలిన నలుగురు నిందితుల్లో ప్రధాన నిందితుడు మహమ్మద్ నవాబ్ ఇటీవలే పోలీసులకు పట్టుకున్నప్పటికీ అతడి నుంచి ఎలాంటి బంగారాన్ని స్వాధీనం చేసుకోలేకపోయారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా.. సుమారు రూ.12 కోట్ల విలువైన బంగారం జాడ ఇంతవరకు తెలియరాలేదు. చోరీ జరిగి రెండు నెలలకు పైగా అయినప్పటికీ బంగారం రికవరీ కాకపోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

### డ్రగ్స్ నివారణకు కొత్తగా బృందాలు

కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు కమిషనరేట్ కార్యాలయంలో యాంటీ డ్రగ్ టీమ్ కొత్తగా ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లో సీఐతో ఒక ఆర్ఐ, ముగ్గురు ఆర్ఎస్సైలు ఆరుగురు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు కొత్త నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. నార్కోటిక్స్ పీఎస్ ఈ ఏడాది జనవరి నుంచి పనిచేస్తుండగా డిసెంబర్ 3న సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ పర్యటనకు వచ్చిన సందర్భంగా వర్చువల్ పద్ధతిలో పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. నార్కోటిక్స్ పోలీ సులతో పాటు కమిషనరేట్ యాంటీ డ్రగ్ టీమ్‌లు కలిసి పెద్ద మొత్తంలో గంజాయిని సీజ్ చేశారు. వెస్ట్‌జోన్‌లోని జనగామ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ విధులు కోసం ప్రత్యేకంగా 15 మంది సిబ్బందిని కేటాయించారు.

### ప్రతిభకు ప్రశంసలు



ఫిర్యాదుదారులకు సకాలంలో సేవలందించినందుగానూ పౌర సేవల్లో భాగంగా ఆత్మకూరు, చిల్పూరు పోలీస్‌స్టేషన్‌లకు బెస్ట్ సిటిజన్ సర్వీస్ రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కేంద్ర ప్రభుత్వం అందించే అతి ఉత్కృష్ట సేవా పతకాలకు హెడ్‌కానిస్టేబుల్ మల్లారెడ్డి, కానిస్టే బుల్ మహేశ్‌లు ఎంపికయ్యారు. సైబర్ నేరాలను నియంత్రించడం కోసం కేంద్ర హోంమంత్రి శాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ కమాండోల శిక్షణకు తెలంగాణ రాష్ట్రం నుంచి వరంగల్ కమిషనరేట్‌లో డిప్యూటీ ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న ప్రశాంత్ ఎంపికయ్యాడు. మహిళపై జరిగిన సాముహిక అత్యాచారం కేసులో నిందితులకు ఉరిశిక్షపడేలా దర్యాప్తు జరిపిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఆడెపు సత్యనారా యణకు నవం బర్ 1న కేంద్ర ప్రభు త్వం యూ నియన్ మెడల్ ప్రక టించింది.

### ఏసీబీ దాడులు

అవినీతికి పాల్పడుతూ అక్రమ అస్తులను కూడబెట్టిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులను ఏసీబీ ప్రత్యేక నిఘా పెట్టి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 కేసులు నమోదు చేసి 28 మందిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. 2011లో ఓ కేసులో పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్‌కు ఏడాది జైలు శిక్ష పడింది.

### వివాదాల్లో పోలీసులు

ఐజీ అటాచ్డ్‌గా ఉన్న సీఐ ఎం.రవికుమార్ కాజీపేట పీఎస్ పరిధిలోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అదే అపార్ట్ మెంట్‌లో ఉన్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురి చేయడంతో కాజీపేట పోలీస్‌స్టేషన్ రవికుమార్‌పై పోక్సో కేసు నమోదైంది. అజ్ఞాతంలో ఉన్న సీఐని ముందస్తు బెయిల్ తెచ్చుకునేంతవరకు అరెస్టు చేయకుండా కాపాడారని కమిషనరేట్ పోలీసులపై తీవ్ర విమర్శలు వచ్చాయి. మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ యూనిఫామ్‌లో పాల్గొని రాజకీయ ప్రసంగాలు చేస్తూ ప్రజల్లోకి తప్పుడు సమాచారం చేరవేశారనే విమర్శలు వచ్చాయి. ఓ మంత్రి బంధువుతో ఎల్కతుర్తి ఎస్సై రాజ్‌కుమార్ అంటకాగుతూ విధుల్లో అలసత్వం కారణంగా సస్పెన్షన్‌కు గురయ్యాడు. మరికొంత మంది అధికారులు వివాహేతర సంబంధాలు కొనసాగిస్తూ వార్తల్లో నిలిచారు.

అలాగే ఆగస్టు 2న పర్వతగిరి ఎస్సై గుగులోతు వెంకన్న రూ. 20,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. 'ఏక్ స్టేట్ ఏక్ పోలీసు' నినాదాన్ని అమలు చేయాలని మామునూరు ఫోర్త్ బెటాలియన్ పోలీసులు రోడ్డెక్కారు.

### హత్యల కలకలం

కిందటేడు కంటే ఈ ఏడాది హత్యలు కొంత తక్కువ జరిగినప్పటికీ ఈ మధ్యకాలంలో మట్టెవాడ పోలీస్టేషన్ పరి ధిలోని భద్రకాళి చెరువు కట్ట వద్ద కారులో లభ్యమైన రిటైర్డు బ్యాంకు ఉద్యోగి రాజుమోహన్ మృతదేహంతో నగరంలో కలక లం రేపింది. జఫర్‌గఢ్ మండలం బుర్హాన్‌పల్లిలో రాజకీయ కక్షల కారణంగా కిరాయి రౌడీలతో తండ్రీ, కొడుకులు కలిసి ఇంట్లో ఉన్న వ్యక్తిని అతి దారుణంగా చంపడం కమిషనరేట్‌లో తీవ్ర సంచలనంగా మారింది. ఇటీవల మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో బిహార్ వ్యక్తిని అనుమాన నెపంతో కొందరు వ్యక్తులు హతమార్చడం గ్రేటర్ వరంగల్‌లో తీవ్ర చర్చకు దారి తీసింది. రాజు మోహన్, బిహార్ వ్యక్తి కొద్ది రోజుల తేడాతోనే హత్యకు గురికావడం ప్రజలను భయాందోళనకు గురయ్యారు.

## ముందస్తు చర్యలతో నేరాలు తగ్గుముఖం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ
- 2024 వార్షిక నేర నివేదిక విడుదల

వరంగల్ క్రైం, (ఆంధ్రజ్యోతి) : ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా గతంకంటే ఈ ఏడాది నేరాలు తగ్గాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ 2024 సంవత్సరంనకు సంబంధించి క్రైం వార్షిక నివేదిక ప్రకటన సందర్భంగా శనివారం కమిషనరేట్ ఆవరణంలో సీపీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కమిషనరేట్ యాంటీ డ్రగ్స్‌తో పాటు వరంగల్ నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు ద్వారా కమిషనరేట్ పరిధిలో అధిక మొత్తంలో గంజాయిని పట్టుకుందన్నారు. పోలీస్‌శాఖలో క్రైమ్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ మూడు విభాగాలుగా విభజించి ఉంటాయన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు జనగామ జిల్లాలో 15 మంది సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించామన్నారు. రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ నిబంధనలపై కొంత కాలంగా విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొత్తంగా గతం కంటే ఈసారి 11 శాతం క్రైమ్ రేటు తగ్గిందన్నారు. 45 మంది అంతరాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకొని సుమారు రెండున్నర కోట్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు 590 కేసుల్లో 1,145 మంది నిందితులను అరెస్టు చేసి రూ.10,77,20,196 కోట్లను సీజ్ చేశామన్నారు. సిబ్బంది కొరతతో గతంలో కొంత ఇబ్బందులు ఉండేదని, ప్రస్తుతం ఈ ఏడాది 800 పోలీసులు కమిషనరేట్‌కు కొత్తగా వచ్చారన్నారు.

పాత, కొత్త వారిని కలుపుకొని రానున్న రోజుల్లో నేర రహిత సమాజంకు కృషి చేస్తామని సీపీ ప్రకటించారు. జనవరి 1 వేడుకల దృష్ట్యా ఇప్పటికే రోడ్లపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ మనాన్‌భట్, ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, అడిషినల్ డీసీపీ రవి, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజు, ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ కర్ణాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

### నో కామెంట్స్

వార్షిక నివేదిక వెల్లడించిన అనంతరం విలేకరులు సంధించిన ప్రతీ ప్రశ్నకు సీపీ 'నో కామెంట్' అంటూ దాటవేశారు. పోక్సో కేసులో నిందితుడు సీఐ రవికుమార్ ముందుస్తు బెయిల్ తెచ్చుకునేంతవరకు ఎందుకు అరెస్టు చేయలేదు..? ఇది పోలీసుల వైఫల్యం కాదా? అని ప్రశ్నిం చగా సమాధానాన్ని దాటవేశారు. ఎల్కతుర్తి ఎస్సైపై సస్పెన్షన్ వేటు వేసి అదే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీ నందిరాంనాయక్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తే సమా ధానం చెప్పలేదు. రౌడీషీటర్ల ఆగడాలు మితి మీరుతున్నాయని పత్రికల్లో కథనాలు వస్తున్నాయి కదా.. వారిమీద ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడగగా, కేసు నమోదైతేనే చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు కానివారిపై ఏ విధంగా చర్యలు తీసుకుం టామని పీసీ ప్రశ్నించారు. ఆపై విలేకరులు ప్రశ్నలు అడుగుతుండగానే సీపీ వేదికపై నుంచి వెళ్లిపోయాడు.

# సంచలనాల ఏడాది

- అలజడి రేపిన వాజేడులో అన్నదమ్ముల హత్య
- రక్తమోడిన రోడ్లు.. భయపెట్టిన పెద్దపులి



చల్పాకలో మావోయిస్టుల మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్ (ఫైల్)

ములుగు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 2024.. కాలగర్భంలో కలిసి పోతూ చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. రాష్ట్రస్థాయిలో సంచలనం కలిగించిన పలు ఘటనలు ములుగు జిల్లాలో జరిగాయి. ఎన్‌కౌంటర్లు, హత్యలు, రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలను శోకసంద్రంలో ముంచాయి. డిసెంబరు 1న తెల్లవారుజామున ఏటూరునాగారం మండలం చల్పాక అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముఖ్య నేతలు భద్రు, మధు ఉన్నారు. వారిపై పోలీసులు విషప్రయోగం చేశారని, బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ పౌరహక్కుల సంఘం ఆరోపించగా మధు భార్య మీనా హైకోర్టులో కేసు వేసింది. మరుసటి రోజే వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సూర్యపేట జిల్లాకు చెందిన అనూష అనే యువతి ప్రేమపేరుతో వంచించడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. నవంబరు 21న వాజేడు మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ఊకే రమేష్, ఆయన సోదరుడు అర్జున్‌ను మావోయిస్టులు కత్తులు, గొడ్డళ్లతో అతి కిరాతంగా హత్య చేశారు. తాడ్వాయి మండలం అల్లిగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు దళసభ్యుడు నల్లమారి అశోక్ హతమయ్యాడు. గంగారం అడవుల్లో ఏటూరునాగారం మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సుజాత హత్యాచారానికి గురైంది. 24గంటల్లోనే

### కుదిపేసిన చల్పాక ఎన్‌కౌంటర్, ఎస్సై హరీశ్ ఆత్మహత్య

ఈ కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో డిసెంబరు 22న ఓర్సు శ్రీను అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం పెట్టు కున్న ఆయన భార్య, ప్రియుడు మరో ఇద్దరితో కలిసి అతడిని హత్య చేసిన ట్లు పోలీసులు నిర్ధారించారు. వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్రం పేటలో సకినాల సరస్వతి అనే మహిళ హత్యకు గురైంది. ఆమెను కొడుకే గొంతునులిమి హత్య చేసినట్లు తేలింది. జనవరి 26న ములుగులోని ఎస్పీ కాలనీలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అంజిత్, విజయ్ అనే ఇరువురు దుర్మరణం చెందారు. జూలై 3న వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలో మావోయి స్టులు అమర్చిన మందుపాతర పేలి జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వెంకటాపురం మండలానికి చెందిన దర్రా సునీత అనే మహిళ కర్రెగుట్ట అటవీప్రాంతంలో ప్రెషర్ బాంబు పేలి తీవ్రంగా గాయపడింది.

### మరికొన్ని సంఘటనలు

కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో ఆర్టీసీ బస్సు కింద పడి లక్ష్మి అనే వృద్ధురాలు మృతిచెందింది. ఇదే మండలం కంతనపల్లిలో లంజపెల్లి రవి అనే వ్యక్తి ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి మరణించాడు. ఏటూరు గ్రామానికి చెందిన శిరీష అనే ఏడేళ్ల బాలిక కారు ఢీకొని మరణించింది. చిట్యాల గొత్తికోయగూడానికి చెందిన లక్ష్మయ్య అనే వ్యక్తి అడవిలో చెట్లను నరికివేసిన కేసులో పోలీసులు అరెస్టు చేస్తారని భయపడి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చింతగూడెం గ్రామానికి చెందిన గాదం రవీందర్ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గోవిందరావుపేట మండలంలో మద్దుల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కారు ఢీకొని మరణించాడు. తాడ్వాయి మండలంలో పోడును అడ్డుకున్నందుకు ఫారెస్టు అధికారులపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. జనగలంచ వద్ద లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 34 మంది ప్రయాణికులు గాయపడ్డారు. జనగలంచ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏటూరునాగారం మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్, ఆమె కొడుకు దుర్మరణం పాలయ్యారు. వెంకటాపూర్ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దాపూర్ వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో విద్యార్థులు వెంకటేశ్వర్‌రావు, మణిదీప్ మృతిచెందారు. రామప్ప ఆలయ పరిసరాల్లోని గొల్లాలగుడిని గుప్తనిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈఘటనకు పాల్పడిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ములుగు సమీపంలోని గట్టమ్మ దేవాలయం మలుపు వద్ద లారీ ఢీకొన్న సంఘటనలో ఎలక్ట్రీషియన్ వనం రాజు మరణించాడు. దేవగిరిపట్నంలో ట్రాక్టర్ తిరగబడి తేజావత్ హుస్సేన్ మృతిచెందాడు. ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వాజేడు మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణరాజు, ఆయన భార్య సత్యవతి, కూతురు అనిత, ఆటో డ్రైవర్ నాగరాజు దుర్మరణం చెందారు. తాడ్వాయి మండలం తక్కెళ్లగూడెం గొత్తికోయగూడెంలో మంగమ్మ అనే మహిళను అనుమానంతో భర్త గొంతునులిమి హత్య చేశాడు. జూలై 23న వాజేడు మండలం బొగత జలపాతంలో మునిగి జశ్వంత్ అనే యువకుడు మృతి చెందాడు. అక్టోబరు 31న వాజేడు మండలం కిష్టాపురంలో పిడుగుపాటుకు గురై యువకుడు మృతిచెందాడు. నవంబరు 1న ఏటూరునాగారం మండలం రామన్నగూడానికి చెందిన రైతు చెన్నూరి మల్లయ్య అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు.



తాడ్వాయి అడవిలో పులి పాద ముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు (ఫైల్)

### మావోయిస్టులపై పోలీసుల పైచేయి

ఛత్తీస్‌గఢ్- ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు కలిగిన ములుగు జిల్లా అడవులు నిత్యం పోలీసులు, మావోయిస్టుల చర్య, ప్రతిచర్యలతో అట్టుడికిపోతూనే ఉంటుంది. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణలోకి వలస వచ్చేక్రమంలో మావోయిస్టులకు జిల్లా పోలీసులు అడ్డుకట్ట వేశారు. ఏప్రిల్ 5న ఛత్తీస్‌గఢ్‌లోని ఊసూరు పీఎస్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో తెలంగాణ పోలీసులు ఈ ఎన్‌కౌంటర్‌కు పాల్పడి నట్టు మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. రెండు ఎన్‌కౌంటర్లలో 8 మంది మావోయిస్టులను కాల్చి చంపిన పోలీసులు పదిమందికి పైగా దళ సభ్యులు లొంగిపోయేలా చేశారు. తాడ్వాయి మండలం ఒడ్డుగూడెం అడవుల్లో మావోయిస్టులు దాచిన ఆయుధ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### వణికించిన పులుల సంచారం

ములుగు జిల్లాలోని అభయారణ్యం 800 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో కలిగి ఉంది. విభిన్న జంతుజాలానికి ఇది నిలయం. కొంతకాలంగా కనిపించని పులి ఈ ఏడాది సంచరించింది. సమీపంలోని పాకాల అడవుల నుంచి తప్పిపోయి వచ్చిన ఓ చిరుతపులి ములుగు మండలంలోని మదనపల్లి, రామచంద్రాపురం అడవుల్లో సంచరించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఓ పెద్దపులి వెంకటాపురం, మంగపేట, తాడ్వాయి అడవుల్లో 15 రోజులపాటు సంచరించింది. దీంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# పాత విద్యార్థులకు మళ్లీ పరీక్షలు!

- కేయూ ఇయర్ వైజ్ విద్యార్థులకు డిగ్రీ కల నెరవేర్చుకునే ప్రత్యేక అవకాశం
- 2016 కంటే ముందు వారికి నిర్వహణ




కేయూ క్యాంపస్ డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో పరిధిలో అప్పట్లెప్పుడో డిగ్రీ చదివారా.. మీరు డిగ్రీ చదివిన సందర్భంలో పరిస్థితులు అనుకూలించక ఫెయిల్ అయ్యారా? తర్వాత మళ్లీ పరీక్షలు రాసి పాసై డిగ్రీ సంపాదించుకుని ఉద్యోగం సాధించాలని పట్టుదలగా ఉన్నారా.. అయితే మీ కోసం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు మంచి అవకాశాన్ని కల్పించారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని డిగ్రీ కోర్సుల్లో ఇయర్ వైజ్ అభ్యర్థులకు డిగ్రీ కోర్సుల్లో తప్పిన సబ్జెక్టులకు ప్రత్యేక అనుమతులతో పరీక్షలు రాసే వెలుసుబాటును కల్పించారు. బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర డిగ్రీ కోర్సుల్లోని సబ్జెక్టులతో పాటు ప్రాక్టికల్స్, వైవా పరీక్షలకు సైతం ప్రత్యేక అనుమతి తీసుకుని తప్పిన సబ్జెక్టులకు మళ్లీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించొచ్చు.

### ఎవరెవరికి అవకాశం అంటే..

2016 సంవత్సరం కంటే ముందు ఇయర్ వైజ్ డిగ్రీ కోర్సులు చదివిన అభ్యర్థులందరికీ అవకాశం కల్పించారు. ఐతే వర్సిటీ ప్రత్యేక అనుమతి తీసుకుని పరీక్షలు రాయాలి. గతంలోనూ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు 2020- 2021, 2021- 2022 ఏడాదిలో ఇలాంటి అభ్యర్థులకు అవకాశం కల్పించారు. అప్పుడు చాలా మంది అభ్యర్థులు ప్రత్యేక అనుమతితో పరీక్షలు రాసి డిగ్రీ కలను నేరవేర్చుకున్నారు. అయితే కొందరూ అనివార్య కార ణాలతో పరీక్షలు రాయలేక, రాసిన ఉత్తీర్ణత సాధించలేక మిగి లిపోయారు. వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు లెక్కల ప్రకారం 2016 కంటే ముందు ఇయర్ వైజ్ డిగ్రీ కోర్సుల్లో సుమారు 30 - 40 మంది డిగ్రీ కోర్సుల్లో కొన్ని సబ్జెక్టుల్లో తప్పి డిగ్రీ పట్టాను అందుకోలేకపోయినట్లు లెక్కలున్నాయి. వీరికి ప్పుడూ ప్రత్యేక అనుమతితో మళ్లీ పరీక్షలు నిర్వహిస్తే కష్టపడి చదువుకుని ఉత్తీర్ణత పొందే అవకాశం ఉంది. 2016 ఏడాది నుంచి యూజీసీ నియమ నిబంధనల మేరకు డిగ్రీ కోర్సుల్లో దేశ వ్యాప్తంగా సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. సెమిస్టర్ విధానంలో విద్యార్థులకు డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు హాజ రయ్యే అవకాశం ఉంది. అయితే డిగ్రీ ఇయర్‌వైజ్ విద్యార్థులకు ఇప్పుడున్న సెమిస్టర్ విధానంతో ఇబ్బందుల్లో పడ్డారు. ఆ ఇబ్బం దులను తొలగించి వారి డిగ్రీ పట్టాకలను నేరవేర్చేందుకు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

### అనుమతి కోసం దరఖాస్తులు ఎలా చేయాలి?

డిగ్రీ ఇయర్‌వైజ్ విద్యార్థులందరూ మొద టగా వర్సిటీ క్యాంపస్ పరిపాలన భవనం లోని అకాడమిక్ బ్రాంచ్‌లో సంప్రదించాలి. వారు ఏ ఏడాది ఏ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారో.. వర్సిటీ అధికారులకు తెలియజేస్తూ దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు వారి డిగ్రీ మెమోను జత చేయాలి.

వర్సిటీ అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తారు. దీనికి గాను వర్సిటీకి ఒక్కో పేపర్‌కు రూ. 3 వేల చొప్పున ప్రాసెసింగ్ ఫీజుతో పాటు అదనంగా మళ్లీ పరీక్షల ఫీజు ఒక్కో పేపర్‌కు రూ. 4 వేలు అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే దివ్యాంగ విద్యార్థులకు అకాడమిక్ బ్రాంచ్‌లో చెల్లించాల్సిన ఫీజులు ఉండవు. పరీక్షల ఫీజు మాత్రం ఒక్కో సబ్జెక్టుకు రూ. 500లు చెల్లించాలి. ఫీజులు చెల్లించుకున్న అభ్యర్థులందరికీ వర్సిటీ రిజిస్ట్రార్ అర్డర్ మేరకు వారు చదివిన కళాశాలల్లో పరీక్షల ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉంది.

### ఫీజులు కళాశాలల్లోనే చెల్లించుకోవాలి

వర్సిటీ అకాడమిక్ బ్రాంచ్‌లో దరఖాస్తులు చేసుకున్న తర్వాత రిజిస్ట్రార్ పేరుతో అభ్యర్థులకు అర్డర్‌ను వెలువరిస్తారు. ఆయా అర్డర్ మేరకు విద్యార్థులు వారు చదివిన కళాశాలల్లో ఒక్కో పేపర్‌కు పరీక్షలు ఫీజులు చెల్లించుకోవాలి.

### అభ్యర్థులకు సిలబస్‌ను ముందే చెబుతారు..

ప్రత్యేక అనుమతితో ఇయర్ వైజ్ స్కీంలో దరఖాస్తులు చేసుకుని పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులందరికీ వారి సబ్జెక్టు వైజ్‌గా ముందుగానే ఆయా పరీక్షల సెలబస్‌ను వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు చెబుతారు.

ఉదాహరణకు 2001-2023 ఏడాదిలో డిగ్రీ చదివిన అభ్యర్థులకు వారు చదివిన ఏడాదిలో వర్సిటీలో అమల్లో ఉన్న సెలబస్‌తోనే పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తారు. అయితే కొన్ని సబ్జెక్టులు అవుట్ డేడ్ అవుతాయి. అవుట్ డేడ్ అయిన సబ్జెక్టులకు వర్సిటీలోని అయా విభాగాల పాఠ్య ప్రణాళిక విభాగం వారిచ్చే సరిసమానమైన సబ్జెక్టు పేపర్‌లో పరీక్షలకు అనుమతిస్తారు. సిలబస్ దాదాపుగా సరిపోయే విధంగా విద్యార్థులకు న్యాయంగా ఉండేది నిర్ణయిస్తారు. పరీక్షల ఫీజులు చెల్లించే సమయంలోనే ఆయా సబ్జెక్టుల వివరాలను అభ్యర్థులకు స్పష్టంగా వర్సిటీ ఉన్నతాధికారులు చెబుతారు.

### ఫీజుల షెడ్యూల్ ఇలా

2025 జనవరి 31 వరకు వర్సిటీ అకాడమిక్ బ్రాంచ్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రార్‌కు ప్రత్యేక అనుమతి కోసం దరఖాస్తులు సమర్పిం చుకోవాలి. తర్వాత 2025 ఫిబ్రవరి 1 వరకు సంబంధిత కళాశాలలో పరీక్షల ఫీజులు చెల్లించుకోవాలి. అప్పట్లో అభ్యర్థులు చదివిన కళాశా లలు అనివార్య కారణాలతో ఇప్పుడు మూసి వేస్తే ఆయా కళాశాలల అభ్యర్థులు నేరుగా వర్సిటీలోనే పరీక్షల ఫీజులు చెల్లించుకుని పరీక్షలకు హాజరైయ్యే అవకాశం ఉంది.

### వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌లో పరీక్షా కేంద్రాలు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇయర్‌వైజ్ స్కీంలో పరీక్షలకు హాజరైయ్యే అభ్యర్థులకు పరీక్షలు నిర్వ హిస్తారు. అన్ని సబ్జెక్టులకు ప్రత్యేకంగా పరీక్షల టైం టేబుల్‌ను ప్రకటిస్తారు. పరీక్షలు ఫీజుల షెడ్యూల్ గడువు ముగిసిన తర్వాత పరీక్షల ప్రాసెస్‌ను కొనసాగించి పరీక్షలు టైం టేబుల్ షెడ్యూల్‌ను వెల్లడించారు.

### పాత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

వర్సిటీ పరిధిలోని ఇయర్‌వైజ్ స్కీంను పాత విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలి. మూడేళ్ళు ఎంతో కష్టపడి రెగ్యులర్‌గా డిగ్రీ కోర్సులు అభ్యసించి అఖరుగా అప్పట్లో పరీక్షలు రాసే సమయంలో అనివార్య కారణాలతో విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేకపోవచ్చు. అలాగే ఇతర కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతోనూ పరీక్షలు తప్పవచ్చు. కొందరూ విద్యార్థులకు ఆరోగ్యం సహకరించకపోవచ్చు. అన్ని పరీక్షల సబ్జెక్టులు ఉత్తీర్ణత సాధించి ప్రాక్టికల్స్, వైవా పరీక్షల్లోనూ ఫెయిల్ కావచ్చు. వారందరూ ఇప్పుడూ మళ్లీ పరీక్షలు రాయేచ్చు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిల ఇతర అధికారుల అనుమతితో పరీక్షలు నిర్వహిస్తున్నాం. పాత విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ప్రొఫెసర్ కట్ల రాజేందర్, పరీక్షల నియంత్రణాధికారి, కేయూ

## బొంగులో కల్లు.. భలే..



బొంగులో చికెన్, బిర్యానీలను చూశాం. తాజాగా 'బొంగులో కల్లు'ను కూడా విక్రయిస్తున్నారు. తాటిచెట్లకు లొట్ల స్థానంలో వెదురుబొంగులు కట్టి.. వచ్చిన కల్లును విక్రయిస్తున్నారు. సాధారణకల్లు కంటే ఈ బొంగులో కల్లు రుచిగా కూడా ఉంటోందని కల్లు ప్రియులు చెబుతున్నారు. ఇక ఈ కల్లుకు గిరాకీ ఉంటుండంతో గీతవృత్తి దారులు కూడా బొంగులో కల్లునే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం ప్రాజెక్టునగర్ సమీపంలోని తాటిచెట్లకు ఇదిలో ఇలా లొట్టిస్థానంలో బొంగులను కట్టారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి', భూపాలపల్లి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## కూచిపూడిలో వరంగల్ కళాకారుల హవా



కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న వరంగల్ నృత్య కళాకారులు

హనుమకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కూచిపూడి గ్రామంలో జరుగుతున్న పతాక స్వర్ణోత్సవాల్లో వరంగల్ కళాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్నారు. అద్భుతమైన తమ నాట్య ప్రదర్శనలతో ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. నృత్యాభిమానుల ప్రశంసలను అందుకుంటున్నారు. కూచిపూడిలో ఈనెల 27న కూడి పతాక స్వర్ణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయి. శుక్ర, శనివారాల్లో జరిగిన నృత్యోత్సవ ప్రదర్శనల్లో వరంగల్ నృత్య కళాకారులు పాల్గొన్నారు. ప్రముఖ గురువు బొంపెల్లి సుధీర్‌రావు శిష్య బృందం జయ జయ దుర్గే అనే నారాయణ తీర్థుల తరంగాన్ని ప్రదర్శించారు. వేదాంతం రాఘవయ్య వేదాంతం వెంకట చలపతి, కూచిపూడి నాట్యాచారిణి డాక్టర్ వనజ ఉదయ్ వీరి ప్రదర్శనను తిలకించి ప్రశంసలు కురిపించారు.

## కుష్టు వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాల పంపిణీ

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 10వ డివిజన్ ఆనంద్‌నగర్ లెప్రసీ కాలనీలోని కుష్టువ్యాధిగ్రస్తుల కుటుంబాలకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గ్రేస్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు జాకోబ్ మాట్లాడుతూ.. ఆనంద్‌నగర్ కాలనీలోని కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లను, బట్టలు, పండ్లు, బియ్యం దాదాపు 50 కుటుంబాలకు అందించారు.

## అభివృద్ధి పాట సీడీని ఆవిష్కరించిన నాయిని



సీడీని ఆవిష్కరిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గాయకుడు పారనంది రమేశ్, గద్దర సాంబన్న నేతృత్వంలోని 'అభివృద్ధి పాట' పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. శనివారం హనుమకొండలోని ప్రజాభవన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. టీపీసీసీ నాయకుడు బత్తిని శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ అబూబాకర్ ఆధ్వర్యంలో సీడీ రూపకల్పన జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు ఈవీ శ్రీనివాస్‌తో పాటు బర్ల యాకుబ్, గాజుల గోవర్ధన్, ఎంవీ రాజు, దేవేందర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడొద్దు



విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఫణి

హనుమకొండటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, గుట్కా మత్తు పదార్థాల బారిన పడొద్దని సుబేదారి ఎస్సై ఫణి అన్నారు. శనివారం హనుమకొండ సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని శాయంపేట జాగీర్ లోకల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఫణి మాట్లాడుతూ.. గంజాయి విక్రయాలు జరిగినా 8712584473 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీటీమ్స్, సైబర్ క్రైం, సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930పై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసు కళాబృందం ద్వారా పలు చట్టాలపై పాటలతో విద్యార్థులను చైతన్యపర్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌టీఏ కార్యాలయంలో సర్వర్ మొరాయింపు



క్యూలైన్‌లో పడిగాపులు కాస్తున్న వాహనదారులు

వరంగల్ క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఆర్‌టీఏ కార్యాలయంలోశనివారం సర్వర్ మొరాయించడంతో వినియోగదారుల సేవల్లో జాప్యం జరిగింది. క్రిస్మస్, బాక్సింగ్ డే, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో వాహనదారుల తాకిడి పెరిగింది. వావాహనదారులకు తాకిడికి సర్వర్ స్తంభించడంతో క్యూలైన్‌లో పడిగాపులు కాశారు. కాగా, జాప్యం కారణంగా సాయంత్రం వరకు అధికారులు అందుబాటులో ఉండి సేవలందించినట్లు ఒకరిద్దరు వాహనదారులు వెల్లడించారు.

## ఘనంగా నేరెళ్ల వేణుమాధవ్ జయంతి



నేరెళ్ల వేణుమాధవ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఆర్ఎస్ నేత పులి రజినీకాంత్ తదితరులు

వడ్డెపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిమిక్రీ స్మామాట్ పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ జన్మదిన వేడుకలను హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో గల ఆయన విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేరెళ్ల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రజినీకాంత్ మాట్లాడుతూ.. మిమిక్రీ కళకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన మహనీయుడు డాక్టర్ వేణుమాధవ్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సల్వాజీ రవీందర్‌రావు, పోగుల రమేష్, ఖలీల్, బైరిపాక ప్రశాంత్, ముటికె రాజు, మహేష్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, గౌసొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# వీనుల విందుగా స్వరార్చన

- మిమిక్రీ శ్రీనివాస్‌కు నేరెళ్ల పురస్కారం
- వేణుమాధవ్‌ని కళాసేవ నిత్యనూతనం
- ప్రముఖుల కితాబు



వేణుమాధవ్ పురస్కారాన్ని అందుకుంటున్న మిమిక్రీ శ్రీనివాస్, పాల్గొన్న అంపశయ్య నవీన్

వడ్డెపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో శనివారంరాత్రి వీనుల విందుగా స్వరార్చన పేరిట పలువురి మిమిక్రీ కళాకారుల ప్రదర్శనలు అంబరాన్నంటాయి. ఓరుగల్లు ముద్దుబిడ్డ ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళ ఆద్యుడు నేరెళ్ల వేణుమాధవ్ జయంతి వేడుకలు ఆయన శిష్యుల సమక్షంలో నేత్రపర్వంగా జరిగాయి. అనేకమంది హాజరై ఆహూతుల సమక్షంలో జనార్ధన్, జీవీఎస్ రాజు, రోహిత్ కుమార్, దామోదర్, కనకం భరత్, పొన్నం రాణా ప్రతాప్, బత్తులనిశిత, లోకేష్, మిమిక్రీ శంకర్, డాక్టర్ ఇందిర తదితరులు అద్భుత మిమిక్రీ ప్రదర్శనలు ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కళా గురువు వేణుమాధవ్ చలువవల్ల కళారంగంలో రాణిస్తూ తమ జీవన ఉపాధికి కళనే ఆలంబనగా చేసుకొని జీవితాన్ని గడుపుతున్నామని అన్నారు.

### శ్రీనివాస్‌కు పురస్కార ప్రదానం

నేరెళ్ల వేణుమాధవ్ జయంతి సందర్భంగా ప్రతీఏటా ఏదో ఒక రంగంలో ప్రముఖులను ఎంపిక చేసుకొని ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి మిమిక్రీ కళ నుంచి నేరెళ్ల వేణుమాధవ్ ప్రియశిష్యుడైన గోమటం చింతపట్ల శ్రీనివాస్‌కు నేరెళ్ల వేణుమాధవ్ కల్చరల్ ట్రస్టు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా రూ.15వేల నగదు, శాలువాతో కళా ట్రస్టు పక్షాన శ్రీనివాస్‌కు నేరెళ్ల సతీమణి నేరెళ్ల శోభారాణి, నేరెళ్ల రాధాకృష్ణ, డాక్టర్ అంపశయ్య నవీన్, పొట్లపల్లి శ్రీనివాస్, రామా చంద్రమౌళి, కొణతం కృష్ణ, గిరిజ మనోహర్‌బాబు, వనం లక్ష్మికాంతరావు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మైమ్ కళాకారుడు బలగం ఫేం అర్షం మధుసూదన్ మాట్లాడుతూ.. వేణుమాధవ్ ద్వారా కళా రంగంలో ఓరుగల్లు ఖ్యాతి ఖండాంతరాలకు వ్యాపించిందని అన్నారు. సర్వ కళల సమాహారమే మిమిక్రీగా పేర్కొంటూ తన కళను వేలాది శిష్యగణానికి అందజేసిన చరితార్థజీవి వేణుమాధవ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల రాధాకృష్ణ, వీవీ మదన్‌మోహన్, అనేక మంది మిమిక్రీ కళాకారులు పాల్గొన్నారు.

## మహిళా కానిస్టేబుల్‌పై సీఐ చిందులు

వరంగల్ క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పరకాల పోలీస్ డివిజన్‌లో పనిచేసే ఓ ఠాణా సీఐ కొత్తగా వచ్చిన మహిళా కానిస్టేబుల్‌పై చిందులు వేసినట్లుగా తెలుస్తోంది. రిసెప్షన్‌లో విధులు నిర్వర్తించే సదరు మహిళా కానిస్టేబుల్‌పై తన నోటిదురుసు చూపించడంతో మనస్తాపం చెందిన కానిస్టేబుల్.. తోటి సిబ్బంది వద్ద కన్నీటిపర్యంతమైనట్లుగా సమాచారం. అయితే ఆ సీఐ ఎక్కడ విధులు నిర్వర్తించినా సిబ్బందిపై నోరు పారేసుకుంటూ అవమానపరుస్తుంటాడని పోలీసు శాఖలో చర్చించుకుంటున్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

- కూతురికి సైతం పురుగుల మందు తాగించిన వైనం

నల్లబెల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఓ వివాహిత పురుగుల మందు తాగి, తన రెండేళ్ల కుమార్తెకు తాగించిన ఘటన మండలంలోని రుద్రగూడెంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పిండి శ్రీనుకు ఇద్దరు భార్యలు. రెండో భార్య మానసతో కలిసి శ్రీను వ్యవసాయ చేనులో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మానసకు తన తల్లిదండ్రులు ఫోన్‌చేయడంతో పని మధ్యలో ఆపివేసి ఫోన్ మాట్లాడుకుంటూ ఉంది. దీంతో కోపం వచ్చిన శ్రీను.. మానసను దూషించడంతో తట్టుకోలేక మానస ఫోన్ అక్కడపెట్టి తన కుమార్తెను తీసుకొని పంట చేను చివరికి వెళ్లింది. అదే కోపంలో అక్కడే ఉన్న పురుగుల మందును తీసుకొని వేగంగా తాగింది. ఆమెతాగడమే కాకుండా తన కుమార్తెకు కూడా తాగించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మానస పరిస్థితి విషమంగా ఉందని, ఆమె కుమార్తె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్దన్ తెలిపారు.

## ట్రాఫిక్ సమస్యపై పోలీసుల కసరత్తు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హసన్‌పర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తిలో ట్రాఫిక్ సమస్యపై ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు స్పందించారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 25న 'ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమేది' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కాగా, హసన్‌పర్తి పోలీసులు అప్రమత్తమయ్యారు. మూడు రోజులుగా హసన్‌పర్తి బస్టాండు, జంక్షన్‌తో పాటు రద్దీ ప్రదేశాలలో రోడ్డుకు ఇరువైపులా ఇష్టారాజ్యంగా కూరగాయల విక్రయాలు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న విక్రయదారులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే ఇరుకైన ప్రదేశాలలో కూరగాయల విక్రయాలు నిర్వహించరాదని విక్రయదారులకు సూచించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్న పోలీసుల పనితీరును స్థానికులు అభినందిస్తున్నారు.



ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న పోలీసులు

# శ్మశానవాటికలో అస్థికల అపహరణ

- భీమారంలో పట్టుకున్న స్థానికులు

హసన్‌పర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం శ్మశానవాటికలో కొంత కాలంగా దహన సంస్కారాల అనంతరం గుర్తుతెలియని వ్యక్తులు మృతుల అస్థికలను అపహరించుకు వెళ్తుండడంపై స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అస్థికలను శ్మశాన వాటిక నుంచి అపహరించుకొని పోయి చేతబడులకు వినియోగిస్తున్నారేమోనన్న భయం మృతుల కుటుంబ సభ్యుల్లో కొంతకాలంగా నెలకొని ఉంది. ఈ క్రమంలోనే వారం కిందట గ్రామానికి చెందిన కొక్కొండ నాగేశ్వర్‌రావు, సంగెనబోయిన ఐలయ్యలు మృతిచెందడంతో భీమారం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి శ్మశానవాటికలోని అస్థికలను తన సంచిలో వేసుకొని వెళ్లడం గమనించిన స్థానికులు.. అతడిని పట్టుకొని నిలదీశారు.



అస్థికల దొంగ

అస్థికలతో ఏం చేస్తారని ప్రశ్నించారు. తనది వరంగల్ ప్రాంతమని, అంత్యక్రియలకు ముందు మృతదేహం నోటిలో పెట్టే బంగారం సేకరించి దానితో వచ్చే ఆదాయంతో జీవిస్తానని చెప్పినట్లు స్థానికులు తెలిపారు. దీంతో స్థానికులు అతడు సేకరించిన అస్థికలను స్వాధీనం చేసుకొని శ్మశాన వాటికలో వేయించారు. ఇదిలా ఉండగా, ఆ వ్యక్తి సేకరించిన అస్థికలు ఇటీవల మరణించిన ఇద్దరు వ్యక్తులవి కావడంతో ఆ అస్థికలు ఎవరివనేది అయోమయానికి దారి తీసింది. దీంతో తమ వారి అస్థికలు ఎలా గంగలో కలపాలో తెలియక మృతుల కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.

## అజంజాహి మిల్లు సమస్యను టేబుల్ ఎజెండాగా చేర్చాలి

- కమిషనర్, మేయర్‌లకు వినతిపత్రం అందజేత

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న బల్దియా కార్యాయంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో అజంజాహి మిల్లు భూమి సమస్యను టేబుల్ ఎజెండాగా పెట్టాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్, కమిషనర్‌ను కోరారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. మేయర్, కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, రిజ్వాన, మధు, మారెపల్లి రవి, దిడ్డి కుమారస్వామి, సోదా కిరణ్, నర్సింగ్‌లు ఉన్నారు.

### మేయర్‌ను కలిసి హార్టికల్చర్ అధికారి

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో ఉద్యానవన శాఖ (హార్టికల్చర్) అధికారిగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మారెడ్డి శనివారం మేయర్ సుధారాణిని కలిసి పూలమొక్కను అందించారు. మేయర్‌ను కలిసిన వారిలో బల్దియా చీఫ్ హార్టికల్చర్ అధికారి పలాస రమేష్ ఉన్నారు. కాగా, లక్ష్మారెడ్డిని కాశిబుగ్గ సర్కిల్‌కు, రమేష్‌ను కాజీపేట సర్కిల్‌కు ఇన్‌చార్జిలుగా నియమించారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి బల్దియాకు మంచిపేరు తీసుకురావాలని అధికారులను మేయర్ ఆదేశించారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్లు

# నాటక సమాజానికి జీవం పోయాలి

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

హసన్‌పర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాలానుగుణంగా మారుతున్న సమాజంలో అంతరించి పోతున్న నాటక సమాజానికి తిరిగి జీవం పోయాల్సిన అవసరం ఉందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. భీమారం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు నాలుగు రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం రెండో రోజు రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం సభాధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, బండారి మొగిళయ్య, శ్రీరామోజు సుందరమూర్తి, రాధారపు సంజీవరెడ్డి, మారేడోజు సదానందచారి, బీటవరం శ్రీధరస్వామి, హనుమకొండ జిల్లా నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ ఓడపల్లి చక్రపాణిలు జ్యోతి ప్రజ్వలన చేసి నాటకోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా గురువు పరాంకుశం దయాకర్ సంస్థ కార్యవర్గం ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళా పరిషత్ వరంగల్ వారు డాక్టర్ జంధ్యాల సుబ్బలక్ష్మీ రచనలో దేవరాజు రవీందర్‌రావు దర్శకత్వంలో సురభి కొండలరావు హార్మోనియం సహకారంతో చేసిన విజయానిరుద్ధం పౌరాణిక పద్యనాటకం ప్రదర్శన స్థానికుల కళ్లకు రక్తి కట్టించింది. ఈ కార్యక్రమంలో సురభి రమాలక్ష్మి, శైలజ, గూడూరు బాలాజీ, మాడిశెట్టి రమేష్, సీతవెంకటేశ్వర్లు, వనపర్తి ప్రసాద్, జూలూరి నాగరాజు, చెన్నబోయిన రామదాసు, లక్ష్మణమూర్తి, పెద్దపల్లిమధు, ముంద్రాతి రవీందర్, నరేందర్, స్థానిక నాయకులు కవులు, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.



యోగా గురువు పరాంకుశంను సన్మానిస్తున్న నాటకోత్సవ కమిటీ

## నేడు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశం

బాలసముద్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కాకాజీ కాలనీలోని ఎస్ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం హనుమకొండ జిల్లా శాఖ సమావేశం, నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించనున్నట్లు జిల్లా సంఘం అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇంకా ప్రత్యేక ఆహ్వానితులుగా హనుమకొండ అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు అన్వర్ హుస్సేన్, వై.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



బాధిత కుటంబానికి బియ్యం అందజేస్తున్న రావు పద్మ, సంద్ర మధు

రాంనగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్సీ మోర్చా 7వ డివిజన్ అధ్యక్షుడు కంజర్ల రాజేశ్ తండ్రి లింగం ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు శనివారం పరామర్శించి 50 కిలోల బియ్యంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసాద్, 34వ డివిజన్ బూత్ అధ్యక్షుడు ప్రశాంత్, వినీత్, కనుకయ్య, సునిత, భాగ్య, కురుణమ్మ, లక్ష్మీ, రాకేశ్, డెవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లాపూర్ ఇండస్ట్రియల్ పరిధిలో నేడు విద్యుత్ బంద్

హసన్‌పర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ ఇండస్ట్రియల్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీ అశోక్ తెలిపారు. వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్‌ను అందిచేందుకు పలు చోట్ల మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

## శ్రీనివాస్‌కు డాక్టరేట్

హసన్‌పర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మణుగూరు తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో లెచ్చరర్‌గా పనిచేస్తున్న బి.శ్రీనివాస్‌కి డాక్టరేట్ లభించింది. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 2006లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో బిటెక్ పూర్తిచేసిన బి.శ్రీనివాస్ చెన్నైలోని బారత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో రీసెర్చ్ స్కాలర్‌గా తన పరిశోధనను పూర్తి చేశారు. 2010లో హైదరాబాద్ జేఎన్‌టీయూలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ పూర్తి చేశారు. డాక్టర్ సెల్వప్రియ మార్గదర్శకత్వంలో 'ఆప్టిమైజ్డ్ డీప్ లెర్నింగ్ ఆర్కిటెక్చర్ ఫర్ ఎర్లీ స్టేజ్ క్యాన్సర్ డిటెక్షన్ ఇన్ బ్రెస్ట్ ఇమేజెస్' అనే శీర్షికతో పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు భారత్ యూనివర్సిటీ చెన్నై పీహెచ్‌డీ ప్రకటించింది. ఈ సందర్భగా డాక్టరేట్ పొందిన శ్రీనివాస్‌ను కిట్స్ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పింగిళి రమేష్‌రెడ్డి, పీఆర్‌వో డాక్టర్ ప్రభాకరాచారి, అధ్యాపక సిబ్బంది, మణుగూరు డిగ్రీ కళాశాల సిబ్బంది అభినందించారు.



పీహెచ్‌డీ పట్టాను అందజేస్తున్న విభాగాధిపతి సెల్వప్రియ

## రైల్వే యార్డులో మాక్ డ్రిల్

గిర్మాజిపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్‌లో శనివారం సాయంత్రం ఆర్‌పీఎఫ్ సీఐ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే స్టేషన్లలో, రైళ్లలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు, రైళ్లు పట్టాలు తప్పినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రైలు బోగీలు పట్టాలు తప్పినప్పుడు ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవాలి.. అగ్ని ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రికి ఎలా తరలించాలి.. బోగీల్లో ఉన్నవారిని ఎలా రక్షించాలి.. అనే విషయాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. స్పృహ తప్పిన ప్రయాణికులకు సీపీఆర్ ఎలా చేయాలో ప్రత్యక్షంగా చూపించారు. సుమారు అరగంట పాటు నిర్వహించిన మాక్ డ్రిల్ ప్రయాణికులను ఆకట్టుకుంది.

# ఆకతాయిలకు అడ్డాగా ప్రధాన కూడళ్లు

- మహిళలతో అసభ్యకర ప్రవర్తన
- లేడీస్ హాస్టళ్ల వద్ద ఆకతాయిల చక్కర్లు

హనుమకొండ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ నగరంలో ఆకతాయిలకు అడ్డాగా ప్రధాన కూడళ్లుగా మారాయి. మహిళలు, విద్యార్థినులు ఉండే ప్రదేశాల్లో కొంత మంది మద్యం సేవించి మహిళలు నడిచి వెళ్లే కూడళ్ల వద్ద కాపుకాస్తున్నారు. కొంతమంది ఆకతాయిలు ప్రధాన కూడళ్ల వద్ద మద్యం సేవించి ప్రైవేటు లేడీస్ హాస్టళ్ల చుట్టూ సంచరిస్తూ విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇంటర్, డిగ్రీ చదువుకునే విద్యార్థినులు ఆకతాయిల వేధింపులు తాళలేక, ఇంట్లో చెప్పుకోలేక మనోవేదనకు గురవుతున్నట్లు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఉపయోగం ఉండడం లేదని వాపోతున్నారు.

### సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో..

బాలసముద్రం, న్యూశాయంపేట, అడ్వకేట్స్ కాలనీ, అంబేద్కర్ నగర్, బస్టాండ్ కూడళ్లు, బాలసముద్రంలోని ఏకశిలపార్కు, చిల్డ్రన్స్ పార్కు, వడ్డెపల్లిలోని వడ్డెపల్లి చెరువు కట్ట పరిధిలో ఒంటరిగా మహిళలు కనిపిస్తే బనాయిస్తూ సూటిపోటి మాటలతో వేధిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా యువతులను టార్గెట్ చేసి ప్రేమ పేరుతో వెంటపడి అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పలువురు విద్యార్థినులు వారి తల్లిదండ్రులకు చెబుతున్నట్లు తెలిసింది. ఆకతాయిలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇరు వర్గాలను పిలిచి మందలించి పంపించడంతో ఆకతాయిల ఆగడాలను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

### భయబ్రాంతులకు గురవుతున్న మహిళలు

సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో కొంత మంది యువకులు మద్యం, గంజాయి సేవించిన మైకంలో విద్యార్థినులు ఉండే హాస్టళ్ల వద్దకు వెళ్లి నానా హంగామా చేశారు. బైక్‌లపై రావాలని ఒత్తిడి చేస్తున్నట్లు తోటి విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థినులను, మహిళలను



వేధింపులకు గురిచేస్తున్న ఆకతాయిలపై పోలీసులు గుర్తించి చర్యలు చేపట్టాలని విద్యార్థినులు, మహిళలు కోరుతున్నారు.

### రాత్రివేళల్లో భయం భయం

మహిళలు వివిధ అవసరాల కోసం ఒంటరిగా రాత్రివేళల్లో బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. రాత్రివేళల్లో బైక్‌లపై సంచారం చేస్తున్న యువకులను గుర్తించి పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



**2024లో** ప్రపంచవ్యాప్తంగా గూగుల్‌లో నెటిజెన్స్ వెతికిన నటీనటులు ఎవరు? వారిలో మన దేశానికి చెందిన వారెవరైనా ఉన్నారా? ఈ ప్రశ్నలకు సమాధానం మీకు తెలుసా? షారూక్.. సల్మాన్.. అల్లు అర్జున్.. ఇలా రకరకాల పేర్లు మీ మనసులో మెదులుతున్నాయి కదా.. కానీ వీరెవరూ కాదు. ఈ ఏడాది గూగుల్ జాబితాలో పవన్ కళ్యాణ్ రెండో స్థానంలో.. హీనాఖాన్ ఐదో స్థానంలో.. నిమ్రత్ కౌర్ ఎనిమిదో స్థానంలో ఉన్నారు. పవన్ కళ్యాణ్ గురించి తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హీనాఖాన్ గతంలో "యేరిస్తా క్యా ఖేల్‌తా హై", "కసూతి జిందగీ కే" మొదలైన సీరియల్స్‌లో నటించింది. తనకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చిందని ప్రకటించిన వెంటనే ఆమె గురించి తెలుసుకోవటానికి నెటిజెన్స్ గూగుల్‌లో సెర్చ్ చేయటం మొదలుపెట్టారు. ఇక నిమ్రత్ కౌర్ బాలీవుడ్‌లో సుప్రసిద్ధ నటి. లంచ్‌బాక్స్, దస్‌వీ, ఎయిర్‌లిఫ్ట్ వంటి సినిమాలలో ఆమె నటించారు. ఆమె అభిషేక్ బచ్చన్‌ను పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వచ్చిన వెంటనే ఆమెకు విపరీతమైన పాపులారిటీ వచ్చింది.






## అవార్డులు

**70వ** జాతీయ పురస్కారాలు టాలీవుడ్‌కు నిరాశ మిగిల్చాయి. ఉత్తమ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' ఎంపికైంది. తమిళ చిత్రం 'తిరు చిత్రంబలం'కు గాను నిత్యామీనన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా జానీ మాస్టర్ ఎంపికైనా ఫోక్సో కేసు నేపథ్యంలో పురస్కారాన్ని కేంద్రం వెనక్కుతీసుకుంది. సినీ పరిశ్రమకు చేసిన కృషికి గుర్తింపుగా చిరంజీవి పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు.

**ఎప్పుడూ విజయాలు అపజయాలను మాత్రమే లెక్క వేసుకునే టాలీవుడ్ చిత్రపరిశ్రమను ఈ ఏడాది పలు వివాదాలు చుట్టుముట్టాయి. సంక్రాంతి హిట్లతో జోరుగా మొదలైన ప్రయాణం అదే ఊపులో కొనసాగింది. అయితే ఒకదాని వెంట ఒకటిగా వచ్చిపడిన వివాదాలతోనే టాలీవుడ్ ప్రముఖంగా వార్తల్లో నిలిచింది. మొత్తానికి 2024 వివాదాలతో గుర్తుండిపోతుందనేది సినీ విశ్లేషకుల మాట.**



# 2024 విజయాలతో మొదలై వివాదాలతో ముగిసి...

### గూగుల్ సెర్చ్‌లో రెండో స్థానం!

## పవన్ గురించి వెతికేసారు...

మొదటి పది స్థానాల్లో ఉన్న నటులు వీరే

1) కాట్ విలియమ్స్ (అమెరికన్ కమెడియన్)
2) పవన్ కళ్యాణ్
3) ఆడమ్ బ్రాడీ (అమెరికన్ నటుడు)
4) ఎల్లా పుర్‌నిల్ (బ్రిటన్‌కు చెందిన నటి)
5) హీనా ఖాన్
6) కిరెన్ కుల్కిన్ (అమెరికన్ నటుడు)
7) టెర్రెన్స్ హవార్డ్ (అమెరికన్ నటుడు)
8) నిమ్రత్ కౌర్
9) సుటన్ ఫాస్టర్ (అమెరికన్ నటుడు)
10) బ్రిగెట్టి బోజో (వెనిజువెలా నటి)

## ఈ తారల సందడి లేదు



ఈ ఏడాది తెలుగులో కొందరు అగ్రహీరోయిన్‌ల సందడి అసలు కనిపించలేదు. వారు నటించిన ఒక్క చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాలేదు. గతేడాది సమంత నటించిన 'శాకుంతలం', 'ఖుషి' చిత్రాలు విడుదలయ్యాయి. అవి రెండూ కూడా సమంతకు నిరాశనే మిగిల్చాయి. ఇక ఈ ఏడాది ఆమె నటించిన చిత్రం ఒక్కటి కూడా విడుదలవ్వలేదు. 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని ప్రకటించినా అది ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. అయితే సమంత 'సిటాడెల్: హనీబన్నీ' వెబ్‌సిరీస్ ద్వారా అభిమానులను ఎంటర్‌టైన్ చేశారు.

మరో అగ్రకథానాయిక అనుష్క శెట్టి కూడా ఈ ఏడాది పెద్దతెరపై కనిపించలేదు. మూడేళ్ల విరామం తర్వాత 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో గతేడాది టాలీవుడ్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చిన అనుష్కశెట్టి మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. అయితే అదే ఊపును ఆమె ఈ ఏడాది కొనసాగించలేకపోయారు. ఆమె నటించిన సినిమాలేవి 2024లో విడుదలవ్వలేదు. ఆ లోటు తీర్చేలా కొత్త ఏడాదిలో 'ఘాటీ, కథనార్' చిత్రాలతో ఆమె ప్రేక్షకులను అలరించనున్నారు. మరో సీనియర్ హీరోయిన్ త్రిష కూడా ఈ ఏడాది తెలుగు సినిమాల్లో కనిపించలేదు. చిరంజీవి సరసన నటించిన 'విశ్వంభర' విడుదల చివర్లో వాయిదాపడడంతో ఆమె ఎంట్రీ మిస్సయ్యింది. విజయ్ నటించిన 'గోట్' చిత్రంతో త్రిష ప్రత్యేక గీతంలో కనిపించారు. ఈ ఏడాది ధనుష్‌తో వివాదంతో వార్తల్లో నిలిచిన నయనతార కూడా తెలుగులో స్ట్రెయిట్ చిత్రం చేయలేదు. ఆమె జీవితం ఆధారంగా తెరకెక్కిన 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' ఓటీటీలో స్ట్రీమింగ్ అయింది. టాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా తిరుగులేని ఆధిపత్యాన్ని చలాయించిన పూజాహెగ్డేకు వరుస అపజయాలు షాక్ ఇచ్చాయి. 'రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య' చిత్రాలు వరుసగా డిజాస్టర్ అవ్వడంతో ఆమె టాలీవుడ్‌కు దూరమయ్యారు. ప్రస్తుతం ఆమె హిందీలో నటిస్తున్న 'దేవా, హై జవానీ తో ఇష్క్ హోనా హై', తమిళంలో సూర్య, విజయ్ సరసన నటిస్తున్నారు. గతేడాది, ఈ ఏడాది ఆమె ఒక్క తెలుగు సినిమా చేయలేదు.

## చుట్టుముట్టిన వివాదాలు



ఈ ఏడాది తెలుగు సినీ పరిశ్రమను పలు వివాదాలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. యువ హీరో రాజ్‌తరుణ్‌పై లావణ్య అనే యువతి చీటింగ్ కేసు పెట్టింది. మాల్వి మల్హోత్రా అనే నటి వలలో పడి తనను దారుణంగా మోసగించాడని లావణ్య ఆరోపించింది. ఆర్.జె.శేఖర్ భాషా కూడా ఈ వివాదంలో ఇరుక్కున్నారు. కొంత కాలానికి ఈ వివాదం సద్దుమణిగింది.

- నటి సమంత- నాగచైతన్య విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సమంత, అక్కినేని కుటుంబంతో పాటు చిత్రపరిశ్రమ సురేఖకు దీటుగా బదులిచ్చింది. నాగార్జున సురేఖపై పరువు నష్టం దావా వేశారు. అలాగే నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత కూడా పతాక శీర్షికల్లో నిలిచింది.
- కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై ఆయన సహాయకురాలు లైంగిక వేధింపుల కేసు పెట్టింది. ఈ కేసులో జానీ మాస్టర్ అరెస్ట్ అయి బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆయనకు ఇచ్చిన జాతీయ అవార్డును కేంద్రం వెనక్కి తీసుకుంది. ఈ క్రమంలో డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ నుంచి ఆయన సభ్యత్వాన్ని రద్దు చేశారు.
- సీనియర్ నటుడు మోహన్‌బాబు కుటుంబ కలహాలు రచ్చకెక్కాయి. మోహన్‌బాబుతో తనకు ప్రాణహాని ఉందని మనోజ్ పోలీస్ కేసు పెట్టారు. మనోజ్ ఆహ్వానం మేరకు వెళ్లిన మీడియాపై మోహన్‌బాబు దాడి చేశారు. ఈ ఘటనలో ఓ జర్నలిస్టుకు గాయాలు కాగా, మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది.
- నటి కస్తూరి తెలుగు ప్రజల పట్ల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ అంశంలో ఆమెను చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆమె బెయిల్‌పై బయట ఉన్నారు.
- పుష్ప-2 బెనిఫిట్ షో చూడటానికి అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కి వెళ్లినప్పుడు అక్కడ జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందారు. ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమె కుమారుడు శ్రీతేజ్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసులో అరెస్టయిన బన్నీ బెయిల్‌పై విడుదలయ్యారు.
- బెంగళూరు రేవ్ పార్టీలో అరెస్టయిన నటి హేమ కొన్నాళ్లు జైలు జీవితం గడిపారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల రామ్‌గోపాల్ వర్మపై కేసులు నమోదయ్యాయి. పోలీసులకు దొరక్కుండా కొన్నాళ్లు అజ్ఞాతవాసంలో గడిపిన వర్మ కోర్టు జోక్యంతో ఊరట పొందారు.





## పెళ్లి కళ



**2024లో** టాలీవుడ్‌కు పెళ్లి కళ కనిపించింది. పలువురు సినీతారలు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఫిబ్రవరిలో రకుల్ ప్రీత్‌సింగ్ నిర్మాత జాకీ భగ్నానీతో ఏడడుగులు వేశారు. మార్చిలో హీరోయిన్ అదితీరావు హైదరీ, హీరో సిద్ధార్థ్‌ను పెళ్లాడారు. అలాగే కృతి కర్బందా, నటుడు పులకిత్ సామ్రాట్ ఒక్కటయ్యారు. తాప్సీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మతియాస్ బోని పెళ్లాడారు. జూలైలో నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ను పెళ్లాడారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్‌ల వివాహం ఆగస్టులో జరిగింది. సెప్టెంబర్‌లో హీరోయిన్ మేఘా ఆకాశ్ తన స్నేహితుడు, ప్రియుడు సాయి విష్ణుని వివాహం చేసుకున్నారు. గాయని గాయకులు రమ్యబెహరా, అనురాగ్ కులకర్ణి ప్రేమవివాహం ఆగస్టులో జరిగింది. ఈ నెల 4న నాగచైతన్య, శోభితా మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. 12న గోవాలో కీర్తిసురేశ్ వివాహం వ్యాపారవేత్త ఆంతోని తట్టిల్‌తో జరిగింది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి, సందీప్‌రాజ్, నటుడు సుబ్బరాజు, సాయికిరణ్, శ్రీసింహ ఈ ఏడాది పెళ్లి పీటలెక్కారు.






## భారీ హిట్లు

మహేశ్‌బాబు 'గుంటూరు కారం', నాగార్జున 'నా సామిరంగ' చిత్రాలతో ఈ ఏడాది సంక్రాంతి విజయాలను అందుకున్నారు. ఇక చిన్నసినిమాగా బరిలోకి దిగిన 'హను-మాన్' పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాన్ని నమోదు చేసింది. రూ. 50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి, రూ. 300 కోట్లకు పైబడి వసూళ్లను సాధించి అబ్బురపరిచింది. వెంకటేశ్ 'సైంధవ్' ప్రేక్షకులను నిరాశపరిచింది. 'టిల్లూ స్క్వేర్' చిత్రంతో యువహీరో సిద్ధు జొన్నలగడ్డ మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. మార్చిలో విడుదలైన ఈ చిత్రం రూ. 130 కోట్ల వసూళ్లతో ఘన విజయాన్ని నమోదు చేసింది. ఇక ద్వితీయార్థంలో ప్రభాస్ తన పవర్ చూపించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడి' చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్ల క్లబ్‌లో చేరింది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా శివ కొరటాల దర్శకత్వం వహించిన 'దేవర 1' సినిమా టాలీవుడ్‌తో పాటు హిందీ బెల్ట్‌లోనూ మంచి ఆదరణను సొంతం చేసుకుంది.



నాని హీరోగా వివేక్ ఆత్రేయ తెరకెక్కించిన చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ సినిమాతో నాని మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. కిరణ్ అబ్బవరం ఎదురుచూపులు ఫలించి, ఆయన హీరోగా నటించిన 'క' చిత్రం అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యంలో మర్డర్ మిస్టరీ కథతో తెరకెక్కిన ఈ చిత్రం రూ. 50 కోట్ల వసూళ్లను రాబట్టింది. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లక్కీ భాస్కర్'. బ్యాంకింగ్ రంగంలో మోసాలు, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం రూ. వందకోట్ల వసూళ్లను అధిగమించింది. జాతీయ స్థాయిలో 'పుష్ప 2' ప్రభంజనం కొనసాగుతోంది. దాదాపు 12 వేలకు పైబడి స్క్రీన్లలో విడుదలైన ఈ చిత్రం ఉత్తరాది బెల్ట్‌లో వీరవిహారం చేస్తోంది. రూ. 2 వేల కోట్ల క్లబ్‌కు చేరువలో ఉంది.




## ముత్యాల ముగ్గు



22 చుక్కలు
2 వచ్చేవరకు
సందుచుక్కలు.



సుజాత పి.వి.ఎల్.
సైనిక్‌పురి, సికింద్రబాద్

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్
జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
ఈ-మెయిల్: features@andhrajyothy.com

SANTOOR
నవ్య 'ముత్యాల ముగ్గు'లో ఎంపిక చేయబడి ప్రచురితమైన రంగవల్లికకు సంతూర్ ప్యాక్ బహుమతిగా పంపబడును
SANTOOR


## ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

| ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ | ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ |
|---|---|---|---|---|---|
| **నెట్‌ఫ్లిక్స్** | | | **డిస్నీ ప్లస్ హాట్‌స్టార్** | | |
| అవిసీ | డాక్యుమెంటరీ మూవీ | డిసెంబర్ 31 | ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్ | మలయాళ చిత్రం | జనవరి 03 |
| డోంట్ డై | హాలీవుడ్ మూవీ | జనవరి 01 | గుణ | హిందీ చిత్రం | జనవరి 03 |
| మిస్సింగ్ యూ | వెబ్‌సిరీస్ | జనవరి 01 | **మనోరమా మ్యాక్స్** | | |
| రీ యూనియన్ | హాలీవుడ్ మూవీ | జనవరి 01 | ఐ యామ్ కథలన్ | మలయాళ చిత్రం | జనవరి 03 |
| లవ్ ఈజ్ బ్లైండ్ | వెబ్‌సిరీస్ | జనవరి 03 | **ఆహా...** | | |
| సెల్లింగ్ ది సిటీ | వెబ్‌సిరీస్ | జనవరి 03 | జొల్లీ ఓ జింఖానా | తమిళచిత్రం | డిసెంబర్ 30 |
| వెన్ ది స్టార్స్ గాసిప్ | వెబ్‌సిరీస్ | జనవరి 04 | **బుక్ మై షో** | | |
| **అమెజాన్ ప్రైమ్** | | | క్రిస్మస్ ఈవ్ ఇన్ మిల్లర్స్ పాయింట్ | హాలీవుడ్ మూవీ | డిసెంబర్ 30 |
| గ్లాడియేటర్ 2 | హాలీవుడ్ మూవీ | జనవరి 01 | | | |
| ది రిగ్ | వెబ్‌సిరీస్ | జనవరి 02 | | | |

## ప్రేమ కోసం తపించే హృదయాలు

'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' చిత్రానికి పాయల్ కపాడియా దర్శకత్వం వహించారు. కేన్స్ చిత్రోత్సవంలో రెండో అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ ప్రిక్స్'ను అందుకుంది. ఒక భారతీయ చిత్రం ఈ అవార్డును అందుకోవడం ఇదే తొలిసారి. అలాగే గోల్డెన్ గ్లోబ్ పురస్కారాల్లో రెండు నామినేషన్స్ సాధించింది. ఈ చిత్రాన్ని తెలుగులో నటుడు రానా విడుదల చేశారు. కేరళ నుంచి ముంబైకు వచ్చి అక్కడ నర్సులుగా పనిచేస్తున్న ప్రభ, అను అనే ఇద్దరమ్మాయిల కథ ఇది. ఓ రోడ్ ట్రిప్ వారి జీవితాల్లో ఎలాంటి మార్పుకు కారణమైందనేది కథ. ప్రేమ కోసం తపించే హృదయాలను, ముంబై నగరంలో ఓ గూడు కోసం అలమటించే పేదల ఆవేదనను కపాడియా అద్భుతంగా ఆవిష్కరించారు.




















# బాలీవుడ్ బాద్‌షాలు

**ఈ ఏడాది బాలీవుడ్‌లో అనేక చిత్రాలు విడుదలయ్యాయి. వాటిలో కొన్ని బాక్సాఫీసు వద్ద బ్లాక్‌బస్టర్ అయ్యాయి. కొన్ని రూ.100 కోట్ల క్లబ్‌లో చేరితే.. మరికొన్ని బొక్కబోర్లా పడ్డాయి. ఈ నేపథ్యంలో 2024లో బాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు రాబట్టిన పది చిత్రాలు ఏవో చూద్దాం!**

**స్త్రీ-2:**

రాజ్‌కుమార్, శ్రద్ధాకపూర్ నటించిన ఈ హారర్ కామెడీ చిత్రం బాక్సాఫీసు వద్ద భారీ కలెక్షన్లతో బ్లాక్ బస్టర్ అయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా రూ.837 కోట్లు వసూలు చేసి బాలీవుడ్‌లో ఈ ఏడాది తొలి స్థానంలో నిలిచింది.

**భూల్ భులయ్యా-3:**

ఇది కూడా హారర్ కామెడీ చిత్రమే. గ్లోబల్‌గా రూ.371 కోట్ల వసూళ్లతో రెండో స్థానంలో నిలిచింది. అనీస్ బాజ్మీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్, మాధురి దీక్షిత్, త్రిప్తీ డిమ్రీ తదితరులు నటించారు.










**సింగం ఎగైన్:**

రోహిత్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అజయ్ దేవగణ్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొనే, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, కరీనాకపూర్, అక్షయ్ కుమార్ వంటి భారీ తారాగణం నటించారు. అయినప్పటికీ ఇదే సమయంలో విడుదలైన భూల్ భులయ్యా-3ని ఏమాత్రం అధిగమించలేదు. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ.367 కోట్లు వసూలు చేసి తృతీయ స్థానంలో నిలిచింది.

**ఫైటర్:**

హృతిక్ రోషన్, దీపికా పదుకొనే ప్రధాన పాత్రల్లో నటించారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం యావరేజ్ టాక్‌తో గ్లోబల్ వైడ్‌గా రూ.340 కోట్లు వసూలు చేసింది. విదేశాల్లో రూ.140 కోట్లు రాగా, ఇండియా వ్యాప్తంగా రూ. 200 కోట్లను రాబట్టగలిగింది.

**షైతాన్:**

ఇది ఒక సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ చిత్రం. వికాస్ దర్శకత్వంలో అజయ్ దేవగణ్, మాధవన్, జ్యోతిక తదితరులు నటించారు. గుజరాతి చిత్రం 'వశ్' ఆధారంగా నిర్మించిన ఈ సినిమా రూ.210 కోట్ల కలెక్షన్లు సాధించింది.

**క్రూ:**

రాజేశ్ కృష్ణన్ దర్శకత్వంలో వచ్చిన చిత్రమిది. ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేస్తున్న ముగ్గురు మహిళల జీవితం ఆధారంగా నిర్మించిన ఈ చిత్రంలో టబు, కరీనా కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. రూ.150 కోట్లతో పరవాలేదనిపించింది.

**తేరీ బాతోన్ మే ఐసా ఉల్జా జియా:**

ఈ సైంటిఫిక్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ చిత్రంలో షాహీద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. మానవుడు, రోబోకు మధ్య నడిచే ప్రేమ కథ ఇది. అమిత్ జోషీ, ఆరాధనా షా దర్శకత్వం వహించారు. రూ.136 కోట్ల వసూళ్లతో సరిపెట్టుకుంది.

**ముంజ్యా:**

ఆదిత్య సర్పోత్థర్ దర్శకత్వంలో వచ్చిన సూపర్ నేచురల్ యూనివర్సల్ చిత్రం. శర్వరీ, అభయ్ వర్మ, సత్యరాజ్, మోనా సింగ్ ప్రధాన పాత్రల్లో నటించారు. విమర్శకుల నుంచి సానుకూల సమీక్షలు పొందినప్పటికీ ఎక్కువగా వసూళ్లు రాబట్టలేకపోయింది. గ్లోబల్ వైడ్‌గా రూ. 128 కోట్లు సాధించగలిగింది.


**బ్యాడ్ న్యూజ్:**

గుడ్ న్యూజ్‌కి ఆధ్యాత్మిక సీక్వెల్‌గా వాస్తవాధారిత ఘటనల ఆధారంగా నిర్మించిన హాస్య భరిత చిత్రం. విక్కీ కౌశల్, త్రిప్తీ డిమ్రీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఆనంద్ తివారీ దర్శకుడు. బాక్సాఫీసు వద్ద రూ.109 కోట్లను వసూలు చేసింది.

**బడే మియా చోటే మియా:**


ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ సినిమాలో టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రల్లో నటించారు. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహించారు. ప్రపంచవ్యాప్తంగా రూ.105 కోట్ల వసూళ్లతో వంద కోట్ల క్లబ్‌లో పదో స్థానంలో నిలిచింది.

# రామ్‌చరణ్ భారీ కటౌట్




రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా విజయవాడలో 250 అడుగుల రామ్‌చరణ్ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. బృందావన్ కాలనీలోని వజ్రా గ్రౌండ్స్‌లో ఈ భారీ కటౌట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఈ కటౌట్‌ను చిత్ర బృందం అవిష్కరించనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు, సంగీత దర్శకుడు తమన్ తదితరులు పాల్గొంటున్నారు. కాగా, వచ్చే ఏడాది జనవరి 10న ఈ చిత్రం విడుదల కానుంది. శ్రీకాంత్, ఎస్‌జే.సూర్య కీలక పాత్రలు పోషించారు.

లబ్బీపేట, (ఆంధ్రజ్యోతి)




ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి శనివారం బొర్రా గుహలను సందర్శించారు. మహేష్‌బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కించనున్న 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' సినిమా కోసం లొకేషన్లు చూసే క్రమంలోనే ఆయన బొర్రా గుహలను పరిశీలించినట్టు సమాచారం.

అనంతగిరి, (ఆంధ్రజ్యోతి)

# త్వరలో దృశ్యం-3

**మోహన్ లాల్**



"దృశ్యం-3 స్క్రిప్టు సిద్ధమైంది. త్వరలో షూటింగ్ మొదలవనుంది. మా సినిమాను ఆధారంగా చేసుకుని వివిధ భాషల్లో రీమేక్స్ వచ్చాయి' అని అన్నారు మలయాళ అగ్ర నటుడు మోహన్ లాల్. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన తాజా చిత్రం 'బరోజ్ 3డి'. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా మోహన్‌లాల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'దృశ్యం' చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. "దృశ్యం' తెరకెక్కించడానికి జీతూ జోసెఫ్ ఎంతో శ్రమించారు. కథ సిద్ధమైన తరువాత దాదాపు ఐదేళ్లపాటు ఆయన ఎంతో మంది నటీనటులను కలిశారు. ఎవరు కూడా ఈ కథని అంగీకరించలేదు. ఈ క్రమంలో ఆశీర్వాద్ సినిమాస్‌కు చెందిన ఆంటోనీ ఫోన్ చేశారు. జీతూ జోసెఫ్ దగ్గర కథ ఉంది...వీలుంటే ఒకసారి వినమని చెప్పారు. కథ విన్న నేను వెంటనే ఓకే చేశా. అలా 'దృశ్యం' జర్నీ మొదలైంది. త్వరలోనే 'దృశ్యం-3' కూడా పట్టాలెక్కనుంది' అని చెప్పారు. కాగా, 'దృశ్యం' చిత్రాన్ని తెలుగులో వెంకటేశ్, తమిళంలో కమల్‌హాసన్, హిందీలో అక్షయ్ కుమార్ సేమ్ టైటిల్‌తో రిమేక్ చేశారు.

# కీర్తికి నిరాశే



'బేబి జాన్' మూవీతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన నటి కీర్తి సురేశ్‌కు నిరాశ ఎదురైంది. వరుణ్ ధావన్ హీరోగా నటించిన 'బేబి జాన్' ఇటీవలే విడుదలై.. ఈ ఏడాది బాలీవుడ్‌లో పెద్ద డిజాస్టర్‌గా నిలిచింది. రూ.180 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం మూడు రోజుల్లో కేవలం రూ.19 కోట్ల కలెక్షన్స్ మాత్రమే రాబట్టింది. మొదటి రోజుతో పోలిస్తే మూడో రోజు కలెక్షన్స్ 70 శాతం వరకు పడిపోయాయి. ఈ మూవీ బ్రేక్ ఈవెన్ కావడం కష్టమేనని బాలీవుడ్ వర్గాల్లో ప్రచారమవుతోంది.

# అందరినీ అలరించే చిత్రం



నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'ఓ చెలియా'. నాగ రాజశేఖర్ దర్శకత్వంలో రూపశ్రీ, చంద్రమౌళి నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు రూపశ్రీ, చంద్రమౌళి మాట్లాడుతూ "ఈ సినిమాను దర్శకుడు అనుకున్న దానికంటే చాలా బాగా తెరకెక్కించారు. కచ్చితంగా అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. "ఈ సినిమా కోసం టీమ్ ప్రాణం పెట్టి పనిచేసింది. సినిమా ఘన విజయం సాధిస్తుంది" అని చెప్పారు.



హీరో వినోద్ నువ్వుల ఆధ్వర్యంలో వినోద్ ఫిల్మ్ అకాడమీ నాలుగవ వార్షికోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు సర్టిఫికేట్లు, మెడల్స్ అందించారు. అలాగే, ఆయన హీరోగా నటించిన 'ల్యాంప్' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు.

# కొత్త అనుభూతినిచ్చేలా...



నిరుడు విడుదలైన 'మ్యాడ్' సినిమా సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా వస్తోన్న చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 26 విడుదలకు సిద్ధమవుతోంది. 'లడ్డు గాని పెళ్లి' అంటూ ఈ చిత్రం నుంచి విడుదలైన మొదటి గీతానికి మంచి స్పందన లభించింది. తాజాగా 'స్వాతి రెడ్డి' అంటూ సాగే రెండో పాటను విడుదల చేశారు మేకర్స్ రెబా మోనికా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సురేశ్ గంగుల సాహిత్యానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించడమే కాకుండా స్వాతిరెడ్డితో కలసి ఆలపించారు. ఈ పాట ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతినిచ్చేలా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది.

# సంతోషంగా ఉంది

**కిరణ్ తిరుమలశెట్టి**



ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా కిరణ్ తిరుమలశెట్టి తెరకెక్కించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం థ్యాంక్స్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ 'ఈ సినిమాకు దక్కుతున్న ఆదరణ పట్ల సంతోషంగా ఉంది' అని అన్నారు.



## 'పుష్ప' స్టయిల్లో..

కెరీర్‌లో తొలి టెస్టు అర్ధ శతకం సాధించిన నితీశ్ 'పుష్ప' మాదిరిగా సంబరం చేసుకున్నాడు. 50 పరుగులు పూర్తి చేయగానే బ్యాటుతో అభిమానులకు అభివాదం చేశాడు. 'పుష్ప' సినిమాలో హీరో మాదిరి బ్యాటును మెడకింద కుడివైపు నుంచి ఎడమవైపునకు తీసుకొచ్చాడు. అదే వీడియోను 'పుష్పకాదు.. ఫైర్' అంటూ బీసీసీఐ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఇక శతకం సాధించిన సందర్భాన్ని నితీశ్ మరింత ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకున్నాడు. బ్యాట్‌ను గ్రౌండ్‌పై నిలువుగా పెట్టి మోకాళ్లపై నిలుచున్నాడు. బ్యాట్ హ్యాండిల్‌పై హెల్మెట్‌ను ఉంచి ఆకాశంలో చూస్తూ సలార్ సినిమాలో హీరోని గుర్తు చేశాడు.



## కొడుకు తొలి శతకం తండ్రి భావోద్వేగం

నితీశ్ మొదటి టెస్టు శతకం పూరించగానే స్టేడియంలో ఉన్న అతడి తండ్రి ముత్యాలరెడ్డి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. నితీశ్ 90ల్లోకి రాగానే ఆయన ముఖంలో టెన్షన్ కనిపించింది. కుమారుడు శతకం చేయాలని ఆయన దేవుణ్ణి ప్రార్థించారు. సెంచరీ పూర్తి చేయగానే ఉద్వేగం పట్టలేక ఏడ్చేశారు. తండ్రితో పాటు గ్రౌండ్‌లో మ్యాచ్ తిలకిస్తున్న నితీశ్ తల్లి, సోదరి కూడా ఉద్వేగానికి లోనయ్యారు. శనివారం సాయంత్రం నితీశ్‌ను అతడు బస చేస్తున్న హోటల్లో తల్లి, తండ్రి, సోదరి కలిశారు. డోర్ తీసిన వెంటనే తల్లిని హత్తుకున్న నితీశ్..అనంతరం సోదరిని, చివరగా తండ్రిని ఆలింగనం చేసుకున్నాడు. ఈ సందర్భంగా తండ్రిని చూసి నితీశ్ ఉద్వేగానికి గురయ్యాడు.




41, 38 నాటౌట్, 42, 42, 16.. తాజా సిరీస్‌లో

నితీశ్ కుమార్ బ్యాట్ నుంచి వచ్చిన స్కోర్లివి. తన బ్యాటింగ్ తీరుతో అందరినీ ఆకట్టుకుంటున్నా కనీసం 50+ స్కోరైనా నమోదు కావడం లేదే అనే వెలితి అందరిలోనూ ఉంది. చివరకు సాధించాడు. జట్టు కష్టాల్లో ఉన్న వేళ బరిలోకి దిగిన తను.. ఓ వైపు ఫాలోఆన్ ప్రమాదం పొంచి ఉండగా.. ప్రఖ్యాత మెల్‌బోర్న్ మైదానంలో అబ్బురమనిపించే షాట్లతో చెలరేగాడు. ఎనిమిదో స్థానంలో వచ్చి ప్రపంచ అత్యుత్తమ స్థాయి బౌలర్లను కాచుకుంటూ 21 ఏళ్ల నితీశ్ వైల్డ్ ఫైర్ బ్యాటింగ్‌తో విరుచుకుపడ్డాడు. కుమారుడి కెరీర్ కోసం సర్వస్వం త్యాగం చేసిన ఆ తండ్రి కళ్ల ముందే.. కెరీర్‌లో తొలి సెంచరీతో ఈ తెలుగు తేజం క్రీడాభిమానులను ఉప్పొంగిపోయేలా చేశాడు. అటు సుందర్ హాఫ్ సెంచరీతో జట్టును కాపాడే ప్రయత్నం చేశాడు.

# మనోడు నిలబెట్టాడు

అజేయ శతకంతో చెలరేగిన నితీశ్



నితీశ్ కుమార్ (105 బ్యాటింగ్)

ఆసీస్‌తో బాక్సింగ్ డే టెస్టు

### నాన్నకు అంకితం

తన తొలి టెస్టు శతకాన్ని తండ్రి ముత్యాలరెడ్డికి అంకితం ఇస్తున్నట్టు నితీశ్ ప్రకటించాడు. తాను సెంచరీ పూర్తి చేయడాన్ని చూసి ఉద్వేగంతో ఏడ్చేస్తున్న తండ్రి ఫొటోను పోస్ట్ చేసిన నితీశ్.. 'ఇది మీకోసమే నాన్న' అని ఆ ఫొటో కింద రాశాడు. 'నాకోసం నాన్న ఉద్యోగాన్ని వదిలేశారు. నేను ఈస్థితికి చేరడం వెనుక ఆయన త్యాగం ఎంతో ఉంది. తీవ్రమైన ఆర్థిక సమస్యలతో ఒకానొక సందర్భంలో ఆయన ఏడవడాన్ని చూశా. నా తొలి జెర్సీని ఆయనకు ఇచ్చినప్పుడు నాన్న మొహంలో సంతోషాన్ని నేను మాటల్లో వర్ణించలేను' అని నితీశ్ అన్నాడు.

**4** ఆస్ట్రేలియా గడ్డపై శతకాలు సాధించిన తెలుగు ఆటగాళ్లలో నితీశ్ నాలుగోవాడు. అంతకు ముందు హైదరాబాదీ ఆటగాళ్లు ఎంఎల్ జైసింహ (1968), అజరుద్దీన్ (1992), వీవీఎస్ లక్ష్మణ్ (2000-08 మధ్య 4 శతకాలు) సెంచరీలు సాధించారు.

ఐపీఎల్‌లో సంచలన బ్యాటింగ్‌తో భారత టీ20 జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అంతర్జాతీయ టీ20లలోనూ సత్తా చాటి టెస్టు జట్టులో సైతం చోటు ఖాయం చేసుకున్నాడు. ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ సిరీస్‌కు అతడిని ఎంపిక చేసినప్పుడు 'పొట్టి ఫార్మాట్‌లో ఎడాపెడా బంతిని బాదినంత సులువుకాదు సుదీర్ఘ ఫార్మాట్‌లో రాణించడం' అని అనుమానాలు వ్యక్తం చేసిన వారు లేకపోలేదు. కానీ వారి అనుమానాలను పటాపంచలు చేస్తూ ఆస్ట్రేలియాతో తొలి మూడు టెస్టుల్లోనూ నిలకడైన బ్యాటింగ్‌తో తానేమిటో నిరూపించుకున్నాడు. కీలకమైన నాలుగో టెస్టులో జట్టు అత్యంత దయనీయస్థితిలో ఉన్నప్పుడు ఏకంగా శతకంతో కదంతొక్కి ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు. క్రికెట్ పండితుల నీరాజనాలు అందుకున్నాడు. అతడే తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి.

## ఆపద్బాంధవుడు

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఐపీఎల్‌లో ఎన్నో మెరుపు ఇన్నింగ్స్ ఆడిన అతడు నితీశ్ కుమార్ రెడ్డి క్రీజులో గంటలకొద్దీ పాతుకుపోవాల్సిన టెస్టు క్రికెట్‌లోనూ భళా అనిపిస్తున్నాడు. కంగారూల గడ్డపై బౌన్సీ, స్వింగ్ పిచ్‌లకు అనుగుణంగా తన బ్యాటింగ్‌ను మార్చుకొని నికార్సయిన క్రికెటర్‌గా ప్రశంసలు పొందుతున్నాడు. అరంగేట్రం టెస్టులో..పెర్త్ బౌన్సీ వికెట్‌పై కోహ్లీ, రాహుల్ వంటి హేమాహేమీ బ్యాటర్లు చేతులెత్తేసిన వేళ..తొలి ఇన్నింగ్స్‌లో 41 పరుగులతో నితీశ్ ఆకట్టుకున్నాడు. భారత్ ఘన విజయం సాధించిన ఆ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో అజేయంగా 38 పరుగులతో ఆకట్టుకున్నాడు. ఇక అడిలైడ్ డే/నైట్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో 42 పరుగుల చొప్పున చేసి తన విలువ చాటిచెప్పాడు. మెల్‌బోర్న్ టెస్టు శతక ఇన్నింగ్స్‌తో 21 ఏళ్ల నితీశ్ ఒక్కసారి సూపర్ స్టార్‌గా మారాడు. సిరీస్‌లో ఇప్పటివరకు మూడు వికెట్లు తీసి ఆల్‌రౌండర్‌గానూ న్యాయం చేశాడు.

**ఎన్నో కష్టాలకోర్చి..:** నితీశ్ ఈస్థాయికి రావడం వెనుక అతడి కఠోర శ్రమతోపాటు కుటుంబ త్యాగం చాలా ఉంది. విశాఖపట్నానికి చెందిన నితీశ్ తండ్రి ముత్యాలరెడ్డి హిందుస్థాన్ జింక్ సంస్థ నుంచి వీఆర్ఎస్ తీసుకొన్నారు. ఎందుకో తెలుసా..క్రికెటర్ కావాలనే తన 12 ఏళ్ల కుమారుడు నితీశ్ కల నిజం చేసేందుకు. సరైన క్రికెట్ కోచింగ్ సౌకర్యాలు లేని ఉదయ్‌పూర్‌కు బదిలీ కావడంతో ఆయన వీఆర్ఎస్ తీసుకొని మైక్రోఫైనాన్స్ వ్యాపారం ప్రారంభించి నష్టపోయారు. ఆర్థిక ఒడిదుడుకులు ఎదురైనా వెనుకంజ వేయక కుమారుడిని క్రికెటర్‌గా తీర్చిదిద్దేందుకు శ్రమించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏడాదికి ఒక ఇంగ్లిష్ విల్లో బ్యాట్‌తోనే నితీశ్ సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇక..నితీశ్‌లోని క్రికెట్ ప్రతిభను గమనించిన జాతీయ సెలెక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అతడిని ఎంతో ప్రోత్సహించారు. కడపలోని ఆంధ్ర క్రికెట్ అకాడమీలో మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాటుదేలిన నితీశ్ కొద్దికాలంలోనే దేశవాళీ పోటీల్లో భారీ స్కోర్లతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. 2017-18 సీజన్‌లో అండర్-16 'బెస్ట్ ప్లేయర్' అవార్డు సొంతం చేసుకున్నాడు. 2023లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసిన నితీశ్..గత సీజన్‌లో తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఔరా అనిపించాడు. అలా టీమిండియాలో చోటు దక్కించుకొని ఆస్ట్రేలియాలో అదరగొడుతున్నాడు.

### భారత్ తొలి ఇన్నింగ్స్ 358/9 • సుందర్ అర్ధసెంచరీ

**మెల్‌బోర్న్:** ఎవరూ ఊహించని విధంగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి ఎంపికైన తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ వహ్వా.. అనిపిస్తున్నాడు. ఆసీస్‌తో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో అజేయ శతకం (105 బ్యాటింగ్) ద్వారా గట్టి పంచే ఇచ్చాడు. తద్వారా జట్టును ఫాలోఆన్ నుంచి కూడా గట్టెక్కించాడు. వాషింగ్టన్ సుందర్ (50)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 127 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో మూడో రోజు శనివారం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358/9 స్కోరుతో నిలిచింది. అయితే వెలుతురులేమితో పాటు వర్షం కారణంగా ఆఖరి సెషన్‌ను గంట ముందుగానే ముగించారు. బోలాండ్, కమిన్స్‌లకు మూడేసి, లియోన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్రస్తుతం భారత జట్టు 116 పరుగుల వెనుకంజలో ఉంది. ఇక చేతిలో వికెట్లేమీ లేకపోవడంతో నితీశ్ వీలైనంత వేగంగా పరుగులు రాబట్టాల్సి ఉంది. ఆదివారం అర్ధగంట ముందుగానే మ్యాచ్ ఆరంభం కానుంది.



వాషింగ్టన్ సుందర్ (50)

**పంత్ పేలవంగా..:** 164/5 ఓవర్‌నైట్ స్కోరుతో భారత్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించగా, ఆదుకుంటారనుకున్న పంత్ (28), జడేజా (17) తీవ్రంగా నిరుత్సాహపరిచారు. ఆరంభంలో ఇద్దరూ ఆచితూచి ఆడి వికెట్‌ను కాపాడుకునే ప్రయత్నం చేశారు. కానీ ఓపిగ్గా క్రీజులో నిలవాల్సిన పంత్ నిర్లక్ష్యపు షాట్‌కు వెనుదిరిగాడు. బోలాండ్ ఓవర్‌లో అనవసరంగా ర్యాంప్ షాట్‌కు వెళ్లి క్యాచ్ ఇచ్చాడు. దీంతో అతడి షాట్ ఎంపిక తీవ్ర విమర్శలపాలైంది. అటు జడేజా కూడా కాసేపటికే వెనుదిరిగాడు. నితీశ్ మాత్రం ఆత్మవిశ్వాసంతో కనిపించి సుందర్‌తో ఆదుకునే ప్రయత్నం చేశాడు. తొలి సెషన్‌లో జట్టు 27 ఓవర్లలో 80 పరుగులు చేయగా ఇందులో నితీశ్‌వే 40 రన్స్ ఉండడం విశేషం.

**ఆదుకున్న నితీశ్-సుందర్:** 221 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన వేళ.. ఆసీస్ బౌలర్ల జోరు చూస్తే భారత్‌కు ఫాలోఆన్ తప్పదనిపించింది. అప్పటికి మరో 53 పరుగులు చేయాల్సి ఉంది. అయితే నితీశ్ మాత్రం ఎలాంటి బెరుకు లేకుండా అన్ని రకాల షాట్లతో ఎంసీజీలో బంతిని పరిగెత్తించాడు. అటు సుందర్ కూడా నిలకడ చూపడంతో జట్టుకు ఫాలోఆన్ తప్పింది. రెండో సెషన్‌లో వీరు వికెట్ కోల్పోకుండా ఆడారు. ఇప్పటిదాకా టెస్టుల్లో 40+ స్కోరును దాటలేకపోయిన నితీశ్ ముందుగా అర్ధసెంచరీ పూర్తి చేసి పుష్ప తరహాలో సంబరాలు చేసుకున్నాడు. దీంతో చూస్తుండగానే సుందర్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు వంద పరుగులు జోడించాడు. 97వ ఓవర్‌లో వర్షం కురవడంతో టీబ్రేక్‌కు కాస్త ముందుగానే వెళ్లారు.

**తీవ్ర ఉత్కంఠ:** అర్ధగంట ఆలస్యంగా ఆరంభమైన ఆఖరి సెషన్‌లో ఆసీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేశారు.. చివరకు 108వ ఓవర్‌లో నితీశ్ ఓ ఫోర్ సాధించగా.. సుందర్ తన అర్ధసెంచరీని పూర్తి చేశాడు. ఆసీస్‌ను విసిగిస్తున్న ఈ జోడీని లియోన్ దెబ్బతీశాడు. ఆ వెంటనే 114వ ఓవర్‌లో మూడో బంతికి బుమ్రాను కమిన్స్ డకౌట్ చేశాడు. అప్పటికి నితీశ్ 99 పరుగులతో ఉన్నాడు. అభిమానులతో పాటు స్టేడియంలో కూర్చున్న నితీశ్ తండ్రి ఉద్వేగంతో కనిపించాడు. మిగిలిన ఆ మూడు బంతులను సిరాజ్ ఎలా ఎదుర్కొంటాడా? అని అంతా ఊపిరిబిగపట్టి ఎదురుచూశారు. సిరాజ్ కెరీర్‌లో అత్యంత సవాల్‌తో కూడిన క్షణాలను విజయవంతంగానే అధిగమించాడు. ఇక తర్వాతి ఓవర్‌లో ఫుల్లర్ లెంగ్త్‌తో వేసిన మూడో బంతిని నితీశ్ అమాంతం మిడాన్ వైపు లాఫ్టెడ్ షాట్‌తో బౌండరీకి తరలించాడు. సెంచరీ పూర్తయ్యాక నితీశ్ మోకాలు నేలకు ఆనించి బ్యాట్‌పై హెల్మెట్‌ను ఉంచి ఎడమచేతిని ఆకాశం వైపు చూపిస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఈ దృశ్యాన్ని ఎంసీజీతో పాటు టీవీల్లో తిలకించిన లక్షలాది అభిమానులు కూడా పులకించిపోయారు. మరో ఓవర్ తర్వాత వర్షంతో మ్యాచ్ నిలిచిపోయింది.

**1** ఆసీస్ గడ్డపై ఎనిమిదో స్థానంలో బరిలోకి దిగి అత్యధిక వ్యక్తిగత స్కోరు (105 బ్యాటింగ్) సాధించిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. గతంలో కుంబ్లే (87) పేరిట ఈ ఫీట్ ఉండేది.

147 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో 8,9 స్థానాల్లో వచ్చిన బ్యాటర్లు (నితీశ్, సుందర్) 150+ బంతులు ఎదుర్కోవడం ఇదే తొలిసారి.

**2** ఆసీస్‌లో 8 అంత కంటే దిగువ స్థానాల్లో అత్యధిక భాగస్వామ్యం (127) అందించిన రెండో భారత జోడీగా నితీశ్-సుందర్. టాప్‌లో సచిన్-హర్భజన్ (129) ఉన్నారు.

**3** ఆసీస్‌లో భారత్ నుంచి సెంచరీ సాధించిన మూడో అతిపిన్న వయస్కుడి (21 ఏళ్ల 216 రోజులు)గా నితీశ్. సచిన్ (18), పంత్ (21 ఏళ్ల 92) ముందున్నారు.

### స్కోరుబోర్డు

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (రనౌట్) 82; రోహిత్ (సి) బోలాండ్ (బి) కమిన్స్ 3; రాహుల్ (బి) కమిన్స్ 24; విరాట్ (సి) క్యారీ (బి) బోలాండ్ 36; ఆకాశ్ (సి) లియోన్ (బి) బోలాండ్ 0; పంత్ (సి) లియోన్ (బి) బోలాండ్ 28; జడేజా (ఎల్బీ) లియోన్ 17; నితీశ్ (బ్యాటింగ్) 105; సుందర్ (సి) స్మిత్ (బి) లియోన్ 50; బుమ్రా (సి) ఖవాజా (బి) కమిన్స్ 0; సిరాజ్ (బ్యాటింగ్) 2; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 116 ఓవర్లలో 358/9. వికెట్ల పతనం:** 1-8, 2-51, 3-153, 4-154, 5-159, 6-191, 7-221, 8-348, 9-350.**బౌలింగ్:** స్టార్క్ 25-2-86-0; కమిన్స్ 27-6-86-3; బోలాండ్ 27-7-57-3; లియోన్ 27-4-88-2; మార్ష్ 7-1-28-0; హెడ్ 3-0-11-0.

### కలకాలం గుర్తుండే ఇన్నింగ్స్

ఈ ఇన్నింగ్స్ నితీశ్‌కు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. తొలి టెస్టు నుంచే అతడి బ్యాటింగ్ నన్ను ఆకట్టుకుంది. సిరీస్‌లో ఈరోజు అతి కీలక ఇన్నింగ్స్ ఆడడం ద్వారా నితీశ్ కెరీర్‌లో మరో మెట్టు పైకెక్కాడు. అతడికి సుందర్ చక్కగా సహకరించాడు. -సచిన్

### అనేక సెంచరీలకు నాంది

నేను కచ్చితంగా చెప్పగలను.. ఈ శతకం నువ్వు సాధించబోయే అనేక సెంచరీలకు నాంది. భయం లేకుండా నువ్వు ఆడిన స్ట్రోక్ ప్లేను, నీ సానుకూల దృక్పథాన్ని ఎంతో ఆస్వాదించా. ఇకముందూ ఇలాగే ఆడాలి. దేవుడి ఆశీస్సులు నీకెప్పుడూ ఉంటాయి.
- వీవీఎస్ లక్ష్మణ్

### నితీశ్‌కు ఏసీఏ నజరానా రూ.25 లక్షలు

**హైదరాబాద్:** నితీశ్ కుమార్‌కు ఆంధ్ర క్రికెట్ సంఘం రూ. 25 లక్షల నజరానా ప్రకటించింది. ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్ బాబు అతడికి అభినందనలు తెలిపారు. ఆస్ట్రేలియా పర్యటన నుంచి నితీశ్ వచ్చాక సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ నగదు బహుమతిని అందించనున్నామని ఏసీఏ తెలిపింది.



### ప్రొ. కబడ్డీ లీగ్ ఫైనల్ నేడు

పట్నా X హరియాణా

రాత్రి 8 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

### దక్షిణాఫ్రికా లక్ష్యం 148

ప్రస్తుతం 27/3 ● పాక్‌తో తొలి టెస్టు

**సెంచూరియన్:** దక్షిణాఫ్రికా-పాకిస్థాన్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా మారింది. పాక్ నిర్దేశించిన 148 పరుగుల ఛేదనలో.. శనివారం ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 27/3 స్కోరు చేసింది. అంతకుముందు ఆటకు మూడో రోజు ఓవర్ స్కోరు 88/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాకిస్థాన్ 237 పరుగులకు ఆలౌటైంది. జెన్సన్ (6/52) ఆరు వికెట్లతో ప్రత్యర్థి పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 211, దక్షిణాఫ్రికా 301 పరుగులు చేశాయి.



### అరుదైన గౌరవం

క్లిష్ట పరిస్థితుల్లో శతక్కొట్టి జట్టును ఆదుకున్న నితీశ్ సహచరుల నుంచి గౌరవాన్ని అందుకున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ సహా జట్టు ఆటగాళ్లంతా నితీశ్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి వస్తున్న సమయంలో గౌరవ సూచకంగా బౌండరీ లైన్ వద్దకు వెళ్లి చప్పట్లతో అభినందించారు. కామెంట్రీ బాక్స్‌లో ఉన్న సునీల్ గవాస్కర్‌లాంటి దిగ్గజాలు కూడా నితీశ్ ఆటను కొనియాడుతూ లేచి నిలుచోవడం విశేషం. మాజీ కోచ్ రవిశాస్త్రికి కన్నీరు ఆగలేదు.



### డ్రెస్ కోడ్ పాటించని.. కార్ల్‌సన్‌పై అనర్హత వేటు

**న్యూయార్క్:** ఐదుసార్లు వరల్డ్ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు చేదు అనుభవం ఎదురైంది. డ్రెస్ కోడ్‌ను పాటించనందుకు అతడిపై ఏకంగా అనర్హత వేటు పడింది. డిఫెండింగ్ చాంప్ అయిన కార్ల్‌సన్.. వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీకి జీన్స్ ధరించి వచ్చాడు. అయితే, డ్రెస్ మార్చుకుని రావాలని చీఫ్ ఆర్బిటర్ చెప్పినా ససేమిరా అన్నాడు. దీంతో నిర్వాహకులు అతడిపై అనర్హత వేటు వేశారు.

**టాప్‌లో అర్జున్..:** ఇదే టోర్నీలో బరిలో నిలిచిన అర్జున్ ఇరిగేసి 7 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆడిన 9 రౌండ్లలో ఆరు గెలిచిన అర్జున్.. రెండు గేమ్‌లను డ్రా చేసుకొన్నాడు. ఒక్క గేమ్‌లో మాత్రమే ఓడాడు. ఇక, మహిళల విభాగంలో హంపి, హారిక కూడా చెరో 6.5 పాయింట్లతో సంయుక్తంగా టాప్‌లో నిలిచారు. ఆడిన 8 రౌండ్లలో ఆరు గెలిచిన హంపి.. ఒకటి డ్రా చేసుకొంది. మరోవైపు హారిక ఓటమి లేకుండా సాగుతోంది. మరో మూడు రౌండ్లు మాత్రమే మిగిలిన నేపథ్యంలో భారత్‌కు పతకం లభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

# బిజినెస్



రతన్ టాటా 87వ జయంతిని పురస్కరించుకుని టాటా సన్స్ ప్రధాన కార్యాలయం బాంబే హౌస్‌లో రతన్ టాటా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఆవిష్కరించారు.

### రిలయన్స్ చేతికి కర్కినోస్ హెల్త్‌కేర్

**న్యూఢిల్లీ:** రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్).. టెక్నాలజీ ఆధారిత హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ కర్కినోస్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను రూ.375 కోట్లకు కొనుగోలు చేసింది. అనుబంధ సంస్థ రిలయన్స్ స్ట్రాటజిక్ బిజినెస్ వెంచర్స్ (ఆర్ఎస్‌బీవీఎల్) ద్వారా ఈ కొనుగోలు చేపట్టినట్టు ఆర్ఐఎల్ తెలిపింది. 2020 జూలై 24న ఏర్పాటైన కర్కినోస్.. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించటం, డయాగ్నోసిస్, చికిత్స వంటి సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 60కి పైగా హాస్పిటల్స్‌తో ఒప్పందాలను కలిగి ఉంది.

### రూ.11,650 కోట్ల రుణాలు క్లియర్

వొడాఫోన్ గ్రూప్

వొడాఫోన్ గ్రూప్ భారత్‌లోని తన అనుబంధ సంస్థ వొడాఫోన్ ఐడియాకు చెందిన రూ.11,650 కోట్ల రుణాలను క్లియర్ చేసింది. వొడాఫోన్ ఐడియా ఈక్విటీలో భారత్, మారిషస్‌ల్లోని తన అనుబంధ సంస్థలకు ఉన్న 22.56 శాతం వాటా షేర్లను హెచ్ఎస్‌బీసీ కార్పొరేట్ ట్రస్టీ కంపెనీ (యూకే) వద్ద తాకట్టు పెట్టి ఈ నిధులు సమీకరించినట్టు వొడాఫోన్ గ్రూప్ తెలిపింది. శుక్రవారం ఈ లావాదేవీ పూర్తయినట్టు వెల్లడించింది.

## టెల్కోలకు అచ్చిరాని 2024

బెడిసికొట్టిన టారిఫ్స్ పెంపు వ్యూహం
గుడ్‌బై చెప్పిన 2.6 కోట్ల చందాదారులు
పొంచి ఉన్న 'శాట్‌కామ్' పోటీ
భారంగా మారిన పెట్టుబడులు



ఈ సంవత్సరం (2024) దేశంలోని మూడు ప్రైవేట్ టెలికాం కంపెనీలకు పెద్దగా కలిసి రాలేదు. 5జీ సేవల విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్పెక్ట్రమ్ కొనుగోలు కోసం కంపెనీలు దాదాపు రూ.70,200 కోట్లు ఖర్చు చేశాయి. లాభాలు కాపాడుకోవడంతో పాటు ఇందులో కొంతైనా రాబట్టుకునేందుకు ఈ ఏడాది జూలై నుంచి టారిఫ్‌లను 10 నుంచి 26 శాతం వరకు పెంచాయి. ఈ బాదుడు భరించలేక దాదాపు 2.6 కోట్ల మంది చందాదారులు రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు గుడ్‌బై చెప్పారు. వీరిలో 68 లక్షల మంది టారిఫ్‌లు ఏ మాత్రం పెంచని ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు మారిపోయారు. బీఎస్ఎన్ఎల్ ఇంకా 3జీ సేవలు అందించడంతో పాటు త్వరలో 4జీ సేవలకు సిద్ధం కావడం ఇందుకు ప్రధాన కారణం.

**పెట్టుబడులు తప్పవు:** చందాదారులు గుడ్‌బై చెబుతున్నా ప్రైవేట్ టెలికాం కంపెనీలకు కొత్త పెట్టుబడులు తప్పేలా లేవు. లేకపోతే మార్కెట్లో కొనసాగడం కష్టంగా మారనుంది. 5జీ సేవల విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసమే ఈ సంస్థలు 2022-27 మధ్య కాలంలో రూ.92,100 కోట్ల నుంచి రూ.1.41 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (డీఐపీఏ) డైరెక్టర్ జనరల్ మనోజ్ కుమార్ సింగ్ అంచనా.

**శాట్‌కామ్ సంస్థల నుంచి పోటీ:** ఇప్పటి వరకు దేశంలోని టెలికాం, బ్రాడ్‌బ్యాండ్ సేవలపై రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలదే గుత్తాధిపత్యం. వచ్చే ఏడాది నుంచి ఈ సంస్థలకు ఎలాన్ మస్క్ నాయకత్వంలోని స్టార్‌లింక్ వంటి ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ (శాట్‌కామ్) సంస్థల నుంచి ముఖ్యంగా డేటా బిజినెస్‌లో తీవ్ర పోటీ ఎదురు కానుంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ సంస్థలకు అవసరమైన స్పెక్ట్రమ్‌ను వేలం లేకుండా ట్రాయ్ సిఫారసు చేసిన ధరకు కేటాయిస్తామని ప్రకటించింది. ఇది అన్యాయమని టెల్కోలు గగ్గోలు పెట్టినా ప్రభుత్వం పట్టించుకునే స్థితిలో లేదు. ఈ శాట్‌కామ్‌ల సేవలు ప్రారంభమైతే డేటా బిజినెస్‌తో పాటు మారుమూల ప్రాంతాల్లోని జనాభాకు సైతం నిరంతరం టెలికాం సేవలు అందుబాటులోకి వస్తాయి. దీంతో మరో విడత టెలికాం రంగంలో టారిఫ్‌ల యుద్ధం ప్రారంభమై వొడాఫోన్ ఐడియా వంటి సంస్థల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

### బీఎస్ఎన్ఎల్‌లో మరో వీఆర్ఎస్!

ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్‌లో మరో విడత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఉన్న 55,000 మంది ఉద్యోగుల్లో 35 శాతం (సుమారు 18,000-19,000) మందిని ఈ వీఆర్ఎస్ ద్వారా ఇంటికి పంపించాలని భావిస్తున్నారు. ఇందుకోసం రూ.15,000 కోట్లు కేటాయించాలని కోరుతూ టెలికాం శాఖ (డాట్) ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు లేఖ రాసినట్టు సమాచారం. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ ఆదాయంలో 38 శాతం ఉద్యోగుల జీతభత్యాలకే పోతోంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వీఆర్ఎస్‌కు ఆమోదం తెలిపితే ఏటా జీతాల కోసం చేసే రూ.7,500 కోట్ల ఖర్చు.. రూ.5,000 కోట్లకు తగ్గుతుందని భావిస్తున్నారు. 2019లో అమలు చేసిన వీఆర్ఎస్ ద్వారా బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌కు చెందిన 93,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. అందుకోసం అప్పట్లో దాదాపు రూ.19,000 కోట్లు ఖర్చు చేశారు.

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 105 | విజయవాడ | 111 |
| వరంగల్ | 105 | గుంటూరు | 114 |
| కరీంనగర్ | 105 | ఒంగోలు | 114 |
| మహబూబ్‌నగర్ | 105 | చిత్తూరు | 100 |
| కర్నూలు | 105 | నెల్లూరు | 100 |
| విశాఖపట్నం | 110 | అనంతపురం | 100 |
| గోదావరి | 111 | | |

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 550 | విజయవాడ | 565 |
| వరంగల్ | 552 | గోదావరి | 565 |
| చిత్తూరు | 603 | విశాఖపట్నం | 600 |

డజను గుడ్లు రూ. 84

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 77,840 ▼ | 71,350 ▼ | 99,900 ▼ |
| విజయవాడ | 78,800 ▼ | 72,700 ▼ | 89,500 ▼ |
| విశాఖపట్నం | 76,710 ▼ | 70,320 ▼ | 88,890 ▼ |
| రాజమండ్రి | 77,840 ▼ | 71,350 ▼ | 90,900 ▼ |
| ప్రొద్దుటూరు | 78,650 ▼ | 72,830 ▼ | 89,800 ▼ |
| ముంబై | 76,436 | 70,015 | 87,831 |



# బహుమతులుగా పుస్తకాలిద్దాం

» గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు

» హైదరాబాద్ పుస్తక ప్రదర్శన సందర్శన

» మానవ నాగరికత ఉన్నంతవరకూ అచ్చు పుస్తకాలు వర్ధిల్లుతాయని వ్యాఖ్య

హైదరాబాద్ సిటీ, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మానవ నాగరికత ఉన్నంతవరకు అచ్చు పుస్తకాలు వర్ధిల్లుతాయని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. వివాహాది శుభకార్యాలు, పుట్టినరోజు వేడుకల సందర్భంగా పుష్పగుచ్ఛాలు వంటి వాటికన్నా, పుస్తకాలు బహూకరించడం మంచి సంప్రదాయమని, దాన్ని ఆచరిస్తే బాగుంటుందని సూచించారు. భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాలను సమన్వయం చేయగలిగిన శక్తి పుస్తకానికే ఉందని వ్యాఖ్యానించారు. చదువరుల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే, ఆ సమాజం అంత బాగా పురోగమిస్తుందని నొక్కిచెప్పారు. దోమల్‌గూడ, ఎన్టీఆర్ స్టేడియంలోని 37వ హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవాన్ని శనివారం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా రచయిత్రుల స్టాల్ అక్షరయాన్, అక్షరా బ్యాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ, తెలంగాణ గ్రంథాలయ శాఖ స్టాళ్లతో పాటు నేషనల్ బుక్ ట్రస్ట్, పబ్లికేషన్ డివిజన్, భూమి బుక్ ట్రస్ట్, నవచేతన స్టాళ్లలోని పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు 'భారత రాజ్యాంగం' ఆంగ్ల పుస్తకాన్ని భూమి బుక్‌ట్రస్ట్ నిర్వాహకులు బహూకరించారు. అనంతరం జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ అచ్చు పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకొని, కాగితపు సువాసనను ఆస్వాదిస్తూ, అక్షరాలను తడుముతూ చదువుతున్నప్పుడు కలిగే ఆనందం మాటలకు అందనిది అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అచ్చుపుస్తకం చదువుతున్నప్పుడు రచయిత నేరుగా మనతో సంభాషిస్తున్న భావన మన సొంతమవుతుంది అని అన్నారు. బుక్ ఫెయిర్ సొసైటీ కార్యవర్గ సభ్యులు ఏర్పాటు చేసిన పుస్తక సేకరణ నిధిని ఆయన ప్రారంభించారు. తద్వారా వచ్చిన పుస్తకాలను పల్లెగ్రంథాలయాలకు ఇవ్వనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు కవి యాకూబ్ చెప్పడంతో, మంచి విషయం అంటూ వారిని గవర్నర్ అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డా.రియాజ్, బుక్‌ఫెయిర్ ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్. వాసు పాల్గొన్నారు. జిష్ణుదేవ్‌వర్మను శాలువాతో సత్కరించారు.

### మండలి డిప్యూటీ చైర్మన్ సందర్శన

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ గత మూడు రోజులుగా హైదరాబాద్ పుస్తక మహోత్సవానికి వస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన్ను పలకరించగా, ఒకేరోజు 350 స్టాళ్లలోని పుస్తకాలను చూడడం సాధ్యం కాదని, రోజూ కొన్నిస్టాళ్లను పరిశీలిస్తూ, నచ్చిన పుస్తకాలు కొనుక్కుంటున్నానని చెప్పారు. పుస్తక పఠనం తన జీవితంలో భాగమని, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ప్రభావంతో సాహిత్యానికి తాను దగ్గరైనట్లు తెలిపారు.



విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేస్తున్న హరీశ్‌రావు

### దావత్‌లు బంద్ జేసి..

# హాస్టళ్లను దత్తత తీసుకోవాలి

» సంఘాలు, దాతలు ముందుకు రావాలి: హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్/హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దావత్‌లు, నూతన సంవత్సర వేడుకలను బంద్ చేసి, ప్రభుత్వ హాస్టళ్లను దత్తత తీసుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని నాసర్‌పుర అర్బన్ రెసిడెన్షియల్ బ్రిడ్జి స్కూలులోని విద్యార్థులకు పవన సుత యూత్ సేవా సమితి ఆధ్వర్యంలో హరీశ్ స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువజన సంఘాలు, యువతతో పాటు ప్రతి ఒక్కరూ ముందుకువచ్చి ప్రభుత్వ హాస్టల్లోని విద్యార్థులకు సాయమందించాలని సూచించారు. చలికాలం వల్ల హాస్టళ్లలోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని, విద్యార్థుల సమస్యలు తీర్చేందుకు వివిధ సంఘాలు, దాతలు ముందుకురావాలని కోరారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయని చేతలు గడప దాటడం లేదని ఎద్దేవా చేశారు. 'కంది రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్లు మద్దతు ధరపై 400 రూపాయలు బోనస్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి' అని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు.

### 'ఫార్ములా-ఈ రేస్'పై రాజకీయ ఆరోపణలే

» చెల్లింపుల్లో ఎలాంటి కుట్ర లేదు: జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): "ఫార్ములా-ఈ రేస్ నిర్వహణకు సంబంధించిన చెల్లింపుల్లో ఎలాంటి కుట్ర లేదు.. అవినీతి అంతకన్నా లేదు. ఏసీబీ ఆరోపణలపై మా నాయకుడు కేటీఆర్ సమాధానం ఇచ్చారు. ఈ అంశంలో రాజకీయ ఆరోపణలే తప్ప మరేం లేదు" అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. 'ఫార్ములా-ఈ రేస్ సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ లేకపోవడంతోనే స్పాన్సర్‌గా వ్యవహరించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో ఎటువంటి అవినీతి లేదని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు

### విద్యావ్యవస్థను పరిరక్షించాలి:గుత్తా సుఖేందర్

» నల్లగొండలో యూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభలు ప్రారంభం



నల్లగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థను పరిరక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) 6వ విద్యా, వైజ్ఞానిక మూడు రోజుల మహాసభలు శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్య ఉన్న చోటనే అభివృద్ధి ఉంటుందని, ఒక కుటుంబంలో ఒక్కరు విద్యావంతులైతే ఆ కుటుంబ సభ్యులందరూ అభివృద్ధి చెందుతారన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకుండా పోయాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విద్యావిధానాన్ని కాషాయీకరణం చేయడం సరికాదని పేర్కొన్నారు. సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులను గొప్ప పౌరులుగా, సమాజ మార్పునకు కృషి చేసేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ.. దేశంలో పాలకులు అవలంబిస్తున్న అసంబద్ధమైన విధానాలతో సమాజంలో అంతరాలు పెరుగుతున్నా యన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. ఇన్‌చార్జీల పాలనలో ఉన్న విద్యా వ్యవస్థను సరిదిద్దాలని డిమాండ్ చేశారు.

# మానవ హక్కుల నేత గొర్రెపాటి కన్నుమూత

## విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలవైపు.. నాలుగు దశాబ్దాల అలుపెరుగని పోరాటం

» నేడు అంతిమయాత్ర.. మృతదేహం ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగింత

సుభాష్‌నగర్ (నిజామాబాద్), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల ఉద్యమ నేత గొర్రెపాటి మాధవరావు (67) శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య మీనా సహాని, కుమార్తెలు మానస, మధుమిత ఉన్నారు. గొర్రెపాటి ఏపీలోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా గురునాథపాలెంలో 1957 మార్చి 4న జన్మించారు. అదే సంవత్సరం ఆయన తల్లిదండ్రులు తెలంగాణకు వలసవచ్చి నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామంలో స్థిరపడ్డారు. దాంతో ఆయన ఇంటర్మీడియేట్ వరకు నిజామాబాద్ జిల్లాలో, తర్వాత హైదరాబాద్‌లో చదువుకున్నారు. విద్యార్థి దశ నుంచి విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులైన ఆయన నాలుగు దశాబ్దాల పాటు మానవ హక్కుల రంగంలో అలుపెరగని పోరాటం చేశారు. రాజ్యహింస ఎక్కడ జరిగినా ఎదిరించడంలో గొర్రెపాటి ముందుండేవారు. విప్లవ సాహిత్యంపై మక్కువతో రచనలు, అనువాదాలు చేశారు. 'ఉపా'లాంటి వివాదాస్పద చట్టాలపై విలువైన వ్యాసాలు రాశారు. చట్టాల్లోని సంక్లిష్టమైన అంశాలు సామాన్యులకు సైతం అర్థమయ్యేలా రచనలు చేశారు. న్యాయవాద వృత్తిలో సైతం రాణించారు. తెలంగాణ ఉద్యమంలో కేసులు ఎదుర్కొన్న విద్యార్థుల తరఫున ఉచితంగా వాదించారు. మూడు ఎన్‌కౌంటర్లలో పోలీసులు, ప్రభుత్వంపై కేసులు వేసి గెలిచి.. బాధితులకు నష్టపరిహారం వచ్చేలా చేశారు. నిజామాబాద్ ద్వారకానగర్‌లో గుడిసెవాసుల తరఫున వాదించి వారికి ఇళ్ల పట్టాలు ఇప్పించారు. తెలంగాణ యూనివర్సిటీలో న్యాయశాస్త్ర విద్యార్థులకు బోధించారు. మొదట ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘంలో పనిచేసిన ఆయన తర్వాత మానవ హక్కుల వేదిక వ్యవస్థాపక సభ్యుడిగా, రెండుసార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు.



గొర్రెపాటి మాధవరావు (ఫైల్)

### నేత్ర, శరీరదానం

గొర్రెపాటి భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం నిజామాబాద్ ఎల్లమ్మగుట్టలోని ఆయన నివాసంలో ఉంచారు. ఆదివారం ఆయన అంతిమయాత్ర నిర్వహించనున్నారు. కుటుంబ సభ్యులు ఆయన కోరిక మేరకు ఆయన మృతదేహాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలకు అందజేయనున్నారు. ఆయన నేత్రాలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేకరించారు. గొర్రెపాటి మృతికి మానవహక్కుల వేదిక, పలువురు వామపక్ష నాయకులు, న్యాయవాదులు సంతాపం తెలిపారు.

# 7న విచారణకు రండి

(మొదటిపేజీ తరువాయి)

విచారణకు హాజరు కావాలని ఈడీ అధికారులు సమన్లు జారీ చేశారు. కేటీఆర్ తదితరులపై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే ఈ నెల 20న అధికారులు కేటీఆర్‌ను ఏ1గా, అర్వింద కుమార్‌ను ఏ2గా, బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా పేర్కొంటూ మనీ లాండరింగ్, ఫెమా చట్టాల కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు(ఈసీఐఆర్) నమోదు చేశారు. ఆ తర్వాత పరిణామాల్లో తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయడంతో ఈడీ మెల్లిగా ఆధారాల సేకరణ ప్రారంభించింది. విదేశాలకు డబ్బు బదిలీ చేసిన హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారులను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో ఫిర్యాదు దారుడైన పురపాలక శాఖ కార్యదర్శి దాన కిషోర్ ఏసీబీకి ఇచ్చిన ఫిర్యాదు కాపీని, ఆయన ఏసీబీకి ఇచ్చిన వాంగ్మూలాన్ని సేకరించారు. బ్రిటన్‌కు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్(ఎఫ్ఈఓ) సంస్థతో నాటి పురపాలక శాఖ ఒప్పందం చేసుకుంటే హెచ్ఎండీఏ జనరల్ ఖాతా నుంచి డబ్బు ఎందుకు పంపించాల్సి వచ్చింది? విదేశీ కంపెనీతో ఒప్పందాలు జరిగినపుడు తీసుకోవాల్సిన అనుమతులు తీసుకున్నారా? విదేశీ కరెన్సీలో రెండు విడతలుగా రూ.45,71,60,625కోట్లు చెల్లింపు చేసినపుడు రిజర్వ్ బ్యాంక్ అనుమతులు తీసుకున్నారా లేదా అనే కోణంలోనూ ఈడీ అధికారులు వివరాలు సేకరించారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్ సందర్భంగా దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో... ఫార్ములా ఈ కారు రేసు ప్రాజెక్టు ఒప్పందంలో నిబంధనలు తుంగలో తొక్కారని, కేబినెట్, ఆర్థిక శాఖ, గవర్నర్ అనుమతులు లేకుండా కేటీఆర్ ఆదేశాల మేరకు నిధులను విదేశీ కంపెనీకి చెల్లించారని... ఏసీబీ స్పష్టం చేసింది. వీటికి సంబంధించిన అన్ని పత్రాలను ఇప్పటికే ఈడీ అధికారులు సేకరించి పెట్టుకున్నారు.



### పక్కా ఆధారాలతోనే కేటీఆర్ విచారణ

అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి విచారణలో చెప్పిన అంశాల ఆధారంగా ఈడీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించనున్నారు. ఈడీ అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు కేటీఆర్ ఆధారాలతో కాదు అని చెప్పాల్సి ఉంటుంది. అందుకే, ఈడీ అధికారులు అటు ఏసీబీ నుంచి ఇటు పురపాలక శాఖ నుంచి రిజర్వ్ బ్యాంకు నుంచి కూడా సమాచారాన్ని సేకరించి పెట్టుకున్నారని తెలుస్తోంది.

### వ్యూహాత్మకంగానే ముందు అర్వింద్ కుమార్ విచారణ

నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చెప్పినట్లే చేశానని ఇప్పటికే తెలంగాణ సీఎస్ శాంతికుమారికి రాతపూర్వకంగా జవాబు ఇచ్చిన అర్వింద్ కుమార్‌ను కేటీఆర్ కన్నా ముందే విచారించడానికి సమన్లు జారీ చేయడం వ్యూహాత్మకమే. కేటీఆర్ చెప్పినట్లు చేసినందుకు తాను చిక్కుల్లో ఇరుక్కున్నానని, తనను బయట పడేయాలని అర్వింద్ కుమార్ ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకు పైరవీలు చేస్తున్న క్రమంలో ఆయన్ను విచారిస్తే కేసు స్వరూపం పూర్తిగా అర్థం చేసుకోవచ్చునని, అన్ని ఆధారాలు సేకరించిన తర్వాత వాటి ఆధారంగా కేటీఆర్‌ను ప్రశ్నించవచ్చుని ఈడీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని సరోజినీనగర్ సింగిల్ రూంలో జీవితాన్ని ప్రారంభించిన బిహారీ ఐఏఎస్ అర్వింద్ కుమార్ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పెద్ద మొత్తంలో ఆస్తులు సంపాదించారని ఆరోపణలున్నాయి. ఫార్ములా ఈ కారు రేసు సెకండ్ దఫా కార్యక్రమం నుంచి ప్రమోటర్ తప్పుకోవడంతో ఎఫ్ఈఓ కంపెనీ ప్రతినిధులు ముందుగా అర్వింద్ కుమార్‌తోనే ఫోన్, ఈ మెయిల్ ద్వారా సంభాషణలు జరిపారు. తెలంగాణ ప్రభుత్వమే ప్రమోటర్ బాధ్యతలు స్వీకరించేలా చూడాలని ఆయన్ని కోరారు. తర్వాత అర్వింద్ కుమార్ ఈ విషయాన్ని కేటీఆర్‌కు చేరవేశారు. కేటీఆర్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో గత ఏడాది సెప్టెంబర్ 27న ఫార్ములా ఇ రేసుకు సంబంధించి ఫైల్‌ను తయారు చేసి ఆయన దగ్గరకు పంపారు. సెప్టెంబరు 27న పురపాలక శాఖ నుంచి మంత్రి కేటీఆర్ దగ్గరకు ఫైల్ వెళితే అంతకు రెండు రోజుల ముందే ఎఫ్ఈఓ నుంచి అంటే 25వ తేదీనే 22.7 కోట్ల రూపాయలు చెల్లించాలని కోరుతూ ఇన్‌వాయిస్ హెచ్ఎండీఏకి అందింది. మరో నాలుగు రోజుల్లో రూ.23 కోట్ల చెల్లింపుల కోసం ఎఫ్ఈఓ నుంచి మరో ఇన్‌వాయిస్ అందింది. అప్పటికి ఇంకా పురపాలక శాఖకు ఎఫ్ఈఓకు మధ్య ఒప్పందమే జరుగలేదు. ఫోన్‌లోనే ఆదేశాలొచ్చాయి. ఫైల్ కదిలిన తర్వాత కేటీఆర్ నుంచి ఫోన్‌లో వచ్చిన సందేశం ఆధారంగా హెచ్ఎండీఏ నిధుల నుంచి చెల్లింపులు జరిగాయి. ఈ క్రమంలో అరవిందకుమార్, కేటీఆర్, బీఎల్ఎన్ రెడ్డిల ఫోన్ సంభాషణలు, వాట్సాప్ చాట్ లు ఈ కేసులో కీలక ఆధారాలుగా మారాయి. దీంతో వీరి ముగ్గురి ఫోన్లను ఈడీ అధికారులు సీజ్ చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. మంత్రి కేటీఆర్ చెప్పారని అర్వింద్ కుమార్ ఆదేశిస్తేనే తాను రెండు ఇన్ వాయిస్‌లకు సంబంధించి నిధుల విడుదలకు అనుమతి ఇచ్చానని హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఇప్పటికే అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.



ఢిల్లీ పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కె.విరహత్ ఆలీ

### నేటి రాజకీయాల్లో అంతరిస్తున్న నైతిక విలువలు

#### మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

బర్కత్‌పుర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేటి రాజకీయాల్లో నైతిక విలువలు అంతరించిపోతున్నాయని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. రాజకీయ నాయకులు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొందని, గతంలో ఈ పద్ధతి ఉండేది కాదని పేర్కొన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బై ది పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 26న హైదరాబాద్ నుంచి ఢిల్లీకి నిర్వహించనున్న పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఉమ్మడి ఏపీ లోకాయుక్త విశ్రాంత జడ్జి వి.లక్ష్మణరెడ్డి తదితరులతో కలిసి గుమ్మడి నర్సయ్య ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయ నాయకులు ఒక పార్టీలో గెలిచి పదవుల కోసం మరో పార్టీలో చేరుతున్నారని దుయ్యబట్టారు. గతంలో కేసీఆర్ ఫిరాయింపులను ప్రోత్సహించారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆయన విమర్శించారు. జస్టిస్ వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ, రాజకీయ నాయకులు పార్టీలు మారుతూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. విశ్రాంత చీఫ్ సెక్రటరీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, సమాజంలో అరాచకత్వం బాగా పెరిగిపోయిందని విమర్శించారు. ఒక రాజకీయ నాయకుడికి ఒక పెన్షన్, పార్టీ మారే ముందు పదవికి రాజీనామా తదితర డిమాండ్లతో వచ్చే జనవరి 26న హైదరాబాద్ నుంచి ఢిల్లీకి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు బై ది పీపుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు, పాదయాత్ర నిర్వాహకుడు వి.గణేశ్ తెలిపారు.

### కాళేశ్వరం 'ఓ అండ్ ఎం' దైవాధీనం!

ఆ ప్రాజెక్టు కార్పొరేషన్ ఖాతాలో నిధులు నిల్

బిల్లుల కోసం వర్క్స్ అకౌంట్స్ డైరెక్టర్ లేఖలు

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు 'ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం)' బిల్లుల వ్యవహారం డైలమాలో పడింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి, రుణాలు సమీకరించడానికి ప్రభుత్వం ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు పూర్తయితే దాని ద్వారా వచ్చే ఆదాయంతో తిరిగి చెల్లిస్తామన్న పూచీతో రుణాలు సమీకరించారు. అయితే ప్రాజెక్టు హెడ్‌వర్క్ ఒకటే పూర్తయింది. ఇందులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టగా వాటి నుంచి రెండేళ్లుగా పంపింగ్ జరగడం లేదు. 2022 జూలై వరదలకు కన్నెపల్లి (మేడిగడ్డ) పంప్‌హౌస్ రక్షణ గోడ కూలి అదనపు టీఎంసీ కోసం తెచ్చిన పంపులు దెబ్బతిన్నాయి. సిరిపురం(అన్నారం) పంప్‌హౌస్‌ను వరద ముంచెత్తడంతో మోటార్లన్నీ నీట మునగడమే కాక కీలకమైన ప్యానల్ బోర్డు కూడా దెబ్బతింది. 2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రంలో కట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మాత్రమే ఆదాయం వస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు కార్పొరేషన్ ఖాతాలో నిధులు లేకపోవడంతో ఓ అండ్ ఎం బిల్లుల కోసం అధికారులు ప్రభుత్వంవైపు చూస్తున్నారు. బిల్లులు చెల్లించాలని వర్క్స్ అకౌంట్స్ డైరెక్టర్‌కు ఈ నెల 13, 16, 21న లేఖలు రాశారు. ఈ బిల్లులను గతంలో కాళేశ్వరం కార్పొరేషన్ నుంచి చెల్లించడంతో ఇప్పుడు బడ్జెట్ నుంచి చెల్లించాలా, వద్దా అనేది నివృత్తి చేయాలని వర్క్స్ అకౌంట్స్ డైరెక్టర్ వీ ఫణిభూషణ్ శర్మ ఈఎన్‌సీ (జనరల్)కు లేఖ రాశారు. ప్రధానంగా పంప్‌హౌస్‌ల నిర్వహణ, ప్రాజెక్టుల్లో నిరంతర పనులను ఓ అండ్ ఎం కింద చేరుస్తారు. ప్రస్తుతం ఆ బిల్లులు కూడా విడుదలయ్యే అవకాశం లేకపోవడంతో సందిగ్ధత నెలకొంది.

### డిసెంబరు 31 వేడుకల నేపథ్యంలో మద్యం షాపుల్లో భారీగా నిల్వలు

» ఈనెలలో ఆబ్కారీకి రూ.3,500 కోట్లు

» మరో 600 కోట్లు వస్తుందని అంచనా

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 31 అంటేనే.. మద్యం ప్రియులకు పండుగే పండుగ.. వారిని సంతృప్తి పరిచేందుకు మద్యం దుకాణాల నిర్వాహకులు డిపోల నుంచి భారీగా మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. షాపులను పూర్తి నిల్వలతో నింపేస్తున్నారు. మంగళవారం రాత్రి కొత్త సంవత్సర వేడుకలు అంటే ఆదివారం నుంచే కొనుగోళ్లు పెరుగుతాయని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు ఉండగా.. 19 మద్యం డిపోల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఈనెలలో ఇప్పటివరకు ఆబ్కారీ శాఖ రూ.3,500 కోట్లు ఆర్జించింది. ఆదివారం విక్రయాలు కూడా పూర్తయితే.. సోమ, మంగళవారాల్లో రూ.600 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2022 డిసెంబరు నెలలో రూ.3,100 కోట్లు ఆర్జించగా.. గతేడాది అదే నెలలో రూ.4,100 కోట్ల దాకా వచ్చాయి. ఈసారి ఆ రికార్డు బ్రేక్ అవుతుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

# 15,791 అరెస్టులు 50వేలకుపైగా కేసులు

## 2024లో డ్రగ్స్, గుడుంబా విక్రేతలపై ఉక్కుపాదం .. డ్రగ్స్ హాట్‌స్పాట్‌లుగా ధూల్‌పేట, ఐటీ కారిడార్ నానక్‌రాంగూడ

» న్యూఇయర్ వేడుకలపై ప్రత్యేక దృష్టి

» జీహెచ్ఎంసీ పరిధిలో 40 బృందాలు

» డ్రగ్స్ కేసులో రాజ్‌పాకాలపై చార్జిషీట్!

» ఎక్సైజ్ ఈడీ కమలాసన్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత తెలంగాణ సాధించాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో అరెస్టులు చేస్తున్నామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ బీవీ కమలాసన్ రెడ్డి అన్నారు. అక్రమ మద్యం, నిషేధిత మాదక ద్రవ్యాలు, గుడుంబా తయారీదారులు, విక్రయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా 50వేలకు పైగా కేసులు నమోదు చేశామని, 15,791 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. ఈ ఏడాది ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలకు సంబంధించిన వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కమలాసన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలు చేసిన 13,336 మందిని, అక్రమ మద్యం, డ్రగ్స్ సరఫరా కేసుల్లో 2455 మంది.. మొత్తం 15,791 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. అంతకు ముందు రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈసారి అరెస్టులు పెద్దఎత్తున జరిగాయని వివరించారు. గుడుంబా, అక్రమ మద్యం సరఫరాదారుల్లో 920 మంది తరచూ ఇవే నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని, వీరిపై ప్రత్యేక నిఘా ఉంచామని పేర్కొన్నారు. అరెస్టు చేసినవారిలో శిక్ష పడేవారు 3శాతంలోపే అన్నారు. శిక్షలకు సంబంధించిన భయం లేకపోవడంతో ఇదే నేరాలు చేస్తున్నారు. దీనిని పెంచేందుకు ఆధారాల సేకరణ, సీజర్ పంచనామాలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునేలా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని కమలాసన్ రెడ్డి అన్నారు. ఈ ఏడాదిలో రూ.48.54 కోట్ల విలువగల 20904 కేజీల గంజాయి, మత్తు పదార్థాలను ధ్వంసం చేశామని, రూ.12.22 కోట్ల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

### ఏపీ నుంచి పెద్దఎత్తున గుడుంబా!

ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి గుడుంబా రాష్ట్రానికి పెద్దఎత్తున సరఫరా అవుతోందని, ఇప్పటికే అక్కడి పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి పెద్దఎత్తున గుడుంబా స్థావరాలను ధ్వంసం చేశామని కమలాసన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని 92 మండలాలు, 25 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో గుడుంబా తయారీ ఎక్కువగా జరుగుతోందన్నారు. డిస్టిలరీ ప్లాంట్ల నుంచి మద్యం అక్రమంగా బయటకు వస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీనిని అడ్డుకునేందుకు అన్ని పాయింట్ల వద్ద ఏఐ అనుసంధానంతో ఉన్న సీసీటీవి కెమెరాలు ఏర్పాటుచేశామని, వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేశామన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల తన ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ అక్రమ మద్యం వినియోగం ఆరోపణలకు సంబంధించి విచారణ సాగుతోందని, త్వరలో చార్జిషీటు దాఖలు చేస్తామని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ధూల్‌పేటతోపాటు ఐటీ కారిడార్ నానక్‌రాంగూడ డ్రగ్స్ విక్రయాలకు హాట్‌స్పాట్‌గా మారిందన్నారు. ఆపరేషన్ ధూల్‌పేట పేరుతో ఇప్పటికే అనేకమందిని అరెస్టు చేశామని, నానక్‌రాంగూడలో తనిఖీలకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగం, డగ్స్ వాడకం, అమ్మకాలు రవాణాపై ఎక్సైజ్, నార్కొటిక్, పోలీసు అధికారులతో 40 బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో పోలీసు, నార్కొటిక్ అధికారులతో కలిసి 17 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని అడ్డుకునేందుకు పబ్బులు, బార్లలో తనిఖీలు చేస్తామని కమలాసన్ రెడ్డి పేర్కొన్నారు.

# ఆత్మహత్యపై శ్రుతి, నిఖిల్ వాట్సాప్ చాటింగ్!

## మూకుమ్మడి ఆత్మహత్యల కేసులో మృతుల కాల్ డేటా, వాట్సాప్‌లో కీలక విషయాలు!

» ప్రేమ వ్యవహారమే కారణమని అంచనా

» సాయికుమార్, నిఖిల్ కలిసి కామారెడ్డి బస్టాండ్‌కు..

» శ్రుతిని పికప్ చేసుకుని చెరువు వద్దకు

» ఘటనా స్థలం వద్ద సీన్ రీకన్‌స్ట్రక్షన్

కామారెడ్డి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట మహిళా కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సొసైటీ కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ మూకుమ్మడి ఆత్మహత్యపై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మృతుల ఫోన్‌కాల్స్, వాట్సాప్ చాటింగ్ ద్వారా పోలీసులకు ప్రాథమికంగా లభ్యమైన కీలక అంశాల ఆధారంగా ఆత్మహత్యలపై శనివారం సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఘటనా స్థలమైన అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువును దర్యాప్తు బృందం పరిశీలించింది. చెరువు వద్దకు సాయికుమార్, శ్రుతి, నిఖిల్ ఏ సమయంలో చేరుకున్నారు? మొదట చెరువులోకి ఎవరు దూకారు? అనే దానిపై దర్యాప్తు బృందం సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసింది. చెరువు నుంచి నీటి నమూనాలు సేకరించింది. ఆ తర్వాత బీబీపేట, భిక్కనూరు పోలీస్ స్టేషన్లకు వెళ్లింది. అక్కడి సిబ్బందిని విచారణ చేసింది. అక్కడా సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసింది. ఈ దర్యాప్తులో పలు కీలకాంశాలు తెలిసినట్లు సమాచారం.



అడ్లూర్ చెరువు వద్ద సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్న పోలీసులు

ఈ నెల 25న ఉదయం 11.45 గంటల సమయంలో సాయికుమార్ సొంత కారులో భిక్కనూరు టోల్‌గేట్ నుంచి కామారెడ్డి వైపు రావడాన్ని పోలీసులు గుర్తించారు. ఆ సమయంలో కారులో అతను ఒక్కడే ఉన్నాడు. జంగంపల్లిలోని ఓ దాబా వద్ద కారు ఆపాడు. అదే ప్రాంతంలో నిఖిల్ బైక్ నిలిపి ఉన్నట్లు గుర్తించారు. వీరిద్దరూ కలిసి కారులో కామారెడ్డి బస్టాండ్‌కు వెళ్లి... శ్రుతిని తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ దృశ్యాలను బస్టాండ్ సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీ నుంచి పోలీసులు సేకరించారని సమాచారం. వీరు ఆ రోజు సాయంత్రం 4 గంటల సమయంలో అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువుకు చేరుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

### ముగ్గురి కాల్ డేటా పరిశీలన

మృతుల ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని ఐటీ నిపుణుల సహాయంతో ఓపెన్ చేశారు. ముగ్గురు మృతుల కాల్‌డేటాను సేకరించి, సంభాషణను దర్యాప్తు బృందం పరిశీలించినట్లు తెలిసింది. ఆత్మహత్యకు ముందు కొన్ని రోజులుగా శ్రుతి, నిఖిల్ ఫోన్‌లో గంటల కొద్దీ మాట్లాడే క్రమంలో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఆత్మహత్యపై శ్రుతి, నిఖిల్ ముందుగానే వాట్సాప్‌లో చాటింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారని సమాచారం. వీరి ఆత్మహత్యలకు ప్రేమ, పెళ్లి ప్రధాన కారణమని ఫోన్ కాల్స్, వాట్సాప్ చాటింగ్ ఆధారంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆత్మహత్యకు ముందే శ్రుతి, నిఖిల్ ఓ ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. ఇందులోకి ఎస్సైను కూడా లాగినట్లు ప్రచారం జరుగుతోంది. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద కారులో మాట్లాడుకుంటుండగానే నిఖిల్, శ్రుతి చెరువు గట్టువైపు వెళ్లి చెరువులో దూకారని, వారిని కాపాడే ప్రయత్నంలో సాయికుమార్ కూడా చెరువులో దూకాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. వీరు దూకిన చోట 15 మీటర్ల వరకు లోతు ఉండడం, పిచ్చిమొక్కలు, తీగల్లో ఇరుక్కుపోయి మృతిచెందారని పోలీసులు భావిస్తున్నారు. నిఖిల్ స్నేహితులను సైతం ఆరా తీశారు. వారితో నిఖిల్ ఎప్పుడైనా శ్రుతితో ప్రేమ వ్యవహారం, ఎస్సైతో ఉన్న సంబంధాలపై చర్చించాడా? అని విచారణ చేస్తున్నారు.

## 30న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

» మన్మోహన్‌కు సంతాపం తెలపనున్న సభ

» మంత్రి మండలి భేటీ వాయిదాకు నిర్ణయం

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం నేపథ్యంలో ఈ నెల 30న తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. మన్మోహన్‌సింగ్ మరణం పట్ల సంతాపం తెలియజేయడం కోసం ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. అలాగే, రాష్ట్రంలో ప్రస్తుతం సంతాపదినాలు కొనసాగుతున్న క్రమంలో 30న నిర్వహించాల్సిన కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేశారు.

## జనవరి 20న దావో‌స్‌కు సీఎం రేవంత్

» ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరు

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు భారీ పెట్టుబడులే లక్ష్యంగా వచ్చే నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన చేయనున్నారు. ప్రతీ ఏటా జనవరిలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం పాల్గొననున్నారు. జనవరి 20 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న ఈ సదస్సులో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా పాల్గొంటారు. ఈ సదస్సులో 50కి పైగా దేశాల నుంచి ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొంటారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలున్న రంగాలను పేర్కొనడంతోపాటు విదేశీ పెట్టుబడులు ఆకర్షించేందుకు దావోస్ సమావేశాల్లో 'తెలంగాణ పెవీలియన్' పేరుతో ప్రత్యేక పెట్టుబడుల సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

## పేదల పెన్నిధి పీజేఆర్: సీఎం రేవంత్



హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు అన్ని వేళలా అండగా నిలిచిన వ్యక్తి దివంగత మాజీ మంత్రి పి.జనార్దన్ రెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. పీజేఆర్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1994 నుంచి 1999 వరకు సీఎల్పీ నేతగా పని చేసిన పీజేఆర్.. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడారని, తెలంగాణ వాదానికి గొంతుకగా నిలిచారని సీఎం గుర్తు చేశారు.

## బీసీలతో కవితకు ఏం సంబంధం?

» ఆమె నాయకత్వం బీసీలకు అవసరం లేదు: ఆది శ్రీనివాస్

» మన్మోహన్‌ను భారతరత్నతో గౌరవించాలి: జీవన్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై హడావుడి చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు అసలు బీసీలతో ఏం సంబంధమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీసీల గురించి ఏనాడైనా కవిత మాట్లాడారా అంటూ శనివారం ఓ ప్రకటనలో నిలదీశారు. ఆమె నాయకత్వం బీసీలకు అవసరం లేదన్నారు. జనవరి 3న సభ నిర్వహిస్తామని కవిత అంటున్నారని, బీసీల సభ నిర్వహించడానికి ఆమె ఎవరని ప్రశ్నించారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. సీఎల్పీ మీడియా హాల్లో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని రైతుల రుణాలను ఏకమొత్తంగా మాఫీ చేసింది, ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టాలను తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం చేసిందీ మన్మోహనేనని.. హైదరాబాద్‌కు మెట్రో రైల్ రావడంలోనూ ఆయన పాత్ర ఉందని చెప్పారు.

## రాష్ట్రానికి ఎఫ్‌డీఐల వెల్లువ

» గత ఏడాదితో పోలిస్తే 33 శాతం వృద్ధి

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) ప్రవాహం గణనీయంగా పెరిగింది. 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్య ఆరు నెలల కాలంలో రాష్ట్రానికి రూ. 12,864 కోట్లు వచ్చాయి. గత ఏడాది ఇదే వ్యవధిలో రూ.9,679 కోట్లు వచ్చాయి. గత ఏడాదితో పోలిస్తే రూ. 3,185 కోట్లు అధికంగా రాగా.. వృద్ధి రేటు దాదాపు 33 శాతంగా నమోదైందని కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య విభాగం తెలిపింది. ఈ గణాంకాలను కేంద్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం ఈ ఆరు నెలల పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో తెలంగాణ దేశంలో ఆరో స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ, తమిళనాడు మొదటి అయిదు స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్రానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలలో దాదాపు 93 శాతం హైదరాబాద్‌కే వచ్చాయి. రాష్ట్ర రాజధానికి రూ.11,970 కోట్లు, రంగారెడ్డి జిల్లాకు రూ.680.5కోట్లు, మహబూబ్‌నగర్‌కు రూ.116.7కోట్లు, మెదక్‌కు 96.99 కోట్లు వచ్చాయి.

## ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చాల్సిందే

» భువనగిరి ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల నిరసన

భువనగిరి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ అవార్డు విచారణ సమావేశాన్ని భూ నిర్వాసిత రైతులు మూకుమ్మడిగా బహిష్కరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి ఆర్డీవో కార్యాలయంలో భువనగిరి మండలంలోని తుక్కాపురం, ఎర్రంబెల్లి గ్రామాల రైతులకు సంబంధించి అవార్డు విచారణ సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. రైతులు ఈ సమావేశానికి హాజరు కాకుండా ఆర్డీవో కార్యాలయం బయటే ఉండి నిరసన తెలిపారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం భూములను సేకరించాలని డిమాండ్ చేశారు. అవార్డు విచారణ సమావేశం నిర్వహించేందుకు భువనగిరి ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకోగా, భూ నిర్వాసితులు గంటసేపు ఆందోళన చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. నిర్దేశిత సమయం మధ్యాహ్నం ఒంటిగంట వరకు రైతులు హాజరుకాలేదు. అప్పటి వరకు వేచివున్న ఆర్డీవో కృష్ణారెడ్డి అనంతరం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన భువనగిరి మండలం పెంచికల్‌పహాడ్, రాయిగిరి గ్రామాల నిర్వాసితులతో అవార్డు సమావేశం ఉంటుందని, రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం, తమ భూములు, కట్టడాల వివరాలతో హాజరుకావాలన్నారు.

## వెంకట్రామిరెడ్డి కమిషన్ నివేదికను బయటపెట్టాలి

» వీహెచ్‌పీ ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్

పంజాగుట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల భూములలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, జస్టిస్ వెంకట్రామి రెడ్డి కమిషన్ నివేదికను బయటపెట్టాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నియంత్రణ నుంచి దేవాలయాలకు స్వేచ్ఛ కల్పించాలని, అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో దేవాలయాల భూములను విడిపించడానికి జనవరి 5 నుంచి జాగరణ్ అభియాన్ యాత్రను విజయవాడ నుంచి చేపడుతున్నామని తెలిపారు.

## ఫార్మా విలేజికి స్థలాలిచ్చిన రైతులకు స్టాంప్ డ్యూటీ మినహాయింపు

» రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కందుకూరు, యాచారం మండలాల్లో గ్రీన్ ఫార్మా విలేజీ ఏర్పాటు కోసం స్థలాలిచ్చిన రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సదరు రైతులకు ఇచ్చే ప్లాట్ల రిజిస్ట్రేషన్ సమయంలో స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలను మినహాయించింది. కందుకూరు మండలంలో 1553, యాచారం మండలంలో 3740 మంది రైతులు ఫార్మా విలేజీ కోసం స్థలాలిచ్చారు. వీళ్లకి ప్రభుత్వం నివాస స్థలాలు కేటాయించింది. డ్రా పద్ధతిలో ఆ ప్లాట్లను కేటాయించనుంది. అయితే, ఈ ప్లాట్ల రిజిస్ట్రేషన్ సమయంలో ఆయా రైతుల నుంచి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు వసూలు చేయరు. ఇందుకు సంబంధించిన రూ.26.14 కోట్ల స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలను మినహాయించాలని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదేశించింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఆర్ఆర్ఆర్.. రైట్ రైట్



(మొదటిపేజీ తరువాయి)

మొదలుపెట్టినప్పటి నుంచి రెండేళ్ల కాలంలోనే పనులను పూర్తిచేయాలని, ఆ తరువాత 5ఏళ్ల రహదారి మెయింట్‌నెన్స్ కూడా చేయాలని నోటీసులో పొందుపరిచింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం రహదారిని ఈపీసీ విధానంలో నిర్మిస్తారనే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. ఈ ఏడాది నవంబరు 17న 'ఆర్ఆర్ఆర్ దారి ఇలా' శీర్షికన కథనాన్ని ప్రచురించింది.

### 5 ప్యాకేజీలుగా రోడ్డు నిర్మాణం..

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం నిర్మాణ పనులను 5 ప్యాకేజీల్లో నిర్మించేందుకు ఎన్‌హెచ్ఏఐ టెండర్లలో పేర్కొంది. టెండర్ నోటీసుల ప్రకారం.. మొదటి ప్యాకేజీ గిర్మాపూర్ గ్రామం నుంచి మొదలై రెడ్డిపల్లి గ్రామం వరకు 34.518 కిలోమీటర్లు ఉంటుంది. దీని నిర్మాణానికి రూ.1,529.19 కోట్లు అవుతుందని తెలుపుతూ టెండర్లను ఆహ్వానించింది. రెండో ప్యాకేజీ రెడ్డిపల్లి గ్రామం నుంచి ఇస్లామాపూర్ వరకు 26 కిలోమీటర్లు ఉంటుంది. దీనికి రూ.1,114.80 కోట్లతో టెండర్లను ఆహ్వానించారు. మూడో ప్యాకేజీ ఇస్లామాపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు 23 కి.మీ ఉండగా, ఇందుకు రూ.1,184.81 కోట్లతో టెండర్లను పిలిచారు. నాలుగో ప్యాకేజీ ప్రజ్ఞాపూర్ నుంచి రాయగిరి వరకు 43 కిలోమీటర్ల నిర్మాణానికి రూ.1,728.22కోట్లతో టెండర్లను ఆహ్వానించారు. ఇక ఐదో ప్యాకేజీ కింద రాయగిరి నుంచి తంగడ్‌పల్లె గ్రామం వరకు 35 కిలోమీటర్లు ఉంటుంది. దీని నిర్మాణానికి రూ.1,547.04 కోట్లతో టెండర్లను పిలిచారు. అన్ని ప్యాకేజీల పనులు ప్రారంభమైన నాటి నుంచి రెండేళ్ల కాలంలో పూర్తి చేయాలని సూచించింది. ఇక ప్రతిపాదించిన ధరల్లోనే యుటిలిటీ షిఫ్టింగ్ చార్జీలను కూడా కలిపినట్టు తెలిపింది.

### పూర్తికాని భూ సేకరణ..

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం నిర్మాణానికి ఓవైపు టెండర్లను ఆహ్వానించినా.. ఈ మార్గం నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ భాగం నిర్మాణానికి మొత్తం 1895 హెక్టార్ల భూమి అవసరమవుతుండగా.. 1862 హెక్టార్లకు 3డీ నోటిఫికేషన్‌ను (భూమిని సేకరించే ఉద్దేశ ప్రకటన) జారీ చేశారు. మొత్తం భూ సేకరణలో ఇప్పటివరకు 90-95 శాతం పూర్తయింది. ఇందులో 1320 హెక్టార్లకు అవార్డుల ప్రకటన జారీ చేయాల్సి ఉంది. మరో 427 హెక్టార్లకు సంబంధించి అవార్డుల విచారణ జరుగుతోంది. పలు జిల్లాల పరిధిలోని కొన్ని భూముల అంశం కోర్టుల్లో ఉండడంతో.. వీటి విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తేలలేదు. పైగా అవార్డులు జారీ చేసి, విచారణ జరుగుతున్న భూముల పరిహారం విషయంలోనూ ఒక స్పష్టత రావాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో భూముల సేకరణకు ఇచ్చిన ఉత్తర్వులతో తక్కువ ధరకు భూములను కోల్పోవాల్సి వస్తోందని, తమకు అధిక ధరను ఇవ్వాలంటూ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత ప్రభుత్వం ధరలు పెంచేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి ఎన్‌హెచ్ఏఐకి కూడా సమాచారం ఇచ్చిందని, ధరల పెంపు విషయంలో ఆర్బి



ఆర్ఆర్ఆర్ పనులపై కేంద్ర మంత్రి గడ్కరీతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి (ఫైల్)

ట్రేషన్‌కు వెళ్తే అక్కడ పరిష్కారమవుతుందనే యోచనలో ఉంది. మరోవైపు రహదారిని మంజూరు చేసినప్పుడు కేంద్రం దీనికి ఎన్‌హెచ్ నెంబర్ 161ఏఏను కేటాయించినట్టు చెప్పినప్పటికీ పూర్తిస్థాయిలో నెంబర్‌ను కేటాయించలేదు. పైగా కేంద్రం నుంచి అటవీ అనుమతులు ఇచ్చినప్పటికీ.. ఇంకా పర్యావరణ అనుమతులను ఇవ్వలేదని సమాచారం. దీంతో ఈ మొత్తం అంశాలు పూర్తయ్యాకే రహదారి నిర్మాణానికి పనులు ప్రారంభంకానున్నట్టు తెలుస్తోంది. అయితే టెండర్లకు ఇచ్చిన గడువు పూర్తయ్యేనాటికి పెండింగ్ పనులన్నింటినీ పూర్తిచేయాలనే యోచనలో కేంద్రం ఉందని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

### గత ప్రభుత్వం తీరుతో ఆలస్యం..

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రీజినల్ రింగు రోడ్డును 2016లో మంజూరు చేసింది. ఆ తరువాత దానిని ఉత్తర, దక్షిణభాగాలు విభజించింది. తొలుత ఉత్తర భాగం పనుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంతోపాటు, దీనిని భారత్‌మాల పరియోజన-1లో చేరుస్తూ ఎన్‌హెచ్ 'నెంబర్ 161ఏఏ'ను కేటాయిస్తున్నట్టు తెలిపింది. కానీ, ఆ తరువాత రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీకి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఏర్పడిన రాజకీయ గిల్లికజ్జాలతో రహదారి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. రహదారి పనులకు అవసరమైన స్థాయిలో గత ప్రభుత్వం సహకరించలేదు. ఫలితంగా భూ సేకరణ నుంచి రైతులకు చెల్లించాల్సిన పరిహారం ధరల వరకు అన్నీ పెండింగ్‌లోనే పడ్డాయి. మరోవైపు యుటిలిటీ షిఫ్టింగ్‌కు ఖర్చయ్యే రూ.363.63 కోట్ల విషయంలోనూ గత ప్రభుత్వం సరిగా స్పందించలేదు. మొత్తంగా పనుల్లో ఆలస్యం రాజ్యమేలింది. ఆ తరువాత రాష్ట్రంలో గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులను ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పలుమార్లు కేంద్రంతో చర్చలు జరిపారు. యుటిలిటీ చార్జీలు చెల్లించేందుకు కూడా అంగీకరించారు. కానీ, యుటిలిటీ చార్జీలను తామే భరిస్తామంటూ కేంద్రమే భరోసానివ్వడంతో రాష్ట్రంపై రూ.363.63 కోట్ల ఆర్థికభారం కూడా తప్పింది. ఉత్తర భాగం నిర్మాణానికి రూ.15 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతున్నాయి. ఇందులో దాదాపు రూ.5,200 కోట్లు భూ పరిహారానికి చెల్లించాల్సి ఉండగా.. రాష్ట్ర వాటాగా రూ.2600 కోట్ల నుంచి రూ.3వేల కోట్ల దాకా చెల్లించాల్సి ఉంది. ఈ వాటాను.. పనులు ప్రారంభించే సమయానికి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి హామీ ఇచ్చింది.

### ఈపీసీ పద్ధతే ఎందుకంటే..

రీజినల్ రింగు రోడ్డు ఉత్తరభాగం రహదారిని ఈపీసీ పద్ధతిలో నిర్మిస్తేనే ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని ఈ రోడ్డుపై డీపీఆర్ కోసం ఎన్‌హెచ్ఏఐ నియమించిన కన్సల్టెన్సీ తమ నివేదికలో పేర్కొంది. అయితే నివేదికలో బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (బీవోటీ), హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం), ఈపీసీ పద్ధతులపై రోడ్డు నిర్మాణం చేపడితే ఎలా ఉంటుందన్న వివరాలనూ పేర్కొంది. ప్రాజెక్టు కోసం చేసే ఖర్చు, నికర మార్కెట్ విలువలు, రహదారి నిర్మాణం తరువాత వసూలు చేసే టోల్ ద్వారా వచ్చే ఆదాయాన్ని గణించిన తరువాతే ఈ పద్ధతుల్లో నిర్మిస్తే లాభదాయకమని వివరించింది. ఈ విధానాల్లో చేపట్టే నిర్మాణాలకు ప్రభుత్వం కొంతమేర గ్రాంట్ల రూపంలో నిధులను అందిస్తే నిర్మాణం పూర్తయిన తరువాత నుంచి 17ఏళ్లలోనే టోల్ వసూళ్ల రూపంలో ఆదాయం వచ్చే అవకాశం ఉందని కూడా పేర్కొంది. కాగా, రోడ్డు నిర్మాణం తరువాత 2027 నుంచి 2046 వరకు (ఆ సమయానికి రహదారి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తేనే) దాదాపు రూ.15,768 కోట్లు టోల్ వసూలు ద్వారా రాబడి ఉంటుందని, ఇది ఏటా 5 శాతం చొప్పున వాహనాల పెరుగుదల ఉంటేనే అని నివేదికలో పొందుపరిచింది.

### ఇది ప్రజా ప్రభుత్వ విజయం

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులకు కేంద్రం టెండర్లను ఆహ్వానించడం ప్రజా ప్రభుత్వ విజయం. ఇది సీఎం రేవంత్ కృషికి, నా కృషికి దక్కిన ఫలితం. రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే రోజు. ఔటర్ రింగురోడ్డు గేమ్ చేంజర్ అయితే.. ఆర్ఆర్ఆర్ సూపర్ గేమ్ చేంజర్ కాబోతోంది. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిశాం. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని వివరించాక యుటిలిటీ చార్జీలను కూడా కేంద్రమే భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఇందుకు గడ్కరీకి ధన్యవాదాలు. రహదారి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణకు సీఎం, నేను కలిసి జిల్లాల కలెక్టర్లతో సమావేశాలు నిర్వహించాం. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ప్రాజెక్టు ఆలస్యమైంది.

-మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

## గడువు ముగిసినా.. ఒక్క టెండరూ రాలే!

» ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్ తయారీకి ముందుకు రాని సంస్థలు

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం రహదారికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తయారు చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచినా.. స్పందన రాలేదు. టెండర్లు ఎన్ని వచ్చాయనే అంశాన్ని పరిశీలించి, సంస్థను ఎంపిక చేయడం కోసం శనివారం ఉదయం అధికారులు టెండర్లను ఓపెన్ చేశారు. కానీ, వెబ్‌సైట్‌లో ఒక్క టెండరూ కనిపించలేదు. 'ప్చ్ ఇదేంటి ఒక్క టెండరూ రాలేదు' అని ఆ శాఖ అధికారులు సైతం ఆశ్చర్యపోయారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీ సంస్థను ఎంపి క చేసేందుకు గత నవంబరు 25న 'ఇంటర్నేషనల్ కాంపిటీటివ్ బిడ్డింగ్' విధానంలో ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. టెండరు గడువు శుక్రవారం మధ్యాహ్నం 3గంటలతో ముగిసింది. నిబంధనల ప్రకారం శుక్రవారమే టెండర్లను పరిశీలించాల్సి ఉన్నా.. దేశ మన్మోహన్‌సింగ్ మృతితో రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో సాధ్యం కాలేదు. దీంతో శనివారం ఉదయం టెండర్ల పరిశీలనకు అధికారులు పూనుకోగా.. ఒక్క టెండరూ రాకపోవడం చూసి ఆశ్చర్యపోయారు. వాస్తవానికి డీపీఆర్ తయారీ కోసం నవంబరు 25న టెండర్లను ఆహ్వానించినప్పుడు దాఖలుకు చివరి తేదీని డిసెంబరు 16గా పేర్కొన్నారు. కానీ.. ప్రీ బిడ్ సమావేశంలో పలు అభ్యంతరాలు వ్యక్తం కావడంతో టెండర్ గడువును డిసెంబరు 27వరకు పొడిగించారు. ఇప్పటికే ఒకసారి గడువు పెంచినా ఒక్క టెండరూ రాకపోవడంతో.. మరోసారి గడువును పెంచుతూ ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జనవరి 20వరకు గడువును పొడిగించారు.

## సగం నీళ్లు కేటాయించలేం!

» గోదావరి-కావేరీ అనుసంధానం తొలి దశలో 74 టీఎంసీలు ఇవ్వలేం

» రెండో దశలోనే నీటి లభ్యత ఉంది

» తెలంగాణకు ఎన్‌డబ్ల్యూడీఏ లేఖ

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరీ అనుసంధానం తొలి దశ కింద తరలించే నీటిలో 50 శాతాన్ని(74 టీఎంసీలను) కేటాయించాలన్న తెలంగాణ డిమాండ్‌ను కేంద్రం తోసిపుచ్చింది. గోదావరి-కావేరీ అనుసంధానం( జీసీ లింక్)లో ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని వాటా నుంచి 145 టీఎంసీలను మాత్రమే తరలిస్తున్నామని, ఇది కూడా ప్రతిపాదన దశలోనే ఉందని గుర్తు చేసింది. తొలి దశలో మిగులు జలాల్లేవని, రెండో దశలో హిమాలయన్, మహానది కాంపొనెంట్ నుంచి నీటి లభ్యత ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) ఇటీవల తెలంగాణకు లేఖ రాసింది. ఇటీవల నిర్వహించిన పలు సమావేశాల్లో తెలంగాణ లేవనెత్తిన అంశాలకు ఎన్‌డబ్ల్యూడీఏ బదులిచ్చింది. గోదావరి-కావేరీ అనుసంధానం చేపట్టదల్చుకుంటే.. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీ కింద ఉన్న 152టీఎంసీల వినియోగానికి రక్షణ కల్పించాలని, బ్యారేజీలో 83 మీటర్ల నుంచి 87 మీటర్ల మధ్య నిల్వ చేసిన నీటినే తరలించాలన్న తెలంగాణ డిమాండ్ చేయగా... బ్యారేజీ వద్ద, దిగువన తెలంగాణ వినియోగానికి ఎలాంటి నష్టం ఉండదని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది, సమ్మక్కసాగర్ నుంచి గోదావరి-కావేరీ అనుసంధానానికి 78శాతం సక్సెస్ రేటు ఉందని, తెలంగాణ వినియోగానికి వచ్చిన ఇబ్బందేమీ లేదని గుర్తు చేసింది. అనుసంధానంలో తమ వాటాను వినియోగించుకోవడానికి వీలుగా గొట్టిముక్కల వద్ద రెండు రిజర్వాయర్లు కట్టాలని తెలంగాణ ప్రతిపాదించగా... తదుపరి అధ్యయనం తర్వాత నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. ఆపరేషనల్ ప్రొటోకాల్ తేల్చే దాకా నాగార్జునసాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకోరాదన్న తెలంగాణ ప్రతిపాదనపై స్పందిస్తూ.. ఆ అంశం ప్రతిపాదనల దశలోనే ఉందని, ట్రిబ్యునల్ తీర్పుకు లోబడే తదుపరి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేసింది. గోదావరి-కావేరీ నీటిని ఆల్మట్టి రిజర్వాయర్ నుంచి తరలించడానికి(వాడుకోవడానికి) వెసులుబాటు కల్పించడం వల్ల దిగువన ఉన్న జూరాల, శ్రీశైలం జలాశయాలపై ప్రభావం పడుతుందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేయగా... జూలై నుంచి అక్టోబరు వరకే ఈ నీటిని తరలించే అవకాశం ఉంటుందని కేంద్రం గుర్తు చేసింది.

### బ్యారేజీపై కొనసాగుతున్న డైలమా

గోదావరి-కావేరీ అనుసంధానం కోసం ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ కట్టి, అక్కడి నుంచే నీటిని తరలిస్తామని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించగా... గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. ఇచ్చంపల్లి నుంచి 24 కిలోమీటర్ల దిగువలోనే తుపాకులగూడెం బ్యారేజీ ఉందని, ఆకస్మికంగా వరదలు వస్తే నియంత్రించడం కష్టమని స్పష్టం చేసింది. తుపాకులగూడెం బ్యారేజీ నుంచి అనుసంధానం చేపడితే అభ్యంతరాల్లేవని పేర్కొంది. ఇదే అంశాన్ని ఇటీవల తెలంగాణ నీటిపారుదల అధికారులు తేల్చిచెప్పారు. వాస్తవానికి ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తే.. బ్యాక్‌వాటర్ నుంచి 165 టీఎంసీలను కాళేశ్వరం ప్రాజెక్టు కింద తరలించడానికి సమ్మతి తెలుపుతామని గతంలోనే కేంద్రం ఆఫర్ ఇచ్చింది. తాజాగా కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యంతో ఈ ఆఫర్‌పై చర్చ జరుగుతోంది.

## మంచి రోజు.. రిజిస్ట్రేషన్ల జోరు

### రాష్ట్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట

» రాత్రి 8 గంటల తర్వాత కూడా కొనసాగిన రద్దీ

» కొన్ని చోట్ల అర్ధరాత్రి వరకూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

» రోజూ కంటే రెట్టింపు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్

» ఒకే రోజు 100కోట్లకుపైగా ఆదాయం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖకు శనివారం కాసుల వర్షం కురిసింది. రోజూవారీ కంటే రెట్టింపు సంఖ్యలో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కావడంతో సమృద్ధిగా ఆదాయం సమకూరింది. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఓపెన్‌ప్లాట్ల రిజిస్ట్రేషన్ల కోసం రెండింతలకుపైగా క్రయ విక్రయదారులు తరలిరావడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. బుధ, గురువారాల్లో క్రిస్మస్ సెలవులు రాగా, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంతో శుక్రవారం కూడా ప్రభుత్వం సెలవు ప్రకటించిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు వరుసగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సెలవు రావడం ఒక కారణమైతే, శనివారం నాడు త్రయోదశి.. మంచి రోజని వినియోగదారులు భావించడమే రద్దీకి మరో కారణమని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 30, 31న పని దినాలే అయినప్పటికీ, సోమవారం అమావాస్య కావడం, ఆ తర్వాతి రోజు మంగళవారం కావడంతో రద్దీ అంతా ఒకే రోజు కనిపించిందని పేర్కొన్నారు. కొన్ని కార్యాలయాల్లో రాత్రి 8 గంటల తర్వాత కూడా రద్దీ తగ్గలేదు. సమయం మించిపోయినా వినియోగదారులను వెనక్కి పంపకుండా అర్ధరాత్రి వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించారు. సాధారణంగా రియల్ ఎస్టేట్ సంస్థలన్నీ తమ వినియోగదారులకు డిసెంబరులోగా అపార్ట్‌మెంట్లు, విల్లాలను అప్పగించేలా అగ్రిమెంట్లు చేసుకుంటాయి. అలాగే, బ్యాంకర్లు సైతం తమ త్రైమాసిక రుణ లక్ష్యాలను చేరుకునేందుకు డిసెంబరులో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ముందుకు వస్తుంటాయి. ఈ రెండు కారణాల వల్ల కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీ పెరిగిందని రియల్‌ఎస్టేట్ వర్గాలు చెప్పాయి.

**గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో..**

| జిల్లా | డాక్యుమెంట్లు | సమకూరిన ఆదాయం |
|---|---|---|
| హైదరాబాద్ | 400 | రూ.27కోట్లు |
| మేడ్చల్ | 1,000 | రూ.16కోట్లు |
| రంగారెడ్డి | 1,500 | రూ.27కోట్లు |

### రాష్ట్రంలో రెండింతలు..హైదరాబాద్‌లో ఇంకా ఎక్కువే

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజూ వారీ కంటే రెట్టింపు సంఖ్యలో దాదాపుగా 12వేల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరిగింది. తద్వారా ప్రభుత్వానికి రూ.100 కోట్లపైగానే ఆదాయం సమకూరినట్లు అంచనా వేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు జిల్లాల్లో కలిపి ఒక్క రోజే 2,900 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. సుమారుగా రూ.63కోట్లకుపైగా రాబడి వచ్చినట్లు భావిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని కొన్ని ముఖ్యమైన కార్యాలయాల్లో మూడింతలకుపైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయినట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో రోజు వారీ రిజిస్ట్రేషన్ అయ్యే డాక్యుమెంట్లు సాధారణంగా 5వేల నుంచి 6వేల లోపే ఉంటాయి. కానీ.. శనివారం రాత్రి 9 గంటల సమయానికి రిజిస్ట్రేషన్ల సంఖ్య 12వేలు దాటింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అత్యధిక రిజిస్ట్రేషన్లు జరగ్గా, మహేశ్వరం, గండిపేట, కుత్బుల్లాపూర్ కార్యాలయాలకు సైతం భారీగా డాక్యుమెంట్లు వచ్చినట్లు తెలుస్తోంది. గండిపేటలో సాధారణంగా రోజూ 70నుంచి 80 రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా, శనివారం 230కి పైగా డాక్యుమెంట్లు రావడం విశేషం. గండిపేట ఎస్సార్‌వోలో 150పైగా, కుత్బుల్లాపూర్‌లో 140పైగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు తెలిపారు.

## 'ఈ బువ్వ తినుడు వశమైతలేదే.. తీస్కపో'

### అమ్మానాన్నలకు దిలావర్‌పూర్ కేజీబీవీ విద్యార్థినుల ఫోన్లు

**మాడిన, పురుగుల అన్నం పెడుతున్నారని ఆవేదన.. భయంతో పిల్లలను ఇంటికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు**



పిల్లల కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు

దిలావర్‌పూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : 'ఈ బువ్వ తినుడు వశమైతలేదే.. ఓ రోజు మాడిన అన్నం పెట్టిన్రు.. ఇంకో రోజు అన్నంలో పురుగులు వచ్చాయి. భయమైతాంది. నన్ను ఇంటికి తీసుకుపో'.. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ఇటీవల తమ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మాటలివి. కొద్ది రోజులుగా సరైన భోజనం లేక వారంతా అర్ధాకలితో అల్లాడిపోతున్నారు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి శనివారం తమ పిల్లలను తీసుకెళ్లిపోయారు. పాఠశాలలో 360 మంది విద్యార్థినులు ఉండగా వారిలో 210 మంది తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామాలకు వెళ్లిపోయారు. విగిలిన వాళ్లు కూడా నేడో రేపో వెళ్లిపోయే అవకాశం ఉంది. నిజానికి, సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తుండడంతో కొద్ది రోజులుగా పాఠశాలలో తరగతులు జరగడం లేదు. కానీ, విద్యార్థులు తమలో తామే కలిసి చదువుకుంటున్నారు. ఈ లోగా బోధనేతర సిబ్బంది కూడా సమ్మె బాట పట్టారు. అయితే, ఆహారం విషయంలో విద్యార్థులు ఇబ్బంది పడకూడదని అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కానీ, కొత్తగా వచ్చిన వంట సిబ్బంది చేస్తున్న వంటను తినలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మూడు రోజులుగా అర్ధాకలితో గడుపుతున్నారు. కొత్త సిబ్బంది ఉదయం అల్పాహారాన్ని పదిన్నర గంటలకు ఇస్తున్నారని, అది కూడా అరకొరగా వడ్డిస్తున్నారని విద్యార్థినులు చెబుతున్నారు. ఇక, గురువారం మాడిపోయిన అన్నం వడ్డించారని, శుక్రవారం వడ్డించిన అన్నంలో తేక పురుగులు వచ్చాయని, శనివారం బొద్దింక వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పక్క తరగతులు జరగక, మరోపక్క సరైన ఆహారం లేకపోవడంతో విద్యార్థినులు తల్లిదండ్రులకు ఫోన్లు చేశారు. దీంతో శనివారం పాఠశాలకు వచ్చి తమ పిల్లలను తీసుకెళ్లారు. అక్కడే ఉన్న తహసీల్దార్ స్వాతి వారికి నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. పిల్లల ప్రాణాల కన్నా చదువు ముఖ్యం కాదంటూ పలువురు తల్లిదండ్రులు వాపోయారు.


స్వామి బోధమయానంద ఆధ్వర్యంలో సత్తుపల్లిలో విద్యార్థులతో భారీ ర్యాలీ

## మనిషికి విలువలు, వ్యక్తిత్వం ఉండాలి

- రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద
- సత్తుపల్లిలో తెలుగు రాష్ట్రాల 6వ భక్త సమ్మేళనం

సత్తుపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వం, విలువలు ఉంటే మనిషి అద్భుతమైన శక్తిని సాధించగలుగుతాడని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద చెప్పారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 6వ భక్త సమ్మేళనం శనివారం స్థానిక మాధురి ఫంక్షన్‌హాల్‌లో ప్రారంభమైంది. మొదటి రోజు విద్యార్థుల సమ్మేళనంలో స్వామి బోధమయానంద ప్రసంగిస్తూ అనవసర పనులతో సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. సమయపాలన అలవరచుకోవాలని సూచించారు. ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప బహుమతి స్వామి వివేకానంద అని తెలిపారు. విజయవాడ రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి శితికంఠానంద మాట్లాడుతూ వివేకానందుడి స్ఫూర్తితో యువత జాగృతం కావాలన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ మనిషిలో దైవత్వం నింపడమే అన్నిమతాల సారాంశమన్నారు. అంతకుముందు సత్తుపల్లిలో 2వేల మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

## చిక్కిన లంచావతారాలు !

- భూ సర్వే, నాలా కన్వర్షన్‌కు రైతుల నుంచి లంచాలు
- సర్వేయర్, డిప్యూటీ తహసీల్దార్‌ను పట్టుకున్న ఏసీబీ

శంకరపట్నం, దమ్మపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూ సర్వే, నాలా కన్వర్షన్ కోసం లంచాలు తీసుకుంటూ సర్వేయర్, డిప్యూటీ తహసీల్దార్‌లు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శనివారం ఈ ఘటనలు జరిగాయి. భద్రాద్రి జిల్లా దమ్మపేట దమ్మపేటకు చెందిన రైతు వెంకట్ తన భూమిని సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కోరుతూ.. రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ మెరుగు వెంకటరత్నంను కలిశాడు. ఇందుకు ఆ సర్వేయర్ రూ.1.50 లక్షల లంచం డిమాండ్ చేశాడు. నెల రోజులుగా సర్వేయర్ చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతు ఆయనకు లంచం ఇచ్చేందుకు అంగీకరించి, ఈ సమాచారాన్ని ఏసీబీ అధికారులకు తెలిపాడు. శనివారం సర్వేయర్‌కు ఆ రైతు అడ్వాన్స్‌గా రూ.50 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు సర్వేయర్‌ను అరెస్టు చేశారు. అలాగే, కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామానికి చెందిన కలకుంట్ల నవీన్‌రావు సర్వే నం.253లో తనకున్న వ్యవసాయ భూమిలో నుంచి 2.25 గుంటల్లో పాడి గేదెల పెంపకానికి షెడ్డు నిర్మాణం చేపట్టేందుకు నాలా కన్వర్షన్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. డిప్యూటీ తహసీల్దార్ మల్లేశాన్ని సంప్రదించగా ఆయన రూ.10వేలు డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం మల్లేశానికి నవీన్‌రావు రూ.6వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారుల బృందం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది.

## కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం నేడు

చేర్యాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఆలయ ప్రాంగణంలోని తోటబావి ప్రదేశంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కల్యాణ మండపంలో వీరశైవాగమ శాస్త్రం ప్రకారం కేతలమ్మ, మేడలాదేవీలను స్వామి వివాహమాడనున్నారు. కల్యాణంతో మూడు నెలలపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలతో అలంకరించి, తలంబ్రాలు అందజేయనున్నారు.

## ఆన్‌లైన్ గేమ్స్, ట్రేడింగ్ పేరుతో 1.36కోట్ల టోకరా

- ప్రభుత్వాధికారిని మోసం చేసిన ఎక్సైజ్ కానిస్టేబుల్

కోల్‌సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌లు, ట్రేడింగ్‌లలో పెట్టుబడి పెడితే భారీ మొత్తంలో లాభాలొస్తాయని ఓ ప్రభుత్వ అధికారిని నమ్మించి రూ.1.36కోట్లకు టోకరా వేశాడో ఎక్సైజ్ కానిస్టేబుల్. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం పట్టణానికి చెందిన అబ్దుల్ నయీం నిర్మల్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. రామగుండం పట్టణానికే చెందిన ఒక వ్యక్తి పెద్దపల్లిలో విద్యుత్ శాఖలో అధికారిగా పనిచేస్తున్నారు. వీరిద్దరికి ఉన్న పరిచయంతో నయీం సదరు అధికారికి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లు, గేమ్ యాప్‌లలో పెట్టుబడులు పెడితే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయంటూ నమ్మించాడు. దీంతో సదరు అధికారి మూడు నెలల వ్యవధిలో రూ.1,36,96,290 నయీం ఖాతాలో వేశారు. ట్రేడింగ్ చేస్తున్నామని, త్వరలోనే లాభాలు వస్తాయంటూ నయీం ఆయన్ను నమ్మిస్తూ వచ్చాడు. మోసపోయానని గ్రహించిన బాధితుడు ఈ నెల 24న రామగుండం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు నయీంను మంచిర్యాలలో అదుపులోకి తీసుకున్నారు.

## ఫోన్ మాట్లాడుతూ విద్యుత్ తీగను తాకి..

- ఇంటి మేడ మీదే విద్యుదాఘాతానికి బాలుడి బలి

గుర్రంపోడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడు తమ ఇంటి మేడ మీద నిలబడి ఫోను మాట్లాడుతూ యథాలాపంగా విద్యుత్ తీగలను తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం మక్కపల్లిలో శనివారం జరిగిన ఈ ఘటనలో నేతాళ్ల కిరణ్(15) అనే బాలుడు మరణించాడు. మక్కపల్లికి చెందిన నేతాళ్ల పెద్దరాజు దంపతుల చిన్న కుమారుడు కిరణ్.. పదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం నిద్ర లేచిన కిరణ్.. పళ్లు తోముకుంటూ తమ ఇంటి మేడ మీదకు వెళ్లాడు. అక్కడే ఫోన్ మాట్లాడుతూ.. ఇంటిపై నుంచి చేతికందే ఎత్తులో వెళుతున్న 11కేవీ విద్యుత్ తీగలను అనుకోకుండాతాకి విద్యుదాఘాతానికి గురయ్యాడు. విద్యుదాఘాతం దెబ్బకు కిరణ్ చెయ్యి కాలిపోయింది. కాసేపటికి తల్లిదండ్రులు మేడ మీదకు వచ్చి చూడడంతో జరిగిన దారుణం తెలిసింది. ఈ ఘటనపై పెద్దరాజు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని పెద్దరాజు దంపతులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం తాము ఇంటి నిర్మాణం చేపట్టినప్పటి నుంచి... ఇంటి మీదుగా వెళుతున్న 11కేవీ విద్యుత్ తీగలను పక్కకు జరపాలని అధికారులను ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదన్నారు.

## మైనర్ బాలిక పాస్‌పోర్ట్‌కు విదేశీయుడైన తండ్రి అనుమతి అవసరం లేదు:హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మైనర్‌కు పాస్‌పోర్ట్ ఇచ్చే విషయంలో విదేశీ పౌరుడైన తండ్రి అనుమతి అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. మైనర్‌కు సహజ సంరక్షకురాలిగా ఉండే తల్లి అనుమతి చాలని తెలిపింది. ఆమె చేసిన దరఖాస్తు ఆధారంగా పాస్‌పోర్ట్ జారీచేయాలని పాస్‌పోర్ట్ అథారిటీకి ఆదేశాలు జారీచేసింది. సింగిల్ పేరెంట్ ఏదైనా కారణాల చేత మరో పేరెంట్ అనుమతి పొందలేని స్థితిలో ఉంటే.. దరఖాస్తు చేసే వ్యక్తే అన్ని లాంఛనాలు పూర్తిచేసి పాస్‌పోర్ట్ కోరవచ్చు అని నిబంధనల్లో ఉందని ధర్మాసనం తెలిపింది. డాక్టర్ సనా ఫాతిమా అనే మహిళ తన కుమార్తెకు పాస్‌పోర్ట్ ఇవ్వాలని చేసిన దరఖాస్తును తండ్రి అనుమతి లేదనే కారణంతో రీజనల్ పాస్ట్‌పోర్ట్ ఆఫీసర్ తిరస్కరించారు. దానిపై ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ మౌసమీ భట్టాచార్య తీర్పునిచ్చారు.

## నా పాస్‌పోర్ట్ నవీకరణ చేయడం లేదు

- హైకోర్టులో ఎంపీ రఘునందన్‌రావు పిటిషన్

తన పాస్‌పోర్ట్‌ను నవీకరణ చేయడం లేదని పేర్కొంటూ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఆయనపై ఉన్న క్రిమినల్ కేసులకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ ఎదుట ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు, పాస్‌పోర్ట్ అథారిటీ ఎదుట ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు మధ్య తేడాలు ఉండటంతో రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ పాస్‌పోర్టు జారీకి నిరాకరించారు. దీనిని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య ధర్మాసనం విచారణ చేపట్టింది.

# సాగర్ డ్యామ్‌పై హైడ్రామా!

### ప్రాజెక్టు భద్రతపై దోబూచులాట!.. కేంద్రం ఆదేశంతో డ్యామ్‌ను వీడిన సీఆర్‌పీఎఫ్

- సీఐఎస్‌ఎఫ్‌ను పెట్టాలని కేంద్రం యోచన
- అభ్యంతరం తెలిపిన తెలుగు రాష్ట్రాలు
- కేఆర్‌ఎంబీ విన్నపంతో మళ్లీ సీఆర్‌పీఎఫ్


నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం వద్ద భద్రత విధుల్లో ఉన్న టీజీఎస్పీఎఫ్ పోలీస్

నాగార్జునసాగర్/హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లోని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు నాగార్జునసాగర్ భద్రతపై శనివారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రాజెక్టు భద్రత బాధ్యతను శనివారం ఉదయం సీఆర్‌పీఎఫ్ నుంచి టీజీఎస్పీఎఫ్ తీసుకోగా, సాయంత్రానికి సీఆర్‌పీఎఫ్ తిరిగి తమ అధీనంలోకి తీసుకుంది. డ్యామ్ భద్రతకు సీఆర్‌పీఎఫ్ స్థానంలో పారిశ్రామిక భద్రత బలగాల (సీఐఎస్‌ఎఫ్)ను మోహరించాలని కేంద్రం నిర్ణయించడం, దీనిపై రెండు తెలుగు రాష్ట్రాలు అభ్యంతరం తెలపడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. డ్యామ్‌ను వీడాలని సీఆర్‌పీఎఫ్‌కు కేంద్రం ఆదేశాలివ్వడంతో.. తెలంగాణ వైపు క్యాంపును సీఆర్‌పీఎఫ్ బలగాలు శనివారం ఉదయం ఖాళీ చేశాయి. దీంతో ఆ స్థానంలో తెలంగాణ స్టేట్ పోలీస్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) బలగాలు డ్యామ్‌పై పహారా కాశాయి. అయితే సీఐఎస్‌ఎఫ్ అవసరం లేదని తెలుగు రాష్ట్రాలు తేల్చిచెప్పడంతో మళ్లీ సీఆర్‌పీఎఫ్‌ను వెనక్కి రప్పిస్తూ కేంద్రం ఆదేశాలు వెలువరించింది. మూడు రోజులుగా ఈ పరిణామాలు చోటుచేసుకుంటుండగా.. యంత్రాంగంతోపాటు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) ఈ విషయాన్ని గోప్యంగా ఉంచింది. జనవరి 21న కేఆర్‌ఎంబీ సమావేశం కానుండడం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణను పూర్తిగా తమకు అప్పగించాలనే తెలంగాణ డిమాండ్‌పై చర్చ జరగనున్న నేపథ్యంలో తాజా పరిణామం కలకలం రేపింది.

### ఎన్నికల ముంగిట పరిణామాలతో..

వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ అనంతరం శ్రీశైలం ప్రాజెక్టు ఏపీ నిర్వహణలో, నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్ర నిర్వహణలో కొనసాగుతుండేవి. దాదాపు తొమ్మిదిన్నరేళ్ల పాటు ఇలా కొనసాగాయి. అయితే 2023 నవంబరు 29న తెలంగాణ పోలీసు యంత్రాంగమంతా ఎన్నికల నిర్వహణలో నిమగ్నమైన వేళ.. అర్ధరాత్రి ఏపీ ప్రభుత్వం భారీ పోలీసు బలగంతో సాగర్‌లో ఆ రాష్ట్రం వైపు ఉన్న డ్యామ్ భాగాన్ని ఆక్రమించుకుంది. మరికొన్ని గంటల్లో తెలంగాణలో ఎన్నికలు జరుగునుండగా... జరిగిన ఈ చర్యను తెలుగు రాష్ట్రాల్లోని విపక్ష పార్టీలు తీవ్రంగా తప్పుబట్టాయి. తాము కోరినన్ని నీటిని సాగర్ నుంచి విడుదల చేయనందువల్లే ఈ చర్యకు పాల్పడినట్లు అప్పటి జగన్ ప్రభుత్వం బుకాయించింది. అయితే నీళ్లకోసం ఇండెంట్ సమర్పించకుండా ఇదేం పద్ధతి? అంటూ కృష్ణాబోర్డుతో పాటు కేంద్రం కూడా తప్పుబట్టింది. అనంతరం తెలంగాణలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం 2023 నవంబరు 28కి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలని కోరింది. దీనిపై కేంద్ర హోంశాఖతో పాటు కేంద్ర జలశక్తి శాఖ వరుసగా సమావేశాలు నిర్వహించాయి. ఈ క్రమంలో సాగర్ డ్యామ్‌ను అటు ఏపీ అధీనంలో, ఇటు తెలంగాణ అధీనంలో కాకుండా.. కృష్ణాబోర్డు పాక్షిక నియంత్రణలోకి తీసుకెళ్లారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు మాత్రం తెలంగాణ చూస్తోంది.

### డ్యామ్ నిర్వహణ కోరుతున్న తెలంగాణ..

జాతీయ ఆనకట్టల భద్రత చట్టం(ఎన్‌డీఎస్‌ఏ)-2021లోని సెక్షన్ 16(1ఏ) ప్రకారం నాగార్జునసాగర్ భద్రతకి సంబంధించిన నిఘా, 16(1బీ) ప్రకారం తనిఖీలు, 16(1సీ) ప్రకారం నిర్వహణ, పర్యవేక్షణ వంటి కార్యకలాపాలు తెలంగాణ పరిధిలోకి రావాలని, యావత్ జలాశయం నిర్వహణ, పర్యవేక్షణ, యాజమాన్యానికి సంబంధించిన కార్యకలాపాలన్నింటినీ తమకే అప్పగించాలని తెలంగాణ గుర్తు చేస్తోంది. రానున్న బోర్డు సమావేశంలో ఏపీని ఒప్పించి.. డ్యామ్ నిర్వహణ తమకే అప్పగించాలని కోరాలనుకునే సమయంలో భద్రతకు సంబంధించి తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ములుగు బెటాలియన్‌కు బయలుదేరిన బలగాలు.. తిరిగి వెనక్కి వచ్చాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము సాగర్ డ్యామ్ భద్రత నుంచి వైదొలగి వెళ్లిపోయామని సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ షాహీర్ తెలిపారు. కేఆర్‌ఎంబీ నుంచి సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులకు లేఖలు అందడంతో వారి ఆదేశానుసారం మళ్లీ విధుల్లోకి చేరామని చెప్పారు.

## రిమోట్ సెన్సింగ్‌తో సాగుభూమి గుర్తింపు: తుమ్మల



హైదరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని పక్కాగా అంచనా వేయనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సంక్రాంతి నుంచి రైతు భరోసా' పథకం ప్రారంభించనున్న నేపథ్యంలో సచివాలయంలో శనివారం మంత్రి కీలక సమావేశం నిర్వహించారు. రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసే పలు కంపెనీ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాగులో ఉన్న భూమికి మాత్రమే పెట్టుబడి సాయం అందించడం తమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సాగు చేసిన భూములను వ్యవసాయ విస్తీర్ణాధికారులతో ఎప్పటికప్పుడు రైతు వారీగా నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోని సర్వే నెంబర్ల వారిగా సాగులో ఉన్న భూముల విస్తీర్ణం, సాగుకు అనువుగా లేని విస్తీర్ణంతో పాటు ప్రస్తుతం ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు అయిందనే మొత్తం వివరాలను పొందుపరచనున్నట్లు వివరించారు. రైతు భరోసా అమలుతో పాటు, పంటల బీమా అమలు, పంటల ఆరోగ్య స్థితి, ఎదుగుదల, చీడపీడలను ఆరంభములోనే గుర్తించడం, వరదలు, తుపానుల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడంలో నూతన సాంకేతికను అందిపుచ్చుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ఆయన తెలిపారు. సమావేశానికి హాజరైన వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంతకుముందు చేపట్టిన ప్రాజెక్ట్ వివరాలతోపాటు, నమూనాగా వాళ్లు చేసిన రెండు మండలాలకు సంబంధించి గ్రామాల వారిగా శనివారం వరకు సాగైన పంటల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదేవిధంగా సాగుకు అనువుగా లేని ప్రాంతాలను డిజిటల్ మ్యాప్‌లతో చూపించారు. పంటలలో తలెత్తే చీడపీడలను ఆరంభములో గుర్తించే విధంగా ఆయా కంపెనీలు ఏఐ పరిజ్ఞానంతో తయారు చేసిన అంశాలను వివరించారు. సాంకేతిక కమిటీ వీటన్నిటిని పరిశీలించి మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం మేరకు క్యాబినెట్ ఆమోదానికి పంపుతుందని కంపెనీ ప్రతినిధులకు మంత్రి తుమ్మల వెల్లడించారు.

## సంక్రాంతిలోపే భూ భారతి!

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి అంశాన్ని రైతుల కోణంలో పరిశీలించి డిజిటల్ ప్లాట్‌ఫాం ఎలా ఉండాలనేదానిపై కసరత్తు చేస్తున్నారు. తొలి పేజీలో ఏయే అంశాలు కనిపించాలి? ప్రజలకు సులువుగా, యూజర్‌ఫ్రెండ్లీగా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేదానిపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే మూడు రకాల ప్రతిపాదనలు సీసీఎల్ఏ సిద్ధం చేసింది. వీటిని త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డికి పంపనుంది. సీఎం ఆమోదం పొందిన వెంటనే ఆచరణలోకి తీసుకురానున్నారు. గవర్నర్ నోటిఫై చేసిన వెంటనే భూభారతి-2024 అమల్లోకి రానుంది. ఈ ప్రక్రియ అంతా సంక్రాంతి లోపే ముగించేసి అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

భూభారతి చట్టంపై ఇప్పటికే ప్రజల నుంచి సానుకూల స్పందన రావడంపై సీఎం రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. చట్టం అమల్లోనూ లోటుపాట్లు, విమర్శలకు తావులేకుండా ఉండేలా నిబంధనల రూపకల్పన చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సీసీఎల్ఏ అధికారులు అంశాల వారీగా మార్గదర్శకాలపై దృష్టిసారించారు. గ్రామ స్థాయి రెవెన్యూ సిబ్బంది జాబ్ చార్ట్‌తోపాటు, భూభారతి-2024 చట్టం అమలుకు సంబంధించి కీలక అంశాల విషయంలో నిబంధనల రూపకల్పనలో అధికారులు తలమునకలై ఉన్నారు. జనవరి మొదటి వారంలోపు గవర్నర్ నోటిఫై చేసే అవకాశం ఉందని భావిస్తున్న సీసీఎల్ఏ అధికారులు.. ఈలోపు ఆపరేషనల్ గైడ్‌లైన్స్ రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వారసత్వ బదిలీ కాకుండా మిగిలిన భూలావాదేవీల విషయంలో, సాగులో ఉండి హక్కు పత్రాలు లేని సుమారు 10 లక్షల ఎకరాలకు సంబంధించిన రైతులకు హక్కు పత్రాలు ఎలా ఇవ్వాలి? 1971కి ముందు పాస్‌పుస్తకాలు ఉండి, 2020 ధరణిలో పాస్‌పుస్తకాలు రాని వారికి భూ భారతి చట్టంలో పాస్‌పుస్తకాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఇలాంటి సమస్యలపై న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా ఉండేలా నిబంధనలు రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. లావోని పట్టా, 38-ఈ సర్టిఫికెట్, 13-బి సర్టిఫికెట్, ఓఆర్‌సీ, సేల్ సర్టిఫికెట్ ద్వారా హక్కులు పొంది ఉన్న వారు ఆర్డీవోకు దరఖాస్తు చేసుకుంటే హక్కుల రికార్డులో మార్పులు చేసి ఇలాంటి వారికి పాస్‌పుస్తకాలు ఇచ్చేలా భూభారతి చట్టంలో అవకాశం కల్పిస్తున్నందున మార్గదర్శకాల్లో స్పష్టత ఇచ్చేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 9.24 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి పాస్‌పుస్తకాలు ఇచ్చే విషయంలో ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలిసింది.

# ‘భాష’ ధ్యాస ఉన్నవారికే ఓట్లు

### ప్రజలు ఆ దిశగా అడుగులేయాలి.. అప్పుడే భాషకు ప్రభుత్వాల పెద్దపీట

- సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ ఎన్వీ రమణ
- విజయవాడలో ఘనంగా ప్రారంభమైన
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు


ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో ప్రసంగిస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ

విజయవాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): “భాషాభివృద్ధికి పాటుపడే నేతలకు మాత్రమే ఓట్లు వేస్తామని ప్రజలు నిర్ణయించుకుంటే అన్ని రాజకీయ పార్టీలు తెలుగు భాషకు పట్టం కడతాయి. ప్రభుత్వాలు పెద్దపీట వేస్తాయి. భాష ధ్యాస ఉన్నవారికే ఓట్లు వేయాలి” అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. తెలుగు భాషా రచయితలు, కవులు, భాషాభిమానులు ఎన్ని మహాసభలు నిర్వహించినా, ఎన్ని నినాదాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఈ పరిస్థితిని మార్చే ఆయుధం ప్రజల ఓటేనని స్పష్టం చేశారు. ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభలు విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జస్టిస్ ఎన్వీ రమణ ప్రారంభోపన్యాసం చేశారు. “భాషాభిమానం ఉన్నవారు ముఖ్యమంత్రులు, మంత్రులుగా ఉన్నప్పుడు భాషకు న్యాయం జరుగుతుంది. రచయితలు దివిటీ పట్టుకుని ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే రచనలు చేయాలి. రచయితలు.. ప్రభుత్వాలు ఇచ్చే అవార్డులు, రివార్డులు మరిచిపోయి రచనలు చేయాలి. భాష అంతరించిపోతే పత్రికలు చదివేవారు, చానళ్లు వీక్షించేవారు కూడా ఉండరు. పత్రికలు, చానళ్లు భాషాభివృద్ధికి పాటుపడాలి. భాష విషయంలో తమిళనాడులో ఉన్న ఐక్యత తెలుగు ప్రజల్లోనూ రావాలి. ఏపీలో వీలైనంత త్వరగా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి. పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడానికి వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 85ను కూటమి సర్కారు రద్దు చేయాలి. దీనికి సంబంధించి గుంటుపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు జీవోను రద్దు చేసింది. అయినా, వైసీపీ ప్రభుత్వం దీనిపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్పీ) దాఖలు చేసింది. దాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి. అదేవిధంగా రాష్ట్రంలో తిరిగి భాషా ప్రాధికార సంస్థను నెలకొల్పాలి” అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. వైసీపీ ప్రభుత్వం వేధించిన వారిలో తాను కూడా ఒక బాధితుడినేనని జస్టిస్ ఎన్వీ రమణ పరోక్షంగా వ్యాఖ్యానించారు. తెలుగు భాష అభివృద్ధి, పాఠశాలల్లో తెలుగు మాధ్యమం గురించి మాట్లాడినప్పుడు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలుగును అణగదొక్కడానికి గత ప్రభుత్వం జీవో 85ను తీసుకొచ్చిందన్నారు. ఆ ప్రభుత్వంలో అనేక ఘటనలు జరిగాయని, వాటిలో తాను కూడా ఒక బాధితుడిగా మిగిలానని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ.. తెలుగు మాధ్యమంలో చదువుతున్నవారికి విద్య, ఉద్యోగాల్లో 3-5% అదనపు మార్కులు ఇవ్వాలని కోరారు. ఈ విధానాన్ని అమలు చేస్తే తెలుగు భాష మనుగడకు ఎలాంటి ప్రమాదం ఉండదని చెప్పారు. దేశంలో ఒకప్పుడు రెండోస్థానంలో ఉన్న తెలుగు భాష నాలుగో స్థానానికి పడిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. తమిళనాడులోని కృష్ణగిరి ఎంపీ గోపీనాథ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని, ప్రజలు దీనికోసం పోరాటం చేయాలని, అవసరమైతే తానే నిరాహార దీక్షకు దిగుతానని చెప్పారు. తాను ఎప్పటికీ తెలుగు బిడ్డనేనని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగు పత్రికల సర్క్యులేషన్ పెరిగేలా పత్రికల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీగా ఢిల్లీలో ఉంటున్నా తనకు చదవడానికి తెలుగు పత్రిక దొరకలేదని చెప్పారు. తమిళులకు ఇబ్బంది వస్తే ఆ సమాజం మొత్తం రాజకీయాలకతీతంగా స్పందిస్తుందని, అదే ఐక్యత తెలుగు జాతిలోనూ రావాలని ఆయన ఆకాంక్షించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. శాసనాల ద్వారా సమాజాన్ని కొంత వరకే నియంత్రించగలమని, అధిక శాతం మార్పు రావాలంటే సాహిత్యం ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. ఇలాంటి సభలు జరగడం ద్వారా తెలుగు భాష పరిపుష్టం కావడంతోపాటు సాహిత్యం, పద్యం, గద్యం, కథ, కథానికలు వంటి కవితా ప్రక్రియలన్నీ చిరస్థాయిగా నిలుస్తాయన్నారు.

### ఆధునికతను ఆహ్వానిస్తూనే ‘అమ్మ’ను కాపాడుకోవాలి: గోరటి వెంకన్న

సమాజంలో రోజురోజుకూ వస్తున్న ఆధునికతను ఆహ్వానిస్తూనే మాతృభాష, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో రైతులు 1,000 రకాల ధాన్యాల పేర్లను చకచకా చెబుతారని, మార్కెట్ శక్తులు మొట్టమొదట దాడి చేసేది భాష మీదేనని చెప్పారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా తెలుగు భాష పరిరక్షణకు పాటుపడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

## నల్లమలలో కనువిందు చేసిన పెద్దపులి



మన్ననూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో శనివారం మధ్యాహ్నం పర్యాటకులకు పెద్దపులి కనిపించింది. మన్ననూరు రేంజ్‌లోని పర్హాబాద్ గేటు నుంచి సఫారీ వాహనంలో శనివారం ఉదయం బయలుదేరిన పర్యాటకులు వ్యూ పాయింట్‌కు వెళుతున్న క్రమంలో నిజాం నవాబు బంగ్లా పరిసర ప్రాంతంలో రోడ్డు దాటుతూ పెద్దపులి కనిపించింది. పర్యాటకులు సెల్‌ఫోన్లలో పెద్దపులి వీడియోలను చిత్రీకరించారు. మరో పులి శుక్రవారం సాయంత్రం పర్హాబాద్ రూట్లో కనిపించింది. పులి కనిపించిన విషయం వాస్తవమేనని మన్ననూరు అటవీ రేంజ్ డీఆర్వో రవి కుమార్ ధ్రువీకరించారు.

## భద్రాద్రి రామయ్యకు 40లక్షల విలువైన రత్నాంగి కవచం

### సమర్పించిన హైదరాబాద్‌కు చెందిన భక్తులు



భద్రాచలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి రత్నాలతో పొదిగిన రత్నాంగి కవచాన్ని హైదరాబాద్‌కు చెందిన భక్తులు పిన్నమనేని బాలమురళీకృష్ణ, శాంతి దంపతులు సమర్పించారు. 51 వేల రత్నాలతో పొదిగిన ఈ రత్నాంగి కవచాన్ని శనివారం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవితో పాటు ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, కోటి రామస్వరూప్ రాఘవాచార్యులకు అందజేశారు.




Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.